


# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY




SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 24 | అమలాపురం | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | గురువారం 16 అక్టోబర్ 2025 | పేజీలు : 12 | వెల : 2/-



## మీ ప్రాంతాల్లో మీరే మోదీ

- నా తరపున ప్రభుత్వ పథకాలపై ప్రజలకు గ్యారెంటీ ఇవ్వండి
- ప్రభుత్వ పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లండి..
- బిహార్ బీజేపీ కార్యకర్తలకు మోదీ దిశానిర్దేశం
- ప్రభుత్వ పథకాలకు, పౌరులకు మధ్య వారధిగా కార్యకర్తలు నిలవాలి
- ప్రభుత్వ పథకాలతో ప్రజలకు ఏవిధమైన లబ్ధి చేకూరుతోందో ఇంటింటికీ వెళ్లి వారికి వివరించాలి

5




## మళ్లీ భగ్గుమన్న పాక్-అఫ్ఘాన్ సరిహద్దు

- పరస్పరం దాడులు.. పదుల సంఖ్యలో మృతి
- మధ్యవర్తిత్వం కోసం ఖతార్, సౌదీకి పాకిస్థాన్ విజ్ఞప్తి
- 48 గంటలు కాల్పుల విరమణ పాటించేలా తాత్కాలిక సంధి

# గూగుల్ డేటా సెంటర్ రావడంలో మోదీ చొరవ







- కేంద్ర మంత్రులు నిర్మల, అశ్వినీ వైష్ణవ్ సహకరించారు
- దేశంలోనే అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి ఇది
- ప్రధాని పర్యటనతో శ్రీశైలానికి మహర్దశ
- టెలికాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు
- పౌరసేవలు, ఆర్టీజీఎస్‌పై సమీక్షిస్తున్న సీఎం చంద్రబాబు

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

రాష్ట్రానికి గూగుల్ డేటా హబ్ రావటంలో ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, అశ్వినీ వైష్ణవ్‌ల చొరవ ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. విశాఖలో గూగుల్ 15 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టనుందని, ఇది దేశంలోనే అతి పెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి అని చెప్పారు. ప్రధాని మోదీ రాకతో శ్రీశైల క్షేత్రానికి మహర్దశ రాబోతోందని... తిరుమల తరహాలో ఈ పుణ్యక్షేత్రాన్ని అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. గురువారం రాష్ట్రంలో మోదీ పర్యటించనున్న నేపథ్యంలో మంత్రులు, ఉమ్మడి కర్నూలు జిల్లా కూటమి ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నేతలతో టెలికాన్ఫరెన్స్‌లో చంద్రబాబు బుధవారం మాట్లాడారు. మోదీ పర్యటన, 'సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్' సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. 'రూ.13 వేల కోట్ల విలువైన ప్రాజెక్టులకు మోదీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారు. డబుల్ ఇంజిన్ సర్కారుతో రాష్ట్రానికి అనేక ప్రయోజనాలు చేకూరుతున్నాయి. కేంద్ర సహకారంతో అనేక పాలసీలు, సంక్షేమ కార్యక్రమాలతో రాష్ట్రానికి లాభం చేకూరుతోంది. 1998లో మైక్రోసాఫ్ట్ రాకతో హైదరాబాద్‌లో ఐటీ ఎకో సిస్టం ఏర్పడి.. నాలెడ్జ్ ఎకానమీకి పునాది పడింది. గూగుల్ విశాఖ రావడంలో విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేశ్ ప్రధాన పాత్ర పోషించారు. - మిగతా 2లో

## విశాఖ ఉక్కుకు భరోసా



- సీఎం చంద్రబాబు 'ఉక్కు' సంకల్పంతో
- స్టీల్ ప్లాంటుకు 2,400 కోట్ల సాయానికి ఉత్తర్వులు
- మూడేళ్ల వరకూ విద్యుత్, నీటి చార్జీలకు ఊరట
- డబ్బుకు బదులు ప్రిఫరెన్షియల్ షేర్లు చాలన్న ప్రభుత్వం
- నాడు స్టీల్ ప్లాంట్ విద్యుత్ చార్జీల చెల్లింపునకు మూడు నెలలు గడువు కోరినా జగన్ ససేమిరా

2

# జీఎస్టీ 2.0 సంబరం

- ప్రధాని మోదీ ముఖ్యఅతిథిగా నేడు కర్నూలులో భారీ బహిరంగ సభ
- హాజరుకానున్న సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్
- మొత్తం 450 ఎకరాల స్థలంలో సభకు ఏర్పాట్లు
- 40 ఎకరాల్లో మూడు పెద్ద టెంట్లు
- రూ. 13,429 కోట్ల ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు
- తొలుత శ్రీశైలం మల్లన్న దర్శనం



**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

కేంద్రం ప్రవేశపెట్టిన జీఎస్టీ 2.0 సంస్కరణలతో ప్రజలకు కలిగే ప్రయోజనాలను వివరించి చెప్పేందుకు వస్తున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీకి భారీ స్వాగతం పలికేందుకు కర్నూలు నగరం ముస్తాబైంది. 'సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్' పేరుతో గురువారం జరిగే బహిరంగసభకు సుమారు మూడు లక్షల మంది హాజరవుతారని అంచనా. ఈ సభకు కర్నూలు శివారులోని నన్నూరు వద్ద 450 ఎకరాల్లో ఏర్పాట్లుచేశారు. సభకు 40 ఎకరాల్లో మూడు భారీ టెంట్లు నిర్మించారు. వర్షం వచ్చినా ఇబ్బంది లేకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఇక్కడినుంచే రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల నిర్మించిన, నిర్మించబోతున్న రూ.13,429 కోట్ల విలువైన ప్రాజెక్టులకు ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్‌గా ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నారు. రూ.546 కోట్లతో పూర్తిచేసిన రైల్వే ప్రాజెక్టులు, శ్రీకాకుళం-అంగుల్ మధ్య 422 కి.మీ. మేర రూ.1,733 కోట్లతో నిర్మించిన సహజవాయు పైప్‌లైన్ ప్రాజెక్టులను జాతికి అంకితం చేస్తారు. కృష్ణాజిల్లాలో రూ.362 కోట్లతో చేపట్టిన రక్షణ పరికరాల ఉత్పత్తి ప్రాజెక్టు, చిత్తూరు జిల్లాలో రూ.200 కోట్లతో చేపట్టిన ఇండేన్ బాట్లింగ్ ప్లాంటు, ముద్దనూరు-కడప హైవేలో పాపాఘ్ని నదిపై నిర్మించిన వంతెనలను ప్రారంభిస్తారు. ప్రధాని భారత వాయుసేన విమానంలో దిల్లీ నుంచి బయలుదేరి ఉదయం 9.55 గంటలకు కర్నూలు చేరుకుంటారు. అక్కడినుంచి సైనిక హెలికాప్టర్లో శ్రీశైలం వెళ్తారు. భ్రమరాంబ, మల్లికార్జున స్వామివార్లను దర్శించుకుని - మిగతా 2లో

# పంచాయతీల వర్గీకరణతో ప్రజలకు మెరుగైన సేవలు



- పంచాయతీ కార్యదర్శుల సంఘం ప్రతినిధులతో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్
- చిత్తడి నేలల గుర్తింపు... సంరక్షణతో పర్యాటక అభివృద్ధికి శ్రీకారం
- ఒకేసారి 16 చిత్తడి నేలల గుర్తింపు రాష్ట్రానికి గర్వకారణం
- చిత్తడి నేలల గుర్తింపు ప్రక్రియలో సరికొత్త చరిత్ర సృష్టించబోతున్నాం
- సోంపేట చిత్తడి నేలల్లో టూరిజం కారిడార్
- వీరాపురం, పుణ్యక్షేత్రంలో ప్రత్యేక పక్షి సంరక్షణ కేంద్రాలు
- కొల్లేరు లేక్ మేనేజ్మెంట్ అథారిటీకి ప్రతిపాదనలు

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకే నాలుగు గ్రేడ్ల పంచాయతీ విధానం తీసుకొచ్చామని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అన్నారు. రూర్బన్ పంచాయతీల్లో పట్టణ స్థాయి మౌలిక సదుపాయాలు ప్రజలకు కల్పిస్తామని ఆయన తెలిపారు. పంచాయతీరాజ్ వ్యవస్థలో సంస్కరణలు చేపట్టి పంచాయతీలను నాలుగు గ్రేడ్లుగా వర్గీకరించడంపై రాష్ట్ర పంచాయతీ కార్యదర్శుల సంఘం ప్రతినిధులు ఉప ముఖ్యమంత్రిని మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వారిని ఉద్దేశించి పవన్‌కల్యాణ్ మాట్లాడారు. 'చిత్తడి నేలల సంరక్షణ భావితరాల భవిష్యత్తుకు అవసరం. - మిగతా 2లో

## నాసిరకం మందులతో ముప్పు



- 2020 నుంచి పెరుగుతున్న 'నాసిరకం' లిస్ట్
- నాణ్యత లేని మందులు బెంగాల్‌లో ఎక్కువ
- ఈ ఏడాది 8 నెలల్లో 1,184 ఔషధాలు విఫలం
- ఎన్ఎస్‌క్యూడీ పరీక్షల్లో వెల్లడైన వాస్తవాలు

5

# ఉపాధి శ్రామికుల ఈకేవైసీ పూర్తి చేయాలి

- జిల్లాలోని గ్రామ పంచాయతీల భవనాలన్నింటికీ సౌర విద్యుత్ ఏర్పాటు చేయాలి
- గ్రామాల్లో చెత్త సేకరణ విధానం మెరుగవ్వాలి
- వసతి గృహాలను ప్రత్యేక అధికారులు నిరంతరం తనిఖీ చేయాలి
- ఉపాధి హామీ పథకం, ఐవిఆర్ఎస్ నివేదిక, సంక్షేమ వసతి గృహాలపై సమీక్షలో జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ



విజయవాడ

ఈ వారం చివరిలోగా ఉపాధి కూలీలందరికీ ఈకేవైసీ పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. ఎంజిఎన్ఆర్ఇజిఎస్, ఐవిఆర్ఎస్ నివేదిక, వసతి గృహాలపై డి ఎల్ డి వో లు, ఎంపీడీవోలు, వసతి గృహాల ప్రత్యేక అధికారులతో బుధవారం దృశ్య మాధ్యమ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ... నవంబర్ నుంచి ఉపాధి హామీ పనులకు బయోమెట్రిక్ విధానం తప్పనిసరి అని, అందువల్ల ఉపాధి శ్రామికులందరికీ ఈకేవైసీ పూర్తిచేయాలని చెప్పారు. 100% ఈ కేవైసీ జరగకుంటే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. టెండర్లతో సంబంధం లేకుండా పశువుల షెడ్లను స్వయంగా నిర్మించుకోవచ్చని, అయితే బిల్లు విలువ 50వేలకు మించరాదని చెప్పారు. స్వయంగా నిర్మించుకోలేని వారికి టెండర్ల ద్వారా వెండర్ ను ఎంపిక చేయాలని చెప్పారు. గ్రామపంచాయతీలో చెత్త సేకరణపై ప్రజల నుంచి పూర్తిస్థాయి సంతృప్తి వ్యక్తం కావడం లేదని, దీనికి గల కారణాలను అన్వేషించాలని చెప్పారు. జిల్లాలో ముక్తేశ్వరపురం, సుబ్బయ్య గూడెం, పాతపాడు, రాయనపాడు, పొందుగల గ్రామపంచాయతీలు చెత్త సేకరణలో టాప్ ఫైవ్ లో ఉన్నాయని అభినందించారు. మిగిలిన గ్రామాలలో కూడా చెత్త సేకరణ సక్రమంగా జరగాలని ఆదేశించారు. జిల్లాలోని గ్రామపంచాయతీల భవనాలన్నింటికీ సౌర విద్యుత్ ఏర్పాటు చేయాలని చెప్పారు. సంక్షేమ వసతి గృహాలను నిరంతరం పర్యవేక్షించాలని ప్రత్యేక అధికారులను ఆదేశించారు. ఆహార నాణ్యత, మంచినీటి సదుపాయం, పారిశుద్ధ్య నిర్వహణ, విద్యార్థుల హాజరు తదితర అంశాలను పరిశీలించాలని, దీనికై ప్రత్యేక అధికారులు ఆకస్మిక తనిఖీలు చేయాలని చెప్పారు. నీటి నాణ్యత నిర్ధారించడానికి ప్రతి సంక్షేమ వసతి గృహానికి క్లోరిన్ కిట్లను ఇస్తామని తెలిపారు. క్లోరిన్ విలువ 0.5నుంచి 2 పిపియం మధ్యన ఉండాలని, 0.5 కంటే తక్కువ ఉన్న నీటిని త్రాగడానికి వినియోగించరాదని చెప్పారు. హాస్టల్ వార్డెన్లు నీటి పరీక్షలు క్రమం తప్పకుండా నిర్వహించి ఆ వివరాలను రిజిస్టర్లో నమోదు చేయాలన్నారు. ఈ సమావేశంలో డ్వామా పీడీ ఏ.రాము, డిపిఓ లావణ్య కుమారి, డి ఎల్ డి వో లు పి.శ్రీనివాసరావు, పార్థసారథి, బి. ఎన్.లక్ష్మీకుమారి, డివిజనల్ పంచాయితీ అధికారి జి.రాఘవన్ పాల్గొన్నారు.

# విశాఖ ఉక్కుకు భరోసా

విశాఖపట్నం

విశాఖపట్నం స్టీల్ ప్లాంటును ఆదుకోవడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు తన చిత్తశుద్ధిని చాటుకున్నారు. విద్యుత్, నీటి చార్జీల భారం దాదాపురూ.2,400 కోట్లను రెండేళ్ల వరకు భరించడానికి అంగీకరిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. వీటిని పదేళ్ల వరకూ చెల్లించాల్సిన అవసరం లేదని, తర్వాత ఆ మొత్తానికి ప్లాంటులో ప్రిఫరెన్షియల్ షేర్లు ఇస్తే చాలని సూచించారు. విశాఖ ఉక్కును కేంద్ర ప్రభుత్వం విక్రయానికి పెట్టిందని, ప్రైవేటీకరణ చేస్తుందని వైసీపీతో పాటు ఇతర ప్రతిపక్షాలు కొద్దికాలంగా పెద్దఎత్తున ప్రచారం చేస్తున్నాయి. వారం క్రితం నర్సీపట్నం పర్యటనకు వచ్చిన మాజీ సీఎం జగన్ స్టీల్ ప్లాంటు ఉద్యోగులను తన వాహనం వద్దకు పిలిపించుకొని వారి నుంచి సమస్యలపై లేఖ అడిగి తీసుకున్నారు. అయితే.. ఇదే జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు విశాఖ ఉక్కు కార్మిక సంఘ నాయకులు వచ్చి కలుస్తామంటే కనీసం అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వలేదు. ఎన్నో ప్రయత్నాల అనంతరం ఆయన విశాఖపట్నం వచ్చినప్పుడు విమానాశ్రయం లాంజ్‌లో కొద్దిసేపు వారితో మాట్లాడారు. విశాఖ ఉక్కు యాజమాన్యం తమకు నెల నెలా జీతాలు కూడా సరిగ్గా ఇవ్వలేకపోతున్నదని కార్మిక నాయకులు జగన్ వద్ద వాపోయారు. నెలకు రూ.100 కోట్ల విద్యుత్ బిల్లు వస్తోందని, వాటిని కూడా చెల్లించలేకపోతున్నారని, ఈపీడీసీఎల్ అధికారులు వారం వారం వచ్చి బ్యాంకులో ఎంత ఉంటే అంత తీసుకుపోతున్నారని,



దీనివల్ల జీతాలు మరింత ఆలస్యం అవుతున్నాయని వివరించారు. ఓ మూడు నెలలు విద్యుత్ బిల్లుల చెల్లింపునకు గడువు ఇవ్వాలని వారు అభ్యర్థించగా జగన్ తిరస్కరించారు.

ఉక్కు మంత్రిత్వ శాఖ అడిగినవి ఏమిటంటే...
కేంద్రం తరపున విశాఖ ఉక్కుకు తాము రూ.11,440 కోట్లు ఆర్థిక సాయం చేస్తున్నామని, రాష్ట్రం తరపున తమకు మూడు అంశాల్లో సాయంచేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఉక్కు మంత్రిత్వ శాఖ కోరింది. అవి ఏమిటంటే..

1.స్టీల్ ప్లాంటుపై ఆర్థిక వ్యయం తగ్గించుకోవడానికిసీఐ ఎస్ఎఫ్ సిబ్బందిని తొలగించింది. వారి స్థానంలో ఏపీఎస్‌పీఎఫ్ సిబ్బందిని కోరింది. వెంటనే స్పందించిన రాష్ట్రప్రభుత్వం 167మందిని ఇచ్చింది.నెలకు 20లక్షల జీతాల్ని భరిస్తోంది.

2. మూడేళ్ల విద్యుత్,నీటి బిల్లులు మాఫీ చేయాలని ఉక్కు శాఖ కోరింది. దీనికి స్పందిస్తూ రాష్ట్ర ప్రభుత్వం రూ.2,400 కోట్ల సాయం అందిస్తామని తెలిపింది.

3. రాష్ట్ర ప్రభుత్వ ప్రాజెక్టులన్నింటికీ విశాఖ స్టీల్‌ను కొనుగోలు చేయాలని ఉక్కు మంత్రిత్వ శాఖ సూచించగా దీన్ని పరిశీలనలో పెట్టారు.

# పంచాయతీల వర్గీకరణతో ప్రజలకు మెరుగైన సేవలు

-మొదటిపేజీ తరువాయి

పర్యావరణ పరిరక్షణ, భూగర్భ జలాల పెరుగుదల, పర్యాటక అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున చిత్తడి నేలల గుర్తింపు ప్రక్రియకు శ్రీకారం చుట్టామ'ని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, అటవీ పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 16 చిత్తడి నేలలను గుర్తించి, వాటి పరిరక్షణకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. దక్షిణ భారతదేశ చరిత్రలో ఒకేసారి ఇంత పెద్ద ఎత్తున చిత్తడి నేలలకు గుర్తించిన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ చరిత్ర సృష్టించబోతోందని తెలిపారు. అందులో సోంపేట, తవిటి మండలాల పరిధిలో వేలాది ఎకరాల్లో విస్తరించి వున్న మూడు చిత్తడి నేలలను అనుసంధానిస్తూ భారీ పర్యాటక ప్రాజెక్టుకు రూపకల్పన చేయనున్నట్టు తెలిపారు. కొల్లేరు మాదిరిగా మరిన్ని చిత్తడి నేలలకు రాంసర్ గుర్తింపు దక్కేలా అటవీ శాఖ వన్యప్రాణి విభాగం ఆధ్వర్యంలో చర్యలు చేపడతామని చెప్పారు. మంగళవారం మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో పవన్ కళ్యాణ్ అధ్యక్షతన స్టేట్ వెట్ ల్యాండ్ అథారిటీ సమావేశం జరిగింది. సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా చిత్తడి నేలల భౌగోళిక సరిహద్దుల గుర్తింపు, అభివృద్ధి తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "సుప్రీం కోర్టు ఆదేశాలకు లోబడి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న చిత్తడి నేలల భౌగోళిక గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలి. రాష్ట్రవ్యాప్తంగా 23,450 చిత్తడి నేలలు ఉన్నాయి. అందులో 99.3 శాతం నేలలకు డిజిటల్ సరిహద్దుల గుర్తింపు ప్రక్రియ పూర్తయ్యింది. వీటికి ఈ నెల 28 లోపు భౌతిక సరిహద్దుల గుర్తింపు ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంది. అందుకోసం అటవీ శాఖ, రెవెన్యూ, సర్వే విభాగాల అధికారులు సమన్వయంతో పని చేసి ఆ ప్రక్రియను నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలి.పోరాటయాత్రలో సోంపేట చిత్తడి నేలలను పరిశీలించానుచిత్తడి నేలల గుర్తింపు, అభివృద్ధి ప్రక్రియలో అన్ని రాష్ట్రాల కంటే మనం ముందున్నాం. రాష్ట్ర పరిధిలో ఒకేసారి 16 చిత్తడి నేలలకు టెక్నికల్,



గ్రీవెన్స్ కమిటీ ఆమోదం లభించింది. వీటిని అధికారికంగా గుర్తిస్తూ నోటిఫై చేయబోతున్నాం. దక్షిణ భారత దేశ చరిత్రలో ఇంత పెద్ద ఎత్తున ఒకేసారి చిత్తడి నేలలకు గుర్తింపు ఇచ్చి చరిత్ర సృష్టించబోతున్నాం. అందులో సోంపేట, తవిటి మండలాల పరిధిలో 5 వేల ఎకరాల్లో విస్తరించి ఉన్న పెద్ద బీల, చిన బీల, తుంపర, చిత్తడి నేలలను ఒక కారిడార్ గా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. 2018లో పోరాట యాత్ర సందర్భంగా సోంపేట ప్రాంతంలో చిత్తడి నేలలను పరిశీలించాను. పర్యవేక్షణ లేక పేద బీల, చిన బీల ప్రాంతం ఆక్రమణలకు గురైన విషయం స్థానికులు నా దృష్టికి తీసుకువచ్చారు. అధికారంలోకి వస్తే ప్రకృతి ప్రసాదితమైన ఆ చిత్తడి నేలలకు రక్షణ కల్పించడంతోపాటు అభివృద్ధి చేయాలని భావించాము. అటవీ, పర్యావరణ శాఖ మంత్రిగా సోంపేట చిత్తడి నేలలకు అధికారిక గుర్తింపు తీసుకువచ్చే చర్యల్లో భాగస్వామి కావడం ఆనందంగా ఉంది. పెద బీల, చిన బీల, తుంపర కలిపి వేలాది ఎకరాల్లో విస్తరించి ఉన్న చిత్తడి నేలల గుర్తింపు ప్రక్రియ పూర్తయిన అనంతరం ఆ ప్రాంతంలో పర్యాటక అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తాం. ఎకో టూరిజం అభివృద్ధి చేయడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు స్థానికులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. అనంతపురం జిల్లా పరిధిలోని వీరాపురం, రాజమండ్రి సమీపంలోని పుణ్యక్షేత్రంలో విస్తరించి ఉన్న చిత్తడి నేలలు అరుదైన పక్షి జాతులకు నెలవుగా ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో ప్రత్యేక పక్షుల సంరక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి పర్యాటకులను ఆకర్షించే విధంగా చర్యలు తీసుకుంటాం.రాష్ట్రంలోనే అతిపెద్ది చిత్తడినేలగా రాంసర్(అంతర్జాతీయ) గుర్తింపు పొందిన కొల్లేరు లాంటి సరస్సుల పరిరక్షణపై ప్రత్యేకంగా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. కొల్లేరు చిత్తడి నేల పరిరక్షణ కోసం అటవీశాఖ వన్యప్రాణి విభాగం ఆధ్వర్యంలో 'కొల్లేరు లేక్ మేనేజ్మెంట్ అథారిటీ ఏర్పాటు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించాను. రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు పొందిన మిగిలిన చిత్తడి నేలలకు కూడా అంతర్జాతీయ గుర్తింపు లభించేందుకు కృషి చేయాలి" అని చెప్పారు. ఈ సమావేశంలో సీసీఎల్ఏ జయలక్ష్మి, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్ కుమార్, పీసీసీఎఫ్ పి.వి. చలపతిరావు, అటవీశాఖ సలహాదారు మల్లికార్జునరావు, ఏపీసీసీఎఫ్ శాంతిప్రియ పాండే, అటవీ శాఖ ప్రత్యేక కార్యదర్శి ఎస్. శరవణన్, డబ్ల్యూడబ్ల్యూఎఫ్ ఇండియా రాష్ట్ర కార్యదర్శి ఫరిదా థంపాల్, ప్రముఖ శాస్త్రవేత్తలు రామ సుబ్రహ్మణ్యన్, డాక్టర్ గోల్డిన్ ఖుద్రోస్, ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## పొగాకు నుంచి యువతకు తక్షణ రక్షణ కల్పించాలి

విజయవాడ

ప్రపంచ ఆరోగ్య సంస్థ ఫ్రేమ్‌వర్క్ కన్వెన్షన్ ఆన్ టొబాకో కంట్రోల్ సీవోపీ11కి ముందస్తుగా స్మోక్‌ఫ్రీ ఇండియా నాలుగు అంశాల చర్యకు పిలుపునిచ్చింది. భారతదేశంలో పొగాకు వినియోగించే యువత వృద్ధి చెందుతున్న సంక్షోభాన్ని అత్యవసరంగా, ఆధారాల ఆధారిత విధానాలతో ఎదుర్కోవాలని ప్రతినిధులను కోరింది. నిత్యం 5,500 కన్నా ఎక్కువ మంది భారతీయ పిల్లలు పొగాకును కొత్తగా వినియోగిస్తున్నారు. వీరిలో 13–15 ఏళ్ల వయస్సు ఉన్న ఐదుగురు పాఠశాల విద్యార్థులలో ఒకరు పొగాకును ప్రయత్నించారు. ఇది సుమారుగా 9 శాతం మంది ప్రస్తుత వినియోగదారులు. యుక్తవయస్సు వచ్చేసరికి, 28 శాతం మంది పొగతాగడాన్ని కొనసాగిస్తుండగా, 15 శాతం మంది పొగ తాగడాన్ని నిలిపివేస్తున్నారని న్యూఢిల్లీలోని బీఎల్కే-మ్యాక్స్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ పల్మనరీ మెడిసిన్ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ పవన్ గుప్తా పేర్కొన్నారు. ముందుగా పొగాకు నియంత్రణ, యువత కేంద్రీకృత విరమణ, ప్రత్యామ్నాయాల సమతుల్య నియంత్రణ, ప్రయోజనాల సంఘర్షణలను అంతం చేయడం గురించి స్మోక్‌ఫ్రీ ఇండియా డిమాండ్ చేస్తోంది.

## శాంసంగ్ గెలాక్సీ ఎం17 5జీ అమ్మకాలు ప్రారంభం




విజయవాడ

ఇటీవల విడుదల చేసిన గెలాక్సీ ఎం17 5జీ స్మార్ట్‌ఫోన్‌ను వినియోగదారులు కొనుగోలు చేయవచ్చని శాంసంగ్ ప్రకటించింది. ఇది అమెజాన్, శాంసంగ్ డాట్ కాంతో పాటు, ఎంపిక చేసిన రిటైల్ స్టోర్లలో అందుబాటులో ఉంటుంది. గెలాక్సీ ఎం17 5జీ, భారతదేశంలో అత్యధికంగా అమ్ముడైన శాంసంగ్ స్మార్ట్‌ఫోన్‌లలో ఒకటైన గెలాక్సీ ఎం16 5జీ విజయాన్ని కొనసాగిస్తూ, అత్యాధునిక ఏఐ ఆవిష్కరణలను మరింత ఎక్కువ మందికి చేరువ చేసే శాంసంగ్ సంప్రదాయాన్ని ముందుకు తీసుకువెళుతోంది. ఇది రూ. 10,000 రూ. 15,000 ధరల విభాగంలో తొలిసారిగా "నో షేక్ కెమెరా ఫీచర్‌తో వస్తోంది. కేవలం 7.5 మి.మీ.ల మందంతో, ప్రీమియం కెమెరా డిజైన్‌తో పాటు, ఈ విభాగంలోనే అత్యుత్తమమైన కార్నింగ్ గొరిల్లా గ్లాస్ విక్టస్ ప్రొటెక్షన్‌తో అద్భుతమైన మన్నికను అందిస్తుంది.

## జీఎస్టీ 2.0 సంబరం

-మొదటిపేజీ తరువాయి

పూజలు చేస్తారు. అనంతరం శివాజీ స్ఫూర్తికేంద్రాన్ని సందర్శిస్తారు. అక్కడి నుంచి మధ్యాహ్నం 2.20కి కర్నూలు చేరుకుంటారు. జీఎస్టీ సభలో ప్రసంగించిన తర్వాత కర్నూలు విమానాశ్రయం చేరుకుని సాయంత్రం 4.45కు ఢిల్లీ బయల్దేరి వెళ్తారు. ఏర్పాట్లపై సీఎం సమీక్ష: ప్రధాని పర్యటన సందర్భంగా కర్నూలు, శ్రీశైలంలో చేసిన ఏర్పాట్లపై ముఖ్యమంత్రి చంద్రబాబు విజయవాడ నుంచి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ప్రధాని కార్యక్రమ ప్రత్యేకాధికారి వీరపాండియన్, కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి తదితరులతో వివరాలు ఆరాతీశారు. మంత్రులు పి.నారాయణ, బీసీ జనార్దన్‌రెడ్డి, రవికుమార్, రాంప్రసాద్‌రెడ్డి, సత్యప్రసాద్, అచ్చెన్నాయుడు, అనిత, గుమ్మిడి సంధ్యారాణి, రామానాయుడు, కేశవ్, సవిత ఏర్పాట్లను పరిశీలించారు. డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా సభా ప్రాంగణంలో భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. డీఐజీ కోయ ప్రవీణ్ ఆయనకు బందోబస్తు గురించి వివరించారు.

**టెంట్ల మధ్యనే రోడ్‌షో**

ప్రధానితో కర్నూలులో రోడ్‌షో నిర్వహించాలని తొలుత నిర్ణయించారు. తర్వాత దాన్ని బహిరంగసభగా మార్చారు. దీంతో సభా ప్రాంగణంలోనే టెంట్ల మధ్యలో నిర్మించిన రహదారిపై వాహనం పైనుంచి ప్రధాని ప్రజలకు అభివాదం చేస్తూ రోడ్‌షోగా వేదిక వరకు చేరుకునేలా ఏర్పాట్లు చేశారు. సభ మధ్యాహ్నం 2.30 నుంచి 4.10 వరకు ఉంటుంది.
కర్నూలు శివారు నన్నూరు వద్ద 'సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్' సభ ఏర్పాట్లు
ఐదుగురికి మాట్లాడే అవకాశం
కార్యక్రమంలో ప్రధానితో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్ మాట్లాడనున్నారు. మంత్రి టీజీ భరత్ స్వాగతోపన్యాసం చేస్తారు.
సూపర్ జీఎస్టీపై సూపర్ ఆర్ట్!
జీఎస్టీ తగ్గింపు వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించేలా బుధవారం వాణిజ్య పన్నులు, పర్యాటక శాఖల సంయుక్త పర్యవేక్షణలో భీమిలి సముద్ర తీరంలో ఆంధ్రా యూనివర్సిటీ ఫైన్ ఆర్ట్స్ విద్యార్థులు ఇసుకతో తీర్చిదిద్దిన 'సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్' నినాదం సందర్శకులను విశేషంగా ఆకట్టుకొంది.

## గూగుల్ డేటా సెంటర్ రావడంలో మోదీ చొరవ

-మొదటిపేజీ తరువాయి



గూగుల్ ప్రతినిధులతో నిరంతరం సంప్రదింపులు జరిపి, రాష్ట్రానికి వచ్చేలా చేశారు' అని చంద్రబాబు వివరించారు.

**'మోడల్ స్టేట్'గా నిలపాలి**


కూటమి నేతలంతా కలిసి ఓ మోడల్ స్టేట్‌గా రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలపాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. కర్నూలు సభకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. జీఎస్టీ సంస్కరణలతో ఒక్కో కుటుంబానికి నెలకు రూ.15 వేల వరకు ఆదా అవుతుందని చెప్పారు. గూగుల్ సంస్థను ఏపీకి తీసుకురావడంలో చంద్రబాబు, లోకేశ్‌ల కృషిని ఈ సందర్భంగా నేతలు ప్రశంసించారు.

**వైకాపా తప్పులు సరిచేయడానికే చాలా సమయం**

విభజనతో ఎదుర్కొన్న ఇబ్బందుల కంటే వైకాపా పాలకుల విధ్వంసంతోనే రాష్ట్రం ఎక్కువ నష్టపోయిందని చంద్రబాబు గుర్తుచేశారు. 'పాలనాపరంగా వారు అనేక తప్పులు చేశారు. వాటిని సరిచేయడానికే చాలా సమయం పట్టింది. వైకాపా ప్రభుత్వం రాయలసీమలోని సాగునీటి ప్రాజెక్టులకు ఐదేళ్లలో కనీసం రూ.2 వేల కోట్లు కూడా ఖర్చు చేయలేదు. కానీ మనం సీమకు నీళ్లివ్వడంతోపాటు పెద్ద ఎత్తున పరిశ్రమలు తీసుకొస్తున్నాం. పర్యాటకానికి గమ్యస్థానంగా మారుస్తాం. తిరుపతి, శ్రీశైలం, గండికోట లాంటి పర్యాటక ప్రాంతాల్ని అభివృద్ధి చేస్తున్నాం' అని వివరించారు.

# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...



కాకినాడ తూర్పు గోదావరి
డా బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ

గురువారం, 16 అక్టోబర్ 2025




www.viswamvoice.com



# పసిపిల్లలపై పాశవికత చూపిన తండ్రి



- ← ఆలమూరు మండలం, మడికి(చిలకలపాడు)లో దారుణం ← తాను మరణిస్తూ, తన పిల్లలకు విషమిచ్చి చంపిన తండ్రి
- ← కొడుకు,మనమళ్ళ మృతి తో గుండెలవిసేలా రోదించిన మృతుడి తల్లి
- ← మృతుడి సోదరుని పిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు



**ఆలమూరు, విశ్వంవాయిస్ న్యూస్ :** ముక్కుపచ్చలారని ఇద్దరు చిన్నారులను చంపి తండ్రి ఆత్మహత్య చేసుకున్న సంఘటన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఆలమూరు మండలం, మడికి గ్రామ శివారు చిలకపాడులో చోటుచేసుకుంది. కొత్తపేట డిఎస్పి సుంకర మురళీమోహన్ తెలిపిన వివరాల మేరకు సెలూన్ షాప్ ను నిర్వహించే పావులూరి కామరాజు (చంటి)(36) భార్య నాగదేవి సుమారు అయిదేళ్లక్రితం ఆత్మహత్య చేసుకుని మరణించగా, అప్పటి నుంచి కేసు కోర్టులో నడుస్తుండగా, ఇటీవలనే రాజీ జరిగి ఆ కేసు వీగగా,బుధవారం రాత్రి అయిదవ తరగతి చదువుతున్న అభిరామ్(11), ఒకటవ తరగతి చదువుతున్న త్రినాథ్ గౌతమ్( 8 )లకు పురుగులు మందు పట్టించి అనంతరం ఫ్యాన్ ఉరివేసుకుని చంటి ఆత్మ చేసుకున్నాడు. సంఘటన స్థలానికి చేరుకున్న కొత్తపేట డిఎస్పి సుంకర మురళీమోహన్, సిఐ,ఆలమూరు ఎస్ఐ ల తో కలిసి పరిశీలించారు బాధితుల బంధువులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. హ్యాంగ్ చేసుకోవడానికి ముందు తాను ఎందుకు చనిపోతున్నానో కారణం చెబుతూ మృతుడు కామరాజు ఒక సెల్ఫీ వీడియో తీసి తన సోదరుడికి పంపించాడని, మృతుడు పంపిన సెల్ఫీ వీడియో ప్రకారం ముగ్గురు వ్యక్తులు తనపై పగబట్టి, ఇబ్బంది పెడుతున్నారని, వారిలో ఇద్దరైతే ఆక్సిడెంట్ చేసి, తనను చంపేందుకు ప్రయత్నించారని తెలుపుతూ పావులూరి దుర్గారావు, కరుపురోలు తలుపులు, కరుపురోలు శ్రీనివాస్ అనే ముగ్గురు వ్యక్తుల బాధలు భరించలేక ఆత్మహత్యకు పాల్పడుతున్నానని వాపోతూ, తల్లితో తనకు అక్రమ సంబంధం అంటగడుతున్నారని, తన తల్లిని తీవ్రంగా దుర్భాషలాడుతున్నారని, చెబుతూ తన భార్య చావుకి కారణం కూడా కరుపురోలు తలుపులు, కరుపురోలు శ్రీనివాస్ ఈ ఇద్దరు వ్యక్తులే అని ఆవేదన వ్యక్తం చేస్తూ, వారు నా బిడ్డలను కూడా చంపుతానన్నారని, వారు ముగ్గురిని పోలీసులు వదలొద్దని అంటూ సెల్ఫీ వీడియో రికార్డ్ చేసి ఆత్మహత్య చేసుకున్నాడని డిఎస్పీ మురళీమోహన్ తెలిపగా, తన కొడుకు మనమళ్ళ మరణంతో శోకసముద్రంలో మునిగిపోయిన కామరాజు తల్లి ముక్కుపచ్చలారని చిన్నారులు విగత జీవులుగా పడి ఉండడం చూసి ఆవేదన చెందుతూ, ఆ చిన్నారులను వదిలేసిన నేను బ్రతికించుకునే దాన్ని అంటూ గుండె పగిలేలా రోదించిన ఘటన స్థానికులను కలిచివేసింది. కాగా మృతుడి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, క్లూస్



టీం, డాగ్స్ స్క్వాడ్, ఎఫ్ ఎస్ ఎల్ టీం లను రప్పిస్తున్నామని, సాక్ష్యదారాలను సేకరించిన తర్వాత మృతదేహాలను పోస్టుమార్టంకి పంపించి దర్యాప్తులో మృతికి కారణాలు తెలుసుకొని తదుపరి చర్యలు తీసుకుంటామని డిఎస్పీ మురళీమోహన్ తెలిపారు.

## కమిషనర్‌ను కలిసిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమండ్రి నగర పాలక సంస్థ నూతన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన రాహుల్ మీనాను సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) మర్యాద పూర్వకంగా కలవడం జరిగింది. నగర పాలక సంస్థ ఆవరణలోని ఆయన ఛాంబర్‌లో పార్టీ నాయకులతో పాటు రాహుల్ మీనాను కలిసి పుష్పగుచ్ఛం అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు రాజమహేంద్రవరం సిటీ నగరాభివృద్ధి, రానున్నపుష్కరాల నేపథ్యంలో చేపట్టాల్సిన పనులు తదితర అంశాలపై చర్చించారు. తెలుగుదేశం పార్టీ నగర కమిటీ సభ్యులు, నాయకులు, వివిధ ధార్మిక సంస్థల చైర్మన్లు, డైరెక్టర్లు కమిషనర్ ను కలిసిన వారిలో ఉన్నారు.

## వ్యక్తిగత శుభ్రం చాలా అవసరం..

### 'వరల్డ్ హ్యాండ్ వాషింగ్ డే' కార్యక్రమంపై ప్రజలలో విస్తృత ప్రచారం జరగాలి : డిడిఓ శ్రీనివాస విశ్వనాథ్



**రంపచోడవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే భోజనం తినే ముందు తిన్న తర్వాత చేతులు శుభ్రంగా కడుక్కోవాలి రంప చోడవరం డివిజనల్ డెవలప్మెంట్ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ అన్నారు. ఆకురు గ్రామ సచివాలయాన్ని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేసిన శ్రీనివాస విశ్వనాథ్ సిబ్బందితో 'వరల్డ్ హ్యాండ్ వాషింగ్ డే' కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. వ్యక్తిగత శుభ్రం ముఖ్యంగా చేతులు శుభ్రంగా కడుక్కోవడం ద్వారా ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చని శ్రీనివాస విశ్వనాథ్ అన్నారు. 'వరల్డ్ హ్యాండ్ వాషింగ్ డే' కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సిబ్బందికి సూచించారు. సందర్భంగా చేతులు ఎలా శుభ్రం చేసుకోవాలో స్థానికులకు, చిన్నారులకు శిక్షణ ఇచ్చారు. అనంతరం గ్రామ సచివాలయం ద్వారా సిబ్బంది ప్రజలకు అందిస్తున్న సేవలపై శ్రీనివాస విశ్వనాథ్ ఆరాతీసి, మనమిత్ర వాట్సాప్ సేవలను, ఆది కర్మయోగి గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలను, సూపర్ జి.ఎస్.టి సూపర్ సేవింగ్స్ తదితర ప్రజా ప్రయోజన కార్యక్రమాలను ప్రజలలోకి విస్తృతంగా తీసుకొని వెళ్లాలని సిబ్బందికి సూచించారు. పారిశుధ్య నిర్వహణ సక్రమంగా జరగాలని సిబ్బందికి ఆదేశాలు జారీచేశారు. కార్యక్రమంలో డిజిటల్ అసిస్టెంట్ కె సురేష్ రెడ్డి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ పి. గంగాభవాని, మహిళా పోలీస్ సిహెచ్ ప్రేమ కుమారి తదితరులు పాల్గొన్నారు.

### అంగన్వాడీ కేంద్రం తనిఖీ చేసిన శ్రీనివాస విశ్వనాథ్

రంపచోడవరం మండలం, ఆకురు గ్రామ పంచాయతీ తనిఖీలో భాగంగా అంగన్వాడీ కేంద్రాన్ని డివిజనల్ అభివృద్ధి అధికారి శ్రీనివాస విశ్వనాథ్ పరిశీలించారు. చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం సక్రమంగా అందుతుందా లేదా అని పరిశీలించారు. పిల్లలతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. సందర్భంగా చిన్నారుల బరువును స్వయంగా వేఇంగ్ యంత్రం ద్వారా పరిశీలించి రికార్డులలో నమోదు చేసారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ మామిడి వెంకటగిరి, ఆయా మడకం శాంత కుమారి పాల్గొన్నారు.

### తండ్రి వయసున్న వృక్షానికి

## నూతన జీవం..

- 70 ఏళ్ల భారీ బోన్సాయ్ మామిడి వృక్షానికి పునర్జీవం పోసిన పుల్లా పెద్ద సత్యనారాయణ..
- దివంగత చంటియ్య జ్ఞాపకార్థం శ్రీ సత్య దేవా నర్సరీ ప్రాంగణంలో భారీ వృక్ష ప్రతిష్ట..




**కడియపులంక, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక శ్రీ సత్యదేవ నర్సరీ రైతు, దివంగత పుల్లాచంటియ్య ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన జ్ఞాపకార్థంగా ఆయన కుమారుడు పుల్లా పెద్ద సత్యనారాయణ తన నర్సరీ ప్రాంగణంలో 70 సంవత్సరాల వయసు కలిగిన భారీ మామిడి వృక్షాన్ని ప్రతిష్టించారు. ఈ వృక్షం దివంగత చంటియ్య సమకాలిన సుమారు ఏడు దశాబ్దాల వయసు కలిగిన విలువైన జీవస్మృతిగా నిలిచింది. పెద్దసత్యనారాయణ తన కడియపు సావరం వ్యవసాయ క్షేత్ర విస్తరణలో భాగంగా రెండు నెలల క్రితం ఈ వృక్షాన్ని తొలగించాల్సి వచ్చింది.ఈ వృక్షాన్ని నరికి తొలగించి వేయాలనే నర్సరీ సిబ్బంది సూచన ఆయన హృదయాన్ని కలచివేసింది. ఇది తండ్రి స్నేహితుడిలా పెరిగింది అనే భావనతో తండ్రి వయసున్న ఈవృక్షాన్ని ఎలాగైనా కాపాడాలని సంకల్పించారు. భారీ ఖర్చుతో కూడుకున్న ప్పటికీ నర్సరీ నిపుణుల సలహాతో ఈ భారీ వృక్షాన్ని జాగ్రత్తగా తీసివేసి ప్రత్యేక సంరక్షణతో మహా బోన్సాయ్ మామిడి వృక్షంగా తీర్చిదిద్దారు. తన తండ్రి మరణించిన అక్టోబర్ 14వ తేదీ న ఆయన జ్ఞాపికగా కడియపులంక శ్రీ సత్యదేవ నర్సరీకి తీసుకువచ్చారు. మామిడి మొక్కలు నాటేందుకు శ్రేయస్కరమైన పుష్యమి నక్షత్ర గడియల్లో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి పునఃప్రతిష్ట చేశారు. ఈ వృక్షాన్ని చూసి ఆశ్చర్య వ్యక్తం చేసిన స్థానికులు తండ్రి జ్ఞాపకార్థంగా మొక్కను బ్రతికించిన సత్యనారాయణ ప్రేమ నిజమైన స్ఫూర్తి అని ప్రశంసించారు. దివంగత చంటియ్య పట్ల ఉన్న అనురాగం మొక్కల పట్ల ఉన్న మమకారం కలగలసిన ఈ వృక్ష ప్రతిష్ట అందరిని కదిలించింది. ఈ కార్యక్రమంలో సత్యదేవ నర్సరీ కుటుంబ సభ్యులు, రైతులు, నర్సరీ శ్రామికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అబ్దుల్ కలాం జయంతిలో మెగా రక్తదాన శిబిరం

### మానవతా సేవలో అతి గొప్పది.. కలాం ఆలోచనలతో ప్రేరణ..




**దూబచర్ల, విశ్వం వాయిస్ న్యూస్ :** భారతరత్న డాక్టర్ ఏ.పి.జే. అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా లయన్స్ క్లబ్ దూబచర్ల పార్డ్ ఇండియా స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఎలైట్ విద్యా సంస్థలు మెగా రక్తదాన శిబిరంను విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్ సహకారంతో జరగగా, విద్యార్థులు మరియు యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. మొదటిగా ఎలైట్ విద్యా సంస్థల ప్రిన్సిపల్ కరకల శ్రీలక్ష్మి బ్లడ్ డొనేషన్ చేసి యువతకు స్ఫూర్తి దాయకంగా నిలిచారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మి మాట్లాడుతూ ఇప్పటికే 11 సార్లు బ్లడ్ డొనేషన్ చేశానని తెలియజేశారు. మొత్తం 31మంది పైగా విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేసి, సమాజ సేవ పట్ల తమ నిబద్ధతను చాటుకున్నారు. ఈ సందర్భంగా పార్డ్ ఇండియా జాతీయ అధ్యక్షులు మరియు బ్లడ్ క్యాంప్ కోఆర్డినేటర్ అంబటి శ్రీనివాసరావు మాట్లాడుతూ, "రక్తదానం మానవతా సేవలో అతి గొప్పది, కలాం ఆలోచనలతో ప్రేరణ పొందిన యువత రక్తదానం ద్వారా సమాజానికి దోహదపడుతున్నారు" అన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు తమ్మిన శ్రీనివాసరావు, పార్డ్ ఇండియా గౌరవ అధ్యక్షులు చీమకుర్తి కృష్ణ ప్రసాద్, ఎలైట్ విద్యాసంస్థల కరెస్పాండెంట్స్ గారపాటి సుబ్బారావు, యలమర్తి సుదర్శన్, బ్లడ్ బ్యాంక్ డాక్టర్ సోనియా మోహన్, జయలక్ష్మి తదితరులు పాల్గొని రక్తదాతలను అభినందించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు, విద్యార్థుల ఉత్సాహం, సిబ్బంది సహకారం పట్ల కృతజ్ఞతలు తెలియజేశారు.

### గాయపడిన గోవుకు

## హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి సంరక్షణ..




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మానవత్వం మాత్రమే కాదు సమితి ముఖ్య ఉద్దేశ్యం పూర్తి చేసాము.కర్తవ్య నిర్వహణలో హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి సైనికులు సాయికృష్ణ,మీనాక్షి రెడ్డి. వివరాల్లోకి వెళితే స్థానిక రాజమహేంద్రవరం క్వారీ రోడ్ నుండి లాలాచెర్వు వెళ్లే దారిలో వున్న చిన్న ఆంజనేయ స్వామి గుడి వద్ద ఒక గోవు గాయాలతో కొట్టుమిట్టడుతున్నట్టు సమాచారం సమితి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు రవికుమార్ కు తెలియడంతో కార్యాచరణ మొదలుపెట్టారు. గోవుల పరిరక్షణ కు ముందుండే సమితి సభ్యులు హుటాహుటిన అక్కడకు బయలుదేరి వెళ్లారు. గోవు పరిస్థితిని చూసి విజయవాడ కు చెందిన పశు సంరక్షణ శాఖకు సమాచారం అందించడం తో సంబంధిత అధికారులు సానుకూలంగా స్పందించి రాజమహేంద్రవరం శాఖకు సమాచారం అందించడంతో వెంటనే అంబులెన్సుతో సంఘటన స్థలానికి చేరుకొని లేగ దూడను పరీక్షించి తగిన చికిత్స చెయడం తో పాటు గోవును ఆసుపత్రి కీ తరలించి సెలైన్ ఎక్కించి మరింత మెరుగైన చికిత్స అందించి గాయలకు కట్లు కట్టి తిరిగి తల్లి ఆవు దగ్గర విడిచి పెట్టారు. ప్రస్తుతానికి దూడ పరిస్థితి మెరుగ్గా వుంది. దూడను ఆసుపత్రి కీ తరలించే క్రమంలో అంబులెన్సు కు అడ్డుగా నిలబడి తల్లి ఆవు చేసిన హడావిడి అంతా ఇంతా కాదు. తల్లి ప్రేమ ను చూసిన అక్కడి ప్రజలు ఆశ్చర్యనికి అవధులు లేవు. ఈ విషయంలో ప్రధాన పాత్ర పోషించిన హిందూ దేవాలయాల పరిరక్షణ సమితికి చెందిన ప్రతి సభ్యునికి స్థానికి ప్రజలు కృతజ్ఞతలు తెలియ చేశారు.సమితి సభ్యులకు జిల్లా అధ్యక్షులు వెలుగూరి రవికుమార్ ప్రత్యేక అభినందనలు తెలియ చేశారు.

# ఎడిటర్ వాయిస్

## అప్రతిష్ట పాలవుతున్న భారత్!

2047 నాటికి అభివృద్ధిలో భారత్‌ను ప్రపంచంలో మొదటి స్థానంలో ఉంచాలనే 'వికసిత్ భారత్' అంటూ నిత్యం పెద్ద ఎత్తున ప్రచారం చేసుకుంటున్నాం. ఇప్పటికే ఆర్థికంగా నాలుగో స్థానానికి చేరుకున్నామని, త్వరలో మూడో స్థానంకు చేరుకోబోతున్నామని భావిస్తున్నాం. అయితే కుల వివక్ష, ముఖ్యంగా అణగారిన ప్రజలపట్ల ఈసడింపు, వేధింపులకు మాత్రం అంతులేకుండా పోతున్నది. ఎంతమందిని మొక్కుబడిగా ఉన్నత పదవులకు తీసుకొచ్చినా, రాజ్యాంగపరంగా ఎన్ని రక్షణలు కల్పిస్తున్నా అత్యున్నత స్థాయిలో ఉన్నవారు సైతం ఎటువంటి వేధింపులు ఎదుర్కోవాల్సి వస్తుందో హర్యానాలో సీనియర్ ఐపిఎస్ అధికారి పూరన్ కుమార్ ఆత్మహత్య స్పష్టం చేస్తున్నది. అటువంటి సీనియర్ అధికారి ఆత్మహత్య చేసుకుంటే, వెంటనే ఎందుకు చేసుకున్నానో వివరించిన 8- పేజీల నోట్ లభించినా దాని ప్రకారం ఎఫ్ఐఆర్ నమోదు చేసి, తగు చర్యలు చేపట్టేందుకు రోజుల తరబడి ప్రభుత్వం సంశయిస్తూ ఉందంటే మన వ్యవస్థలో వివక్ష ఎంత లోతుగా పాతుకు పోయిందో వెల్లడవుతున్నది. కేవలం పూరన్ కుమార్ భార్య అమ్నీత్ పి కుమార్ ఓ సీనియర్ ఐఎఎస్ అధికారిని కావడం, కీలక నిందితులపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి, తగు చర్యలు తీసుకోవాలని సాహసంతో పట్టుబట్టడంతో కొంతవరకైనా ప్రభుత్వం కదిలి రావాల్సి వచ్చింది. ఇదే సమయంలో పశ్చిమ బెంగాల్‌లో ఓ మెడికల్ కాలేజీలో ఓ వైద్య విద్యార్థిని సామూహిక అత్యాచారానికి గురైతే 24 గంటల లోగా, ఆ రాష్ట్ర ఉన్నత పోలీసు అధికారులకన్నా ముందుగా జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు అర్చన మజుందార్ అక్కడకు చేరుకొని, దర్యాప్తుపై ఆరాతీసారు. కానీ, పూరన్ కుమార్ విషయంలో జాతీయ ఎస్‌టి కమిషన్ వారం రోజులలోగా ఓ నివేదిక పంపమని కోరుతూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డిజిపిలకు లేఖలు రాసి ఊరుకుంది. హక్కుల సంఘాలు అధికార పక్షాల ప్రచార విభాగాలుగా ఏ విధంగా దిగజారుతున్నాయో ఇటువంటి ఘటనలు వెల్లడి చేస్తున్నాయి. సూసైడ్ నోట్ చూస్తే గత ఐదేళ్లుగా కేవలం కులం కారణంగా ఏ విధంగా వేధింపులు ఎదుర్కొంటున్నారో, మానసిక వ్యథకు గురిచేసారో వెల్లడవుతుంది. అయినా కూడా రాష్ట్ర ప్రభుత్వం గాని, వ్యవస్థలు గాని జోక్యం చేసుకొనే ప్రయత్నం చేయలేదంటే దేశంలో ఎటువంటి దారుణమైన పరిస్థితులు నెలకొన్నాయి అర్థం అవుతుంది. 'ఐపిఎస్ అధికారి ఆత్మహత్య చేసుకోవడం చాలా తీవ్రమైన అంశం. దాదాపు 14-15 మంది పోలీసు ఉన్నతాధికారులపై ఎఫ్ఐఆర్ నమోదు కావడం చూస్తేనే కేసు తీవ్రత అర్థమవుతోంది' అంటూ పంజాబ్ గవర్నర్ గులాబ్ చంద్ కటారియా ఆందోళన వ్యక్తం చేశారు. అయినా, ఎఫ్ఐఆర్ ను నిర్వీర్యం చేసే ప్రయత్నాలు అత్యున్నత స్థాయిలో జరగడం దిగ్భ్రాంతి కలిగిస్తుంది. దళితులు, గిరిజనులకు రాజ్యాంగపరమైన ఉన్నత స్థానాలను కల్పిస్తున్నా, రాజ్యాంగం కల్పిస్తున్న అవకాశాల కారణంగా వారు ప్రభుత్వంలో ఉన్నత పదవులకు చేరుకుంటున్నప్పటికీ వివక్షకు గురవుతూనే ఉన్నారని అనేక ఘటనలు స్పష్టం చేస్తున్నాయి. డా. బిఆర్ అంబేద్కర్ వంటి వారు అటువంటి వివక్ష, వేధింపులకు తిరగబడి పోరాటం చేసినా, అనేకమంది బలవుతూ వస్తున్నారు. దేశంలో తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య నుండి, బిజెపి జాతీయ అధ్యక్షులు బంగారు లక్ష్మణ్ వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో అటువంటి వేధింపులకు గురయ్యారు. ఉన్నత పదవులు / స్థానాలు లభించినా స్వతంత్రంగా వ్యవహరింపలేని పరిస్థితులు దేశంలో నెలకొన్నాయి. చివరకు వారిని కలిసేందుకు ఎవ్వరైనా వస్తే కీలకమైన ప్రభుత్వంలోని పెద్దల అనుమతి తప్పనిసరి అవుతుంది. రాజకీయంగా నాడు అత్యంత శక్తివంతమైన నేతగా పేరొందిన ఇందిరా గాంధీ స్వయంగా ఎంపిక చేసి దామోదరం సంజీవయ్యను ముఖ్యమంత్రిగా చేస్తే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో రాజకీయంగా ఆధిపత్యం వహిస్తున్న పెత్తందారీ వర్గం ఆయనకు అడుగడుగునా అడ్డుతగిలింది. ఆయనపై అనేక అవినీతి ఆరోపణలు ఢిల్లీకి చేరవేసి అప్రతిష్ఠకు గురిచేసే విఫల ప్రయత్నం చేసింది. నాడు ఆయనను ఆ పదవి నుండి దించేవరకు విశ్రమించనని శపథం చేసి కాసు బ్రహ్మానందరెడ్డి విజయం పొందారు. ఆ తర్వాత ఇందిరాగాంధీ పట్టుబట్టి జనరల్ సీటు అయిన కర్నూల్ నుండి లోక్‌సభ అభ్యర్థిగా నిలబెడితే కోట్ల విజయభాస్కరరెడ్డి ప్రతిష్ఠగా తీసుకొని ఓడించారు. కాంగ్రెస్ అధ్యక్షునిగా చేసినా నిలదొక్కుకోనీయలేదు. అయితే పాలన సామర్థ్యంలో తెలుగు రాష్ట్రాలను పాలించిన ఏ ముఖ్యమంత్రికీ సంజీవయ్య తీసిపోరని అందరికీ తెలిసిందే. అదే విధంగా బంగారు లక్ష్మణ్‌ను బిజెపి అధ్యక్షునిగా నాటి ప్రధాని వాజపేయి ఎంపిక చేస్తే మిగిలిన వారు తట్టుకోలేకపోయారు. ఓ కుట్రపూరితంగా ఆయనపై అవినీతి మరక చల్లి పదవి నుండి తొలగించారు. ఈ మొత్తం వ్యవహారంపై తెహల్కాకు ఓ ప్రముఖ బిజెపి నేత ఆర్థిక సహాయం చేయడం గమనార్హం. రికార్డు చేసిన టేపులో రక్షణ శాఖలో తనకు ఎవ్వరో తెలియదని, ఎటువంటి పనులు చేయలేనని లక్ష్మణ్ స్పష్టంగా చెప్పినట్లు వినిపిస్తుంది. ఇందులో కేసు ఏముందని ప్రశ్నించిన న్యాయమూర్తే ఆయనకు నాలుగేళ్లు శిక్ష విధించారు. అయితే, నాటి రక్షణ మంత్రి అధికార నివాసంలోనే రక్షణ ఒప్పందాల గురించి బేరాలు ఆడినట్లు ఆరోపణలు ఎదుర్కొన్న జయ జైట్లీ వంటి వారిని కనీసం అరెస్ట్ కూడా చేయకపోవడం గమనార్హం. జైలులో తగిన వైద్య సదుపాయం లేకపోవడంతో అనారోగ్యానికి గురైతే కనీసం ఆయనను గాని, ఆయన కుటుంబ సభ్యులను గాని పరామర్శించే ప్రయత్నం నాటి ప్రముఖ బిజెపి నాయకులు ఎవ్వరూ చేయలేదు. కేవలం నాటి పార్టీ అధ్యక్షుడు నితిన్ గడ్కరీ మారు పేరుతో జైలుకు వెళ్లి పరామర్శించారు. కానీ అనారోగ్యంతో ఆయన మృతి చెందగానే హైదరాబాద్‌కు వచ్చిన అగ్రనేతలు ఆయనను ఓ మహోన్నత దళిత నేత అంటూ పొగడ్తలు కురిపించారు. బిజెపి అధ్యక్షునిగా నితిన్ గడ్కరీ రెండోసారి కొనసాగితే తమ ఆటలు సాగవని భయంతో కొందరు ప్రముఖులు నాటి యుపిఎ ప్రభుత్వంతో చేతులు కలిపి, ఆదాయ పన్ను నోటీసులు ఆయన కంపెనీలకు ఇప్పిస్తే, వెంటనే ఓ ప్రముఖుడితో విచారణ జరిపించి ఆయనకు 'క్లీన్ చిట్' ఇప్పించారు. కానీ అటువంటి అండదండలు బంగారు లక్ష్మణ్‌కు ఎందుకు లభించలేదు? గిరిజనుల అభ్యున్నతి కోసం జీవితం మొత్తం ఎన్నో పోరాటాలు చేసి, ప్రత్యేక రాష్ట్రం సాధించిన శిబూ సొరేన్‌ను పివి నరసింహారావు ప్రభుత్వం కాపాడేందుకు రూ. 50 లక్షలు ఇస్తే, ఆ డబ్బు దాచుకోవాలని తెలియక అమాయకంగా బ్యాంకులో వేసుకొని జైలు శిక్ష అనుభవించారు. కానీ ఆరుగురు సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తులు అవినీతికి పాల్పడ్డారని నిర్దిష్టమైన సాక్ష్యాలతో మాజీ కేంద్ర న్యాయశాఖ మంత్రి శాంతిభూషణ్ పిటిషన్ దాఖలు చేస్తే, ఆయన చనిపోయి చాలాకాలమైనా ఇప్పటి వరకూ దానిపై విచారించే ప్రయత్నం చేయడం లేదు. దళితులు, గిరిజనులు అనగానే వారంతా రిజర్వేషన్ల ద్వారా వచ్చారని, ప్రతిభ లేనివారని, అవినీతిపరులని హేళనగా మాట్లాడటం అలవాటుగా మారింది. అయితే, దేశంలో దాదాపు అన్ని రాజకీయ పార్టీలు అగ్రవర్ణాల నాయకత్వంలో, ఆధిపత్యంలోనే కొనసాగుతున్నాయి. ప్రభుత్వ యంత్రాంగంలలో సైతం వారే కీలక పదవులలో ఉంటున్నారు.



ఎడిటర్ : కె. సునీల్‌కుమార్

# యంగ్ ఇండియా కలనెరవేరేనా?

ఉస్మానియా యూనివర్శిటీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో 200 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు రూ. 40 వేల కోట్లతో ఏర్పాటు చేస్తామని అన్నారు. ఢిల్లీలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో సమావేశం అయిన సందర్భంలో కూడా 105 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు కడతాం 2.70 లక్షల మందికి ప్రయోజనం చేకూరుతుంది, కనుక నిధులు విడుదల చేయమని కోరారు. అరవింద్ కేజ్రీవాల్ మూడు సార్లు పాఠశాలలు మూలంగానే ఢిల్లీలో అధికారంలోకి వచ్చారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని పనిచేస్తానని అన్నారు. మంచిదే, యంగ్ ఇండియా పాఠశాలల గురించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కలగనడంలో తప్పులేదు! కలలు సాకారం కావడానికి ఉన్న పునాది ఏమిటి అనేదే అసలు ప్రశ్న? ఈ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల ఆలోచన తెలంగాణ విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రట బుర్ర వెంకటేశం బుర్రలోనుంచి వచ్చిన సమగ్ర పాఠశాల విధానం. ఇప్పటికే జిల్లా కేంద్రాల వరకు విస్తరించిన కార్పొరేట్ విద్యాసంస్థలు విచ్చలవిడిగా ఏర్పాటు చేసిన అంతర్జాతీయ ప్రమాణాల పేరుతో లక్షల రూపాయల్లో ఫీజులు వసూలుచేస్తున్న ప్రైవేటు పాఠశాలలకు ప్రత్యామ్నాయ ఆలోచన ఆయనచేసి ఉండవచ్చును,తప్పులేదు! పదేపదే పాలకులు ఈ పాఠశాలల గురించి మాట్లడడం వలన ప్రభుత్వ ప్రాధాన్యత చెప్పకనే చెప్పినట్లైంది. 28 ఇంటిగ్రేటెడ్ పాఠశాలల నిర్మాణం కోసం 2024 ఏప్రియల్‌లోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. వాటిస్థితి ఇప్పుడు ఏమిటి? ప్రభుత్వం చెబుతున్న ఇంటిగ్రేటెడ్ పాఠశాలల అసలు స్వరూపం ఏమిటి? ఒక్కో పాఠశాలకు 25 ఎకరాల స్థలం, 2560 మంది విద్యార్థులు, 124 మంది ఉపాధ్యాయులు, విశాలమైన తరగతి గదులు నిర్మించాలి. ఒక్కో పాఠశాల నిర్మాణం కోసం 200 కోట్ల రూపాయలు ఖర్చు చొప్పున 200 పాఠశాలల నిర్మాణం కోసం రూ. 40 వేల కోట్లు నిధులు సమీకరించాలి. 5 వేల ఎకరాల స్థలం సేకరణ చేయాలి. 24,800 మంది ఉపాధ్యాయులను కొత్తగా రిక్రూట్‌మెంట్ చేసుకోవాలి. వేలకోట్ల రూపాయలతో తరగతి గదులు నిర్మించాలి. ఆధునిక వసతి సౌకర్యాలు కల్పించాలి. ముఖ్యమంత్రి కలమొత్తం సాకారం అయితే, రాష్ట్రంలో 5 లక్షలమంది విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలుతో నాణ్యమైన ఉచిత విద్య అందుతుంది. ప్రభుత్వ బడుల్లో చదువుతున్న 27 లక్షల 69 వేల మంది విద్యార్థుల్లో మిగతా 22 లక్షల విద్యార్థుల భవితవ్యం ఏమవుతుంది? ఇక ఈ ఐదు లక్షల మంది విద్యార్థులు ఎక్కడనుండి వస్తారు. ఇప్పుడున్న ప్రభుత్వ పాఠశాల లో నుండే కదా? అంటే ఉన్న బడుల నమోదును, ఉనికిని దెబ్బ తీసి, దివాలాతీయించడమే కదా! ఇక ఇప్పటికే రాష్ట్రంలో 30,022 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఒక్కో పాఠశాలకు సరాసరి ఎకరం స్థలం వేసుకున్నా 30 వేల ఎకరాల విలువైన భూములు, గత 20 ఏళ్ళుగా సర్వశిక్షా అభియాన్ నిర్మించిన 2 లక్షల కోట్ల విలువైన తరగతి గదులు, 2 లక్షల 7 వేల మంది బోధనా సిబ్బంది ఉన్నారు. ఏటా వేతనాలకు రూ. 18 వేల కోట్లు



ఖర్చు చేస్తున్నాం. ప్రభుత్వ బడుల మనుగడ, భవిష్యత్తు, ఉనికి ఏమిటి? ఇప్పటికే ప్రభుత్వ బడులకు ఇన్నివేల ఎకరాలు ప్రభుత్వ స్థలాలు ఉండగా, మరో 5 వేల ఎకరాల పంట భూములు ఇంటిగ్రేటెడ్ పాఠశాలల కోసం సేకరించడం అవసరమా? ఇప్పటికే ప్రభుత్వ బడుల్లో పిల్లలు లేనిచోట బోధనా సిబ్బంది ఉండడం, పిల్లలు ఉన్న చోట మౌలిక సౌక ర్యాలు, బోధనా సిబ్బంది లేకపోవడం, ప్రభుత్వ పాఠశాలల్లో అసమతౌల్య నిర్వాహణ అనేది ఎంతో బోధనాశక్తిని వృథా చేస్తున్నది. కాలక్రమంలో అనేక ప్రభుత్వబడులు మూతపడి ఉండడం, మరికొన్ని మూత దశకు చేరుకోవడం చూస్తున్నాము. ఇట్లాంటి స్థితిలో ఇప్పటికే ఏడాదిన్నర కాలంలో రెండు విద్యా కమిషన్‌లను ప్రభుత్వం నియమించింది. మాజీ ఐఎఎస్ అధికారి ఆకునూరి మురళి అధ్యక్షతన నియమించిన తెలంగాణ విద్యా కమిషన్ రాష్ట్రం అంతా పర్యటించి, అనేకమంది విద్యారంగం ప్రముఖుల అభిప్రాయాలు సేకరించి ఒక నివేదిక ఇచ్చింది. ఉన్న ప్రభుత్వ బడుల స్థానంలో మండలానికి నాలుగు తెలంగాణ ఫౌండేషన్ స్కూల్స్, మూడు తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేయాలని, బడులు లేని క్యాచ్‌మెంట్ ఏరియా నుండి ఉచిత రవాణా సౌకర్యం పాఠశాల వరకు కల్పించాలని, ఒక్కో మండలానికి రూ. 50 కోట్లు చొప్పున, ప్రతి ఏటా వంద మండలాలకు రూ. 5 వేల కోట్లు వెరసి ఆరు సంవత్సరాలలో 634 మండలాల్లో ప్రభుత్వ బడుల పూర్తి సంస్కరణకు రూ. 31,700 కోట్లు ఆర్థిక ప్రణాళిక కూడా ఇచ్చింది. కానీ, ప్రభుత్వం రాష్ట్ర బడ్జెట్‌లో ఒక్క పైసా విద్యా సంస్కరణ కోసం కేటాయించలేదు. సరికదా! ప్రభుత్వ పెద్దలు ప్రస్తుతం వీటి గురించి ఎక్కడా మాట్లాడడం లేదు? అంటే, కమిషన్ సిఫార్సులు చెత్తబుట్టకు పరిమితం చేసినట్లే గదా? గత పదేళ్ళలో కెసిఆర్ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలు పట్టించుకోకుండా ఒక వెయ్యి రెసిడెన్షియల్ స్కూళ్లను స్థాపించడం ద్వారా ప్రభుత్వ పాఠశాలల నమోదును దారుణంగా దెబ్బతీసింది. ఆయా రెసిడెన్సియల్ పాఠశాలలు దివాలా తీసిన ఇంజనీరింగ్ కళాశాలల్లో అద్దె భవనాల్లో కునారిల్లుతున్నాయి. ఇప్పటికీ వాటి ప్రణాళిక లోపం వలన ఆయా రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఫుడ్ పాయిజనింగ్ కేసులు బయటపడడం, కొన్ని కూలిపోయిన సంఘటనలు వెలుగు చూశాయి. పదేళ్ళ తర్వాత కెసిఆర్ విద్యా ప్రణాళిక వల్ల విద్యా ప్రమాణాలు స్థాయి దేశంలో 31వ రాష్ట్రంగా తెలంగాణ స్థిరపడింది. పరోక్షంగా ప్రభుత్వ పాఠశాల వ్యవస్థ ఈ అనాలోచిత రెసిడెన్షియల్ వ్యవస్థ వలన మరింత దెబ్బతిని ఉంది. తెలంగాణ రాష్ట్రంలో అంతర్జాతీయ ప్రమాణాల పేరుతో కార్పొరేట్ సంస్థలు విచ్చలవిడిగా పాఠశాలలు ఏర్పాటు చేసి ఒకటో తరగతికే రూ. రెండు లక్షల ఫీజులు ఏ విద్యా హక్కు చట్టం ప్రకారం వసూలు చేస్తున్నారో? చర్యలు తీసుకోవాలి. ప్రైవేటు పాఠశాల వ్యవస్థ ఫీజులు నియంత్రణ గురించి ఆలోచన చేయాలి. ఇప్పుడున్న అవసరాల స్థాయికి ప్రభుత్వ విద్యావ్యవస్థలో ప్రణాళిక రూపొందించాలి. అందుకు ఇప్పటికే అందుబాటులో ఉన్న ప్రభుత్వ వనరులు వాడుకోవడం, సద్వినియోగం దిశగా ఆలోచన చేయడం ప్రభుత్వం ముందు ఉన్న తక్షణ కర్తవ్యం.సిఎం రేవంత్‌రెడ్డి ప్రపంచస్థాయి నాణ్యమైన ఉచిత విద్య ప్రజలకు అందచేయాలనే ఆలోచనకు రావడం చాలా గొప్ప విషయం, ఆశయం, ఆలోచన, ఆయన కల అభినందనీయమే! కానీ, కలను సాకారం చేయడంలోనే పాలకుల నైపుణ్యం ఆధారపడి ఉంటుంది. ఇది ఒక్క రోజులోనో, ఏడాదిలోనో నెరవేరే లక్ష్యం కాదు! సుదీర్ఘ ప్రణాళిక, చిత్తశుద్ధితో కూడిన కృషి, పట్టుదల అవసరం. ప్రభుత్వ ఆలోచనలు ఆచరణీయమైన ప్రణాళిక దిశగా తెలంగాణ విద్యా వ్యవస్థ మంచి సంస్కరణ దిశగా కొనసాగాలని ఆశిద్దాం.

# చేతుల శుభ్రతతోనే వ్యాధుల నివారణ

"గ్లోబల్ హ్యాండ్ వాషింగ్ డే" అనేది వ్యాధులను నివారించడానికి మరియు ప్రాణాలను కాపాడటానికి సులభమైన, సమర్థవంతమైన మరియు సరసమైన మార్గంగా సబ్బుతో చేతులను శుభ్రపరచడం కోసం అంకితం చేయబడిన వార్షిక గ్లోబల్ అడ్వకేసీ డే. గ్లోబల్ హ్యాండ్ వాషింగ్ డే అక్టోబర్ 15... ప్రతి సంవత్సరం, సబ్బుతో చేతులు కడుక్కోవడం యొక్క ప్రాముఖ్యతపై ప్రపంచంలో అవగాహన పెంచడానికి ఈ రోజు ఒక వేదికగా ఉపయోగ పడుతుంది. తినే ముందు చేతులు కడుక్కోమని చెప్తే చాలా మంది, తిన్నాక ఎలాగు కడుక్కుంటాం కదా అంటారు. మరికొంత మంది అయితే, 'నిత్యావసర కార్యక్రమాలు నిర్వహించి కూడా చేతులు కడుక్కోకుండా అలాగే వస్తారు 'అవసరమేముంది అంటారు. వారి చేతుల్తో మీకు షేక్ హాండ్ ఇచ్చి, ఆ తర్వాత మీరు అదే చేతుల్తో భోజనం చేస్తే ఒక్కసారి మీ పరిస్థితి ఊహించుకోండి. అందుకే చేతులు కడుక్కోవటం అనేది ఎంతో ముఖ్యమైనది, చేతులు కడుక్కోవడం ప్రాముఖ్యత గుర్తించి, దీనిపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా ప్రతీ ఏడాది అక్టోబర్ 15న 'ప్రపంచ చేతులు కడుక్కునే దినోత్సవం నిర్వహిస్తున్నారు. చేతులు కడుక్కోక పోవడం ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులను నియంత్రించడమే ఈరోజు యొక్క ముఖ్య ఉద్దేశ్యం. ఆహారాన్ని సురక్షితంగా ఉంచడంలో, వ్యాధులను నివారించడంలో మరియు పిల్లలు బలంగా ఎదగడానికి హ్యాండ్ వాషింగ్ ఒక ముఖ్యమైన భాగం. ప్రతి సంవత్సరం, 200 మిలియన్లకు పైగా ప్రజలు గ్లోబల్ హ్యాండ్ వాషింగ్ డేను జరుపుకుంటారు. అరచేతులు శుభ్రంగానే కనిపించినా వాటి మీద కోటాను కోట్ల సూక్ష్మజీవులు ఉన్నాయని ఊహించ గలరా? నీళ్లతో చేతులు కడుక్కున్నా అవి పోవు. సబ్బుతో కానీ, హ్యాండ్‌వాష్ ద్రావకంతో కానీ దాదాపు 20 సెకన్లు కడుక్కుంటేనే చేతులు శుభ్రంగా ఉన్నట్టు. ప్రతి రోజూ భోజనం చేయడానికి ముందు, మల విసర్జనకు వెళ్లొచ్చిన తర్వాత ఇలా చేతుల్ని శుభ్రపరుచు కోవడం మనల్ని ఎన్నో అనారోగ్యాల బారి నుంచి రక్షిస్తుంది. చేతులు కడుక్కోకుండా ఉండడం వల్ల ఎన్ని రోగాలు దాడి చేసే అవకాశం ఉందో తెలుసా? రెండు వందలకు పైనే! ఆ రోగాల్ని కలిగించే సూక్ష్మజీవులు ఉండేది అరచేతుల్లోనే. ఏటా ప్రపంచ వ్యాప్తంగా 35 లక్షల మంది చిన్నారులు డయేరియా, నిమోనియా లాంటి రోగాల వల్ల మరణిస్తున్నారు. వీటిని నివారించడానికే ఈ కార్యక్రమం. ఓ అంతర్జాతీయ సర్వే ప్రకారం మన దేశంలో కేవలం 44 శాతం మంది మాత్రమే చేతుల శుభ్రత పాటిస్తున్నారని తేలింది. ఈ రోజు దేశదేశాల్లో ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఆస్ట్రేలియాలో చేతుల శుభ్రతపై రాసిన పాటని పిల్లలందరూ ఆలపిస్తారు. తజికిస్తాన్‌లో పిల్లలు బొమ్మలు, పోస్టర్‌లతో ప్రచారం చేస్తారు. మడగాస్కర్‌లో సుమారు 35 లక్షల మంది బాలలు కలిసి ఒకేసారి సబ్బుతో చేతులు కడుక్కుంటారు. ఈ కార్యక్రమంలో ఆ దేశ అధ్యక్షుడు కూడా పాల్గొంటారు. దక్షిణాఫ్రికాలో



సుమారు 90 లక్షల మంది ఎసెమ్మెస్‌లను బట్వాడా చేస్తారు. ప్రపంచ బ్యాంకు, యునిసెఫ్ ఆధ్వర్యంలో 'గ్లోబల్ పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్ షిప్ ఫర్ హ్యాండ్ వాషింగ్' సంస్థ తొలిసారిగా ఈ కార్యక్రమాన్ని 2008లో ప్రారంభించింది. అప్పుడు మన దేశం తరుపున క్రికెటర్లు సచిన్ టెండూల్కర్, యువరాజ్ సింగ్‌లు వేలాది మంది పిల్లల మధ్య సబ్బుతో చేతులు కడుక్కుని ప్రచారం చేశారు. సబ్బుతో చేతితో కడగడం వల్ల అతిసారం మరియు తీవ్రమైన శ్వాసకోశ ఇన్ఫెక్షన్లను నివారించడానికి తక్కువ ఖర్చుతో కూడుకున్న మార్గం. న్యుమోనియా ఒక ప్రధాన మృత్యు ఒడి (తీవ్రమైన శ్వాసకోశ సంక్రమణ), ఐదు సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలలో మరణాలకు మొదటి కారణం. సంవత్సరానికి 1.8 మిలియన్ల మంది పిల్లలు మరణిస్తున్నారు. విరేచనాలు మరియు న్యుమోనియా కలిసి సంవత్సరానికి దాదాపు 3.5 మిలియన్ల పిల్లల మరణాలకు కారణమవు తున్నాయి. సబ్బుతో చేతితో కడుక్కోవడం వల్ల అతిసారం కేసులు 30% మరియు శ్వాసకోశ ఇన్ఫెక్షన్లు ఐదు సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలలో 21% తగ్గుతాయని అంచనా. కోవిడ్-19 మహమ్మారి సూక్ష్మ క్రిముల వ్యాప్తిని ఆపడానికి మరియు ఆరోగ్యంగా ఉండటానికి అత్యంత ప్రభావ వంతమైన మార్గాలలో ఒకటి కూడా సబ్బు, నీటితో చేతులు కడుక్కోవడం. చేతులు శుభ్రంగా ఉంచడం వల్ల డయేరియా అనారోగ్యాలలో మరియు జలుబు లేదా ఫ్లూ వంటి శ్వాసకోశ ఇన్ఫెక్షన్లను నివారించ వచ్చు. ప్రతి సంవత్సరం అక్టోబర్ 15, గ్లోబల్ హ్యాండ్ వాషింగ్ డే ఇంట్లో, సమాజంలో మరియు ప్రపంచ వ్యాప్తంగా సబ్బు మరియు నీటితో చేతితో కడగడం యొక్క ప్రాముఖ్యతను తెలియజేస్తుంది. అనారోగ్యం బారిన పడకుండా మరియు ఇతరులకు సూక్ష్మ క్రిములను వ్యాప్తి చేయకుండా ఉండటానికి మనం తీసుకోగల ఉత్తమ చర్యలలో సబ్బు మరియు నీటితో చేతులు కడుక్కోవడం. 2008 లో గ్లోబల్ హ్యాండ్‌వాషింగ్ పార్ట్‌నర్‌షిప్ చేత "అందరికీ హ్యాండ్ హైజీన్" నినాదంతో ప్రపంచ వ్యాప్తంగా, ముఖ్యంగా బహిరంగ ప్రదేశాలు, పాఠశాలలు మరియు ఆరోగ్య సంరక్షణ కేంద్రాలలో సబ్బు మరియు నీటిని అందుబాటులోకి తీసుకు రావడంపై అవగాహన పెంచే కార్యక్రమాలు నిర్వహించారు. పరిశుభ్రమైన నీరు మరియు సబ్బు వాడకం మంచి అలవాటు. సబ్బు మరియు శుభ్రమైన నీటితో చేతులు కడుక్కోనప్పుడు ప్రజలను అనారోగ్యానికి గురిచేసే అనేక సూక్ష్మక్రిములు వ్యాప్తి చెందుతాయి. అందుకే హ్యాండ్ వాషింగ్ చాలా ముఖ్యమైనది. ముఖ్యంగా బాత్రూమ్ ఉపయోగించిన తర్వాత, ఆహారాన్ని తయారు చేసేటప్పుడు, తినడానికి ముందు, మరియు దగ్గు, తుమ్ము లేదా మీ ముక్కును చీదడం వంటి ముఖ్య సమయాల్లో చేతులను శుభ్రంగా కడుక్కోవాలి. చేతులను శుభ్రంగా ఉంచుకోవాలని మరియు వాటిని క్రమం తప్పకుండా కడగాలని, తినడానికి ముందు మరియు తరువాత, వాష్ రూమ్ ఉపయోగించిన తర్వాత లేదా ఇంట్లోకి ప్రవేశించేటప్పుడు చేతి పరిశుభ్రత పాటించాలి అనేది కొత్త భావన కానప్పటికీ... ప్రస్తుత ఆరోగ్య సంక్షోభం కారణంగా ఇది మరింత ప్రాముఖ్యతను సంతరించుకుంది. కరోనా వైరస్ వ్యాప్తి చెందకుండా నిరోధించడానికి సబ్బు మరియు నీటితో క్రమం తప్పకుండా చేతులు కడుక్కోవడం ద్వారా అనేక ఇతర సంక్రమణ వ్యాధులు సోకకుండా నివారించాలి. కమ్యూనిటీలలో హ్యాండ్ వాషింగ్ సబ్బు మరియు నీటితో చేతులు కడుక్కోవడం సరళమైనది మరియు చవకైనది మాత్రమే కాదు, అనారోగ్యానికి గురయ్యే చిన్న పిల్లల సంఖ్యను కూడా గణనీయంగా తగ్గిస్తుంది . హ్యాండ్ వాషింగ్ గురించి ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా ఆరోగ్యంగా ఉండటానికి సహాయ పడుతుంది. ఈ సంవత్సరం గ్లోబల్ హ్యాండ్ వాషింగ్ రోజున, ఐక్యరాజ్య సమితికి ఫిన్లాండ్ మరియు యునైటెడ్ కింగ్‌డమ్ యొక్క శాశ్వత మిషన్లు, గ్లోబల్ హ్యాండ్ వాషింగ్ పార్ట్‌నర్‌షిప్, ప్రపంచ ఆరోగ్య సంస్థ మరియు యునిసెఫ్, ఒక ఉన్నత-స్థాయి వర్చువల్ ఈవెంట్‌ను సమావేశ పరుస్తున్నాయి. 2020 ప్రచారంలో భాగంగా, ప్రపంచ ఆరోగ్య సంస్థ మరియు భాగస్వాములు గ్లోబల్ హ్యాండ్‌వాషింగ్ డే ఈ సంవత్సరం థీమ్ "అందరికీ హ్యాండ్ హైజీన్". న్యుమోనియా, ఒక ప్రధాన వ్యాధిగా (తీవ్రమైన శ్వాసకోశ సంక్రమణ), ఐదు సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలలో మరణాలకు మొదటి కారణం, సంవత్సరానికి 1.8 మిలియన్ల మంది పిల్లలు మరణిస్తున్నారు. విరేచనాలు మరియు న్యుమోనియా కలిసి సంవత్సరానికి దాదాపు 3.5 మిలియన్ల పిల్లల మరణాలకు కారణ మవుతున్నాయి. సబ్బుతో చేతితో కడుక్కోవడం వల్ల అతిసారం కేసులు 30% మరియు శ్వాసకోశ ఇన్ఫెక్షన్లు ఐదు సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలలో 21% తగ్గుతాయని అంచనా. సమాజంలో అందరూ ప్రస్తుతం మరియు భవిష్యత్తు కోసం సార్వత్రిక చేతి పరిశుభ్రతను సాధించాలి. చేతి పరిశుభ్రతకు ప్రపంచ ప్రాధాన్యత నివ్వాలి. ఆరోగ్య సంరక్షణ కార్మికులతో (పారిశుధ్య కార్మికులతో) శుభ్రమైన సంరక్షణ మరియు అంటువ్యాధుల నివారణలో పాల్గొనాలి. అన్ని సమాజాలలో సబ్బుతో చేతితో కడగడం యొక్క సాధారణ సంస్కృతిని ప్రోత్స హించాలి మరియు మద్దతు ఇవ్వాలి.



### విశాఖ అంటే ఉక్కు పరిశ్రమే కాదు..

# ప్రపంచ దేశాలకు గూగుల్‌తో గోల్డ్ హబ్

## కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** గూగుల్ సెంటర్ ఏర్పాటుతో విశాఖపట్నం విశ్వనగరంగా ఎదిగేందుకు మరో అడుగు ముందుకు పడిందని రాష్ట్ర కార్మిక శాఖమంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖమంత్రి నారా లోకేష్ ల కృషి వల్లే ఇది సాధ్యమైందని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.వికసిత్ భారత్ లక్ష్యానికి ఈ కొత్త సాంకేతికత ఉపయోగపడుతుందన్న ఆశా భావాన్ని సుభాష్ వ్యక్తం చేశారు.గూగుల్ సంస్థ విశాఖలో హైపర్ స్కిల్ డేటా సెంటర్ ఏర్పాటుతో విశాఖపట్నం గేమ్ చేంజర్ గా మారబోతోందని ఆయన పేర్కొన్నారు.చంద్రబాబు అంటే ఐటీ అని,ఐటీ అనేలా విశాఖనగరం రూపుదిద్దుకోబోతోందని ఆయన తెలియజేశారు. ఏఐ టెక్నాలజీని సైతం విశాఖకు నిలయంగా మలిచే ప్రయత్నం చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ బలమైన పునాదులు వేస్తున్నారని మంత్రి సుభాష్ కొనియాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 16 నెలల పాలనలో ఏకంగా దాదాపు 11లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చాయని,ఒక్కగూగుల్ సంస్థే లక్ష 33 వేల కోట్ల రూపాయలను పెట్టుబడి పెడుతోందంటే అది బాబు గ్యారెంటీకి దిక్సూచిగా నిలుస్తుందని వాసంశెట్టి సుభాష్ తెలిపారు. ఇప్పటికే అభివృద్ధి పథంలో సాగుతున్న విశాఖ రూపురేఖలు ఈ డేటా సెంటర్ తో పూర్తిగా మారిపోతాయన్న ఆకాంక్షను సుభాష్ వ్యక్తం చేశారు.అటు ఉత్తరాంధ్ర వారికే కాకుండా కోస్తా జిల్లాలోని ఐటి నిపుణులకు ఈ సెంటర్ ద్వారా ఉపాధి లభిస్తుందన్నారు.భారత డిజిటల్ ఎకానమీని సమూలంగా మార్చేందుకు ఈ కేంద్రం ప్రేరకం అవుతుందని మంత్రి తెలియజేశారు.సీఎం చంద్రబాబు చొరవ,లోకేష్ శ్రద్ధాసక్తులకు మంత్రి సుభాష్ అభినందనలు తెలియ జేశారు.

### ఆత్మహత్య జరిగిన సంఘటన స్థలాన్ని

# పరిశీలించిన డీఎస్పీ సిఐ, ఎస్ఐలు





**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గం ఆలమూరు మండలం మడికి శివారు చిలకలపూడి గ్రామంలో ఆత్మహత్య జరిగిన సంఘటన స్థలాన్ని కొత్తపేట డిఎస్పి సుంకర మురళీమోహన్ సిఐ, ఆలమూరు ఎస్ఐలతో కలిసి పరిశీలించారు బాధితుల బంధువులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఇద్దరు పిల్లలకు కూల్ డ్రింక్ లో పాయిజన్ ఇచ్చి అదే గదిలో తాను హ్యాంగ్ చేసుకుని మరణించాడు. హ్యాంగ్ చేసుకోవడానికి ముందు తాను ఎందుకు చనిపోతున్నాను కారణం చెబుతూ ఒక సెల్ఫీ వీడియో తీసి తన బ్రదర్‌కు పంపించాడు. మధ్య రాత్రిలో యూరినెస్‌కి లేచిన అతని బ్రదర్ అలవాటు ప్రకారం తన వాట్సాప్ చెక్ చేయగా తన తమ్ముడు పంపించిన సెల్ఫీ వీడియో చూసి బంధువులను తీసుకొని దగ్గరలో ఉన్న ఆర్ఎంపీ డాక్టర్ తీసుకుని సంఘటన స్థలానికి వెళ్లగా అప్పటికే వారు చనిపోయి ఉన్నారు. మృతుడి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని క్లూస్ టీం డాగ్స్ స్క్వాడ్ ఎఫ్ఎస్ఎల్‌టీంలను రప్పిస్తున్నామని తెలిపారు. సాక్ష్యదారాలను సేకరించిన తర్వాత మృత దేహాలను పోస్టుమార్టంకి పంపించి దర్యాప్తులో మృతిని మృతికి కారణాలు తెలుసుకొని తదుపరి చర్యలు తీసుకు తీసుకుంటామని తెలిపారు. మృతుడి సెల్ఫీ వీడియో ప్రకారం ముగ్గురు వ్యక్తులు తనను పగబట్టి టార్చర్ చేస్తున్నారని ఇద్దరైతే ఆక్సిడెంట్ చేసి చంపేందుకు ప్రయత్నించారని వారిలో పావులూరి దుర్గారావు, కరుపురోలు తలుపులు, కరుపురోలు శ్రీనివాస్ అనే ముగ్గురు వ్యక్తులు టార్చర్ భరించలేక ఆత్మహత్యకు పాల్పడుతున్నానని తల్లితో అక్రమ సంబంధం అంటగడుతున్నారని తన తల్లిని దుర్భాష లాడుతున్నారని తన భార్య చావుకి కారణం కూడా కరుపురోలు తలుపులు, కరుపురోలు శ్రీనివాస్ ఈ ఇద్దరు వ్యక్తులే అని వారి వల్లే నా బిడ్డలను కూడా చంపుతున్నానని వారి ముగ్గురిని పోలీసులు వదలొద్దు అంటూ సెల్ఫీ వీడియో రికార్డ్ చేసి ఆత్మహత్య చేసుకున్నాడు. తన కొడుకు మనవళ్ళు మరణంతో ఆ తల్లి శోకసముద్రంలో మునిగిపోయింది ముక్కు పచ్చలారని చిన్నారులున్నాలు విగత జీవులుగా పడి ఉండడంతో ఆ చిన్నారులను వదిలేసిన నేను బ్రతికించుకునే దాన్ని అంటూ గుండె పగిలేలా రోధిస్తుంది.

# విద్యతో పాటు ఉత్తమ ప్రతిభను వెలికి తీయడంలో విజ్ఞాన్ ముందంజ

### యువజనోత్సవాలు-2025లో ప్రతిభ చాటిన రాయవరం విజ్ఞాన్ విద్యార్థి

### విద్యార్థి త్రివిక్రమ్‌ను ప్రత్యేకంగా అభినందించిన విజ్ఞాన్ యాజమాన్యం




**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** తూర్పు గోదావరి జిల్లా స్థాయి యువజనోత్సవాలు-2025 వేదికగా, యువజన సర్వీసుల శాఖ(సెట్రాజ్) నిర్వహించిన చిత్రలేఖనం పోటీలలో రాయవరం విజ్ఞాన్ జూనియర్ కళాశాల విద్యార్థి దాస్యం వెంకట త్రివిక్రమ్ ఉత్తమ ప్రతిభను కనబరిచి జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం సాధించడమే కాకుండా, రాష్ట్రస్థాయి పోటీలకు నేరుగా అర్హత సాధించాడని కళాశాల ప్రిన్సిపాల్ సబ్బెళ్ల అచ్చిరెడ్డి బుధవారం తెలిపారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో వి.సి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ, సెట్రాజ్ డి.డి రామకృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం యువజనోత్సవ పోటీలను నిర్వహించగా, ఈ పోటీలలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచిన త్రివిక్రమ్ ను ఆదికవి నన్నయ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మల్లిడి అమ్మిరెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ప్రస్తుతం కొనసాగుతున్న విద్యా విధానం పరిశీలిస్తే పుస్తక పఠనం, ర్యాంకుల మీదే ఎక్కువ దృష్టి పెడుతున్న తరుణంలో, చదువులో రాణించడమే కాక, తనలో ఉన్న ప్రతిభకు పదును పెట్టి, చిత్రలేఖనంలో విజయాలు సాధిస్తున్న త్రివిక్రమ్ భవిష్యత్తులో ఇంకా అత్యుత్తమ స్థాయిలో రాణించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విజ్ఞాన్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ మల్లిడి శేషవేణి మాట్లాడుతూ గతంలో త్రివిక్రమ్ చిత్రలేఖనంలో సాధించిన విజయాలతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చిత్రపటం వేసి, ఆయనకు అందజేసిన విషయాన్ని గుర్తు చేశారు. చదువులలో విద్యార్థులకు స్ఫూర్తి నింపడమే కాకుండా, ఆ విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి వెలికితీయడంలో, ఒక అడుగు ముందుండే విజ్ఞాన్ సంస్థ యాజమాన్యానికి, డ్రాయింగ్ మాస్టర్ సత్యానందం, తల్లిదండ్రులకు త్రివిక్రమ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వివిఎస్ఆర్ రూరల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మల్లిడి సతీష్ రెడ్డి, విజ్ఞాన్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎన్ త్రివేణి, టిఎస్ఆర్ కోచింగ్ ఇన్స్టిట్యూట్ అధినేత డాక్టర్ తేతల సుబ్బిరెడ్డి, కెవిఎస్ శర్మ, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

# పలువురిని పరామర్శించిన ఎమ్మెల్సీ తోట...



**మండపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** మాతృవియోగంతో బాధపడుతున్న పట్టణ వైస్సార్సీపీ నాయకులు పేపర్తి సత్యనారాయణ మూర్తి (సాంబు)ను రాష్ట్ర సబార్డినేట్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు బుధవారం వారి స్వగృహంలో కలిసి పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం మాతృవియోగంతో బాధపడుతున్న 3వ వార్డులో నివాసం ఉంటున్న ప్రముఖ హోమియో వైద్య నిపుణులు చల్లా రవికుమార్ లను పరామర్శించారు. ఈ పరామర్శలో కౌన్సిలర్ పోతంశెట్టి వర ప్రసాద్, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు దూలం వెంకన్నబాబు, రూరల్ కన్వీనర్ అడబాల బాబ్జీ, ఎంప్లాయిస్ & పెన్షనర్స్ వింగ్ కార్యదర్శి టపా పుల్లేశ్వరరావు, రాష్ట్ర కార్మిక విభాగం శెట్టి నాగేశ్వరరావు, సూరంపూడి సత్యప్రసాద్, ఐ టి వింగ్ కన్వీనర్ యరమాటి వెంకన్నబాబు, సొసైటీ మాజీ అధ్యక్షులు పెంకే గంగాధరం, తణుకు అశోక్, తదితరులు పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలను పరామర్శించిన శ్రీకాంత్





**అల్లవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** అల్లవరం మండలం గోడిలంక గ్రామానికి వైస్ ఎంపీపీ వడ్డీ గంగ మావయ్య వడ్డీ వీరన్న,గోడిలంక గ్రామానికి చెందిన చెల్లి సత్యం, బెండమూరులంక గ్రామానికి చెందిన చొప్పెల్ల ఎజ్రా గార్ల అకాల మరణానికి చింతిస్తూ అమలాపురం నియోజకవర్గ కో ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ వారి పార్థివ్ దేహాలకు బుధవారం నివాళులు అర్పించారు. ఆయనతో పాటుగా ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, మండల పార్టీ అధ్యక్షులు కొనుకు బాపూజీ, దళిత నాయకులు నాతి శ్రీను,కో ఆప్షన్ సభ్యులు పల్లి జేమ్స్ రాజు, తుమ్మలపల్లి ఎంపీటీసీ పులుసుగంటి రాజేశ్వరి ప్రమోద్, బొడసకుర్రు ఎంపీటీసీ దొమ్మేటి శాంతి భవాని, సామంతకుర్రు ఎంపీటీసీ కర్రి శ్రీను తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

### గూగుల్ సంస్థను మన రాష్ట్రానికి రావడంలో

# నారా లోకేష్ కృషి అభినందనీయం : గుబ్బల



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రానికి ఒకే రాజధాని అభివృద్ధి అంతటా వికేంద్రీకరణ జరగాలి మంత్రి నారా లోకేష్ ఆలోచన సమర్ధనీయం. అంతర్జాతీయ గూగుల్ సంస్థను విశాఖపట్నంలో ఏర్పాటు చేయటానికి మంత్రి నారా లోకేష్ చేసిన కృషి అభినందనీయమని మూర్తి అన్నారు. యువతకు ఇది ఎంతో ప్రయోజనకరమని వారి భవిష్యత్తుకు బాసటగా నిలుస్తుందనీ సుమారు లక్ష మందికి పైగా ఉద్యోగ అవకాశాలు ఏర్పడతాయని వారు పేర్కొన్నారు. యువతకు ఉపాధి కల్పించాలని లక్ష్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంత్రి నారా లోకేష్ అహర్నిశలు శ్రమించి కంపెనీలను మన రాష్ట్రానికి తీసుకుని వస్తున్నారని తెలియజేశారు. గూగుల్ క్లౌడ్ సంస్థ మన ప్రభుత్వంతో ఒప్పందం చేసుకోవటం శుభ పరిణామం అని అన్నారు.ప్రపంచంలో అమెరికా తర్వాత దేశంలోనే అతిపెద్ద తొలి ఏఐ హబ్ గూగుల్ క్లౌడ్ సంస్థను విశాఖలో ఏర్పాటు చేయబోతుందన్నారు. ఈ సబ్ సి కేబుల్ నెట్ వర్క్‌ను అంతర్జాతీయ నెట్ వర్క్ కనెక్ట్ చేసి దేశంలోని వివిధ ప్రాంతాల్లోని డిజిటల్ ఆధారిత సంస్థలకు గూగుల్ అనుసంధానం చేయనుందని అన్నారు. దీంతో అంతర్జాతీయ స్థాయిలో విశాఖపట్నం కనెక్టివిటీ కేంద్రంగా మారనుందన్నారు. ఈ హబ్ లోని ఏఐ టెక్నాలజీ ద్వారా గూగుల్ చర్చ్, సైబర్ సెక్యూరిటీ క్లౌడ్ వంటి ఇతర గూగుల్ సేవలు విశాఖ నుంచి ప్రపంచానికి అందించబడునున్నాయన్నారు. గతంలో మైక్రోసాఫ్ట్ కంపెనీని అప్పటి ఉమ్మడి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హైదరాబాద్ తీసుకుని రావడంతో ఏ విధంగా అభివృద్ధిలో కారకంగా నిలిచిందో అదే విధంగా గూగుల్ సంస్థ కూడా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.. భవిష్యత్తును ముందే గ్రహించి ఆలోచన చేసే చంద్రబాబు నాయుడు వారసుడుగా నారా లోకేష్ భవిష్యత్ తరాలకు పునాదిరాయిగా నిలుస్తున్నారని గుబ్బల మూర్తి తెలియజేశారు.

# అబ్దుల్ కలాం దార్శనికుడు, స్ఫూర్తి ప్రదాత

### సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** భారత మాజీ రాష్ట్రపతి, భారత రత్న,క్షిపణి పితామహుడు ఎపిజె అబ్దుల్ కలాం గొప్ప దార్శనికుడు,మార్గ దర్శిని అని సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్, కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం పేర్కొన్నారు. బుధవారం రామచంద్రపురం తెలుగుదేశం పార్టీ ఉమ్మడి కార్యాలయంలో అబ్దుల్ కలాం 94వ జయంతి ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ స్వయం కృషి,స్వీయ ప్రతిభతో ఒక సామాన్యుడు, అసామాన్యుడు కాగలడని కలాం నిరూపించారన్నారు. అలాగే రామేశ్వరం నుండి రాష్ట్రపతి భవన్ వరకు పోగలడని, ఒక పేపర్ బాయ్ శాస్త్రవేత్త కాగలడని భారత మాజీ రాష్ట్రపతి కలాం నిరూపించారన్నారు. కలలు కనండి,వాటిని సాకారం చేసుకోండి అని కలాం ఇచ్చిన సందేశం ప్రపంచ వ్యాప్తంగా యువతకు తారక మంత్రంలా పని చేసిందన్నారు. రక్షణ, అంతరిక్ష, వైద్య, మానవ రంగాల కోసం కృషి చేసిన శాస్త్రవేత్త అన్నారు.అగ్ని, పృథ్వీ క్షిపణుల రూప శిల్పి కలాం అన్నారు. కలాం సూక్తి వలన పర్యావరణం, చెట్ల పెంపకం పట్ల ఆయనకున్న అవగాహనను తెలియజేస్తుందని చెప్పారు. ఆయన నిత్య విద్యార్థి అని అందుకే అబ్దుల్ కలాం జన్మదినమైన అక్టోబర్ 15 ను అంతర్జాతీయ విద్యార్థి దినంగా ఐక్యరాజ్య సమితి ప్రకటించిందని చెప్పారు. ఆయన నిరాడంబరత, మానవీయత ప్రతి ఒక్కరికీ ఆదర్శం, అనుసరణీయం, స్ఫూర్తిదాయకమని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్.కె పిపి ట్రస్ట్ చైర్మన్ సలాది నాయుడు మాస్టర్, కూటమి పార్టీ నాయకులు కడియాల రాఘవన్, కవల నానాజీ, కంచుమర్తి బాబురావు, నారపురెడ్డి బలరాం, వీరబాబు, కోట తాతబ్బాయి, ప్రముఖ న్యాయవాది దొమ్మలపాటి సత్యనారాయణ, ఏసుదాసు, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రపతి అబ్దుల్ కలాం 94వ జయంతి వేడుకలు



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం కొత్తపేట విద్యాబాల మందిర్ హై స్కూల్లో భారత మాజీ 11వ రాష్ట్రపతి అబ్దుల్ కలాం 94వ జన్మదినోత్సవం సందర్భంగా ఆయన చిత్రపటానికి పాఠశాల కరస్పాండెంట్ రామోజీ అనురాధ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ ఏపీజే అబ్దుల్ కలాం అని ప్రముఖంగా పిలవబడే డాక్టర్ అవుల్ ఫకీర్ జైనులబ్దీన్ అబ్దుల్ కలాం అక్టోబర్ 15, 1931న తమిళనాడులోని రామేశ్వరంలో జన్మించారు ఆయన భారత దేశపు ప్రముఖ క్షిపణి శాస్త్రవేత్త మరియు 11వ భారత రాష్ట్రపతిగా సేవలందించి జూలై 27, 2017న మరణించారని తెలిపారు. మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా పిలవబడే అబ్దుల్ కలాం విద్యార్థులకు స్ఫూర్తిదాయకునిగా నిలిచారని ఆయన విద్యారంగంలో ప్రశంసనీయమైన కృషి చేశారనికావున ఆ మహనీయుని గౌరవార్థం ప్రతి సంవత్సరం అక్టోబర్ 15వ తేదీ ప్రపంచ విద్యార్థుల దినోత్సవంగా జరుపుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నూక పెయి శివరత్నం, సుధాకర్, హుస్సేన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని ఆయనకు ఘన నివాళులర్పించారు

# లైబ్రరీ పుస్తకాలను విద్యార్థులు వినియోగించే విధంగా చర్యలు తీసుకోవాలి



**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, మండల కేంద్రమైన రాయవరంలోని శ్రీరామయ్య జెడ్పీ ఉన్నత పాఠశాలను సమగ్ర శిక్షా ఏఎంవో పి.రాంబాబు బుధవారం సందర్శించారు. పాఠశాలలో జరుగుతున్న సెల్ఫ్ అసెస్మెంట్-2 పరీక్షలు జరుగుతున్న విధానాన్ని ఆయన పరిశీలించిన ఆయనకు పరీక్షలు నిర్వహిస్తున్న విధానాన్ని పాఠశాల హెచ్ఎం వీవీఎస్ సునీత వివరించారు. అసెస్మెంట్ బుక్‌లెట్‌లో పరీక్షలు రాస్తున్న విధానాన్ని పరిశీలించిన ఆయన అక్టోబర్ 13న ప్రారంభమైన పరీక్షలు గురువారంతో ముగుస్తున్నాయని తెలిపారు. ఎక్కడా ఎటువంటి లోపాలు లేకుండా పరీక్షలను సమర్ధవంతంగా నిర్వహించాలని సూచించారు. అనంతరం పాఠశాలలో అమలవుతున్న పీఎంశ్రీ పనులపై ఆరా తీసిన ఆయన కిచెన్ గార్డెన్‌లో అధికంగా కాయగూరలు పండించే విధంగా చర్యలు తీసుకోవాలని హెచ్ఎం సునీతకు సూచించారు. సమగ్ర శిక్షా ద్వారా సరఫరా చేసిన లైబ్రరీ పుస్తకాలను విద్యార్థులు వినియోగించే విధంగా చర్యలు తీసుకోవాలని వివరించారు విద్యార్థులు ఇంటి వద్దనే లైబ్రరీ పుస్తకాలు చదువుకునే విధంగా చూడాలన్నారు. లైబ్రరీ పుస్తకాలు విద్యార్థులకు ఇస్తున్నట్లుగా ఇష్యూ రిజిస్టర్ మెయింటైన్ చేయాలన్నారు. ఉపాధ్యాయులకు ఏఎంవో రాంబాబు పలు సూచనలు చేశారు.

# అమ్మ సీతమ్మ సేవా సమితి వారి ఆర్థిక సహాయం



**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెంలో గంటి పెదపూడిరోడ్‌లో రోడ్డు ప్రమాదానికి గురైన అయినవిల్లి మండలం క్రాప గ్రామ నివాసి దుర్గాప్రసాద్‌కి ఆక్సిడెంట్ లోసట్ట జారిపోవడం వలన రావులపాలెం హాస్పిటల్లో ఆపరేషన్ నిమిత్తం అడ్మిట్ అయిన వ్యక్తికి అమ్మ సీతమ్మ సేవా సంస్థ ద్వారా 6000 రూపాయలు ఆర్థిక సహాయం చేయడం జరిగినదని ఆపరేషన్ మొత్తం లక్ష రూపాయలు అవుతుందని దాతలు సహాయం కోరుతున్నామని పేషంట్ దుర్గాప్రసాద్ చెప్పారని సంస్థ సభ్యులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అమ్మ సీతమ్మ సేవా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మాధవి స్పోర్ట్స్ క్లబ్ ఆరంభం






**మండపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** క్రీడలను ఎప్పుడు ప్రోత్సహించే మాధవి ఆయిల్స్ అధినేత వేగుళ్ళ కృష్ణ చైతన్య బాబు స్థానిక విజయలక్ష్మి నగర్ శివారు బైపాస్ రోడ్డు నందు యువతకు ఉపయోగకరమైన మాధవి స్పోర్ట్స్ బాక్సులను బుధవారం నాడు ప్రారంభించారు. ఇందులో రెండు క్రికెట్ కోర్టులు, ఒక షెట్టిల్ కోర్టు, ఒక వాలీబాల్ కోర్ట్, ఒక పింక్ బాల్ కోర్టును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువత ఆరోగ్యం పట్ల పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రోజుకి ఒక గంటపాటైన ఆరోగ్యం పట్ల దృష్టి సారించి కసరత్తులు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమానికి వేగుళ్ల పట్టాభి రామయ్య చౌదరి, వేగుళ్ల రేణుకాదేవి, వల్లూరి కుమార్ బాబు, వల్లూరి రామన్న చౌదరి, వల్లూరి మనోజ్ బాబు, వంక ప్రసాద్, వేగుళ్ల బాబీ, అయినవిల్లి రాజేష్, యాదగిరి ప్రసాద్, వట్టికుట్టి రమేష్, మాధవి ఆయిల్ కంపెనీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కుటుంబ ఆరోగ్యంలో పురుషులూ కీలకపాత్ర పోషించాలి

## ఐసిడిఎస్ సిబ్బంది కృషి నిరంతర ఉద్యమమే - ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ప్రకటన
## వ్యాస రచన, ఆటల పోటీల బహుమతుల పంపిణీ





**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మన దైనందిన కుటుంబ జీవన విధానపు ఆహార వినియోగంలో పౌష్టికాహారం తీసుకోవడం ప్రాముఖ్యతను స్త్రీలతో పాటు పురుషులూ అర్థం చేసుకోవాలని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పిలుపును ఇచ్చారు. అంతే కాకుండా ఆ ప్రాముఖ్యతను పాటిస్తూ సకుటుంబ సంపూర్ణ ఆరోగ్యంలో పురుషులూ కీలక పాత్ర పోషించాలని పురుషులకు ఎమ్మెల్యే హితవు పలికారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న "సుపోషిత్ భారత్ - సక్షం భారత్" పథకంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం కత్తిపూడి వినాయక మారుతి వర్తక సంఘం కళ్యాణ మండపంలో శంఖవరం, ప్రత్తిపాడు మండలాల ఐసిడిఎస్ పథకాల సారథ్యంలో అక్టోబర్ 11 సందర్భాన్ని పురస్కరించుకొని అంతర్జాతీయ బాలికా దినోత్సవం, 8 వ రాష్ట్రీయ పోషణ మాసం (పౌష్టికాహార మాసోత్సవం)ను పురస్కరించుకొని నియోజకవర్గ స్థాయిలో అవగాహనా ప్రచార కార్యక్రమాలను బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించారు. ముఖ్య అతిథిగా జ్యోతీ ప్రజ్వలనంచేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే సత్యప్రభ సభికులను ఉద్దేశించి ప్రసంగించారు. గర్భిణీలకు రక్తహీనత ఉంటే శిశువులు కూడా రక్త హీనతతో జన్మిస్తారనీ, గర్భిణీలు, బాలింతలు, శిశువులు, చిన్నారులు అందరూ కూడా రక్త హీనత సమస్య పాలు కారాదనేదే ఐసిడిఎస్ పథకం ప్రధాన లక్ష్యం అన్నారు. మన ఆహారపు అలవాట్లే మన ఆరోగ్యాన్ని నిర్దేశిస్తాయి. ఒకప్పటి పాత తరం కాలంలో ఆహార నియంత్రణ గురించి, సరైన ఆహారం తీసుకోవడంపై మన పూర్వీకులు సలహాలిచ్చేవారు. ప్రస్తుతం అంతా వేగవంతమైన జీవన పరుగులో ఆహార వినియోగ నియంత్రణ కొరవడ్డంతో ప్రపంచ వ్యాప్తంగా ఊబకాయం ప్రధాన సమస్యగా మారింది. ఊబకాయం, రక్తహీనత వంటి సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో సరైన ఆహారపు అలవాట్లు అలవరచు కోవాలని సూచించారు. సాంకేతిక యుగంలో ఫాస్ట్ ఫుడ్ కల్చర్ పిల్లల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుందని, సంప్రదాయ బలవర్ధక ఆహారానికి ప్రాధాన్యం ఇవ్వాలని పిలుపును ఇచ్చారు. గర్భిణీలు స్త్రీలు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అత్యంత అవసరమని తెలిపారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం సంతోషంగా ఉంటుంది అన్నారు. అందుకే పోషకాహార (సుపోషణ) వినియోగంపై ప్రచారాన్ని ప్రభుత్వాలు నిర్వహిస్తున్నాయి. ఈ అవగాహన ప్రచారాలను మైదాన ప్రాంత వాసులకే గాక మారుమూల గిరిజన గ్రామాల్లోని మహిళలకు సైతం అవగాహన కల్పించాలని ఐసిడిఎస్ సిబ్బందిని ఎమ్మెల్యే సభాముఖంగా ఆదేశించారు. ఇదే విషయాన్ని గత సభల్లో కూడా ప్రత్యేకించి చెప్పానని ఆమె గుర్తు చేశారు. సంపూర్ణ ఆరోగ్యం, సంపూర్ణ పోషకాహారం వినియోగంపై ఒక మహిళలకే గాక పురుషులకు కూడా అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే సూచించారు. కుటుంబ సుపోషణలో తల్లులతో పాటు తండ్రులకూ అవగాహన ఉండాలని, పురుషులు కూడా సమాన సహకార, బాధ్యతలు వహించాలని అన్యాపదేశంగా సత్యప్రభ సూచించారు. గర్భిణీలు, బాలింతలకు పోషకాహారం అందించడానికి, సంపూర్ణ ఆరోగ్యం కల్పించడానికి ఐసిడిఎస్ సిబ్బంది నిరంతరం ఒక ఉద్యమమే చేస్తూన్నారని ఎమ్మెల్యే ప్రశంసించారు. చిన్నారులు, విద్యార్థులను ఉద్దేశించి ఆటలు, వ్యాస రచన వంటి పోటీల్లో పాల్గొన్న వారికి విజ్ఞానం, ఆత్మవిశ్వాసం పెరుగుతుందని ఆమె అన్నారు. ప్రతీ బాలిక ఉన్నత విద్య అభ్యసించి, ఉన్నత స్థాయికి ఎదగాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ఆశీర్వదించారు.

**పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం - సిడీపీఓలు**

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యమని, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అంగనవాడీ కార్యకర్తలకు శంఖవరం, ప్రత్తిపాడు ఐసీడీఎస్. సీడీపీఓలు పర్వత వెంకటలక్ష్మి, తేపర్తి దేవీశరత్న పద్మవతి సూచించారు. పౌష్టికాహారంతో పాటు కూర గాయలు, ఆకు కూరలను కూడా బాగా తీసుకోవాలి అన్నారు. అందువల్ల కలిగే లాభాలను గురించి వివరించారు. పౌష్టికాహారం తినడంవల్ల గర్భిణులు, బాలింతలకు రక్తహీనత దరి చేరదని, అందుకు అంగన్వాడీ కేంద్రాలద్వారా లభించే పోషకాహారం క్రమం తప్పకుండా వాడాలి అన్నారు. ఐదేళ్ల లోపు చిన్నారులకు జంక్ ఫుడ్ పెట్టకూడదని కేవలం కూర గాయలు, ఆకు కూరలు, పండ్లు, చిరు ధాన్యాలు వాడాలని అవగాహన కల్పించారు. రెండు మండలాల పరిధిలోని గర్భిణీలకు సామూహిక సీమంతాలను నిర్వహించి, రవికలు, పూలు, పండ్లు, ఇతర బలవర్ధక ఆహార పదార్థాలను ఎమ్మెల్యే ద్వారా బహూకరించారు. నియోజక వర్గ స్థాయిలో నిర్వహించిన వ్యాస రచన, ఆటల పోటీల విజేతలకు ఎమ్మెల్యే బహుమతులు ప్రదానం చేశారు. చివరిలో రెండు ఐసిడిఎస్ ప్రాజెక్టుల సిబ్బంది తరఫున ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభను ఘనంగా సన్మానించి, జ్ఞాపికను బహుకరించారు. పలువురు కూటమి నేతలు, పార్టీ శ్రేణులు, రెండు ఐసిడిఎస్. ప్రాజెక్ట్ ఉద్యోగులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# జిజిహెచ్‌లో బేరాలు ప్రారంభం



**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని ఈఎన్టీ విభాగంలో "బేరా రూమ్" ను బుధవారం ఘనంగా ప్రారంభించారు. అలాగే నూతనంగా పునరుద్ధరించబడిన సౌండ్ ప్రూఫ్ ఆడియోమెట్రీ గదిని ప్రారంభించడం జరిగింది. బేరా పరీక్ష అనేది విషయపరంగా ఆధారపడని శ్రవణ పరీక్ష విధానం. ఇది చెవిలోంచి మెదడు వరకు ఉన్న శ్రవణ మార్గం స్పందనలను నమోదు చేస్తుంది. ఈ పరీక్ష ప్యూర్ టోన్ ఆడియోమెట్రీ చేయలేని రోగులకు, ముఖ్యంగా నవజాత శిశువులు, పిల్లలు, మానసిక వెనుకబాటు ఉన్నవారు, మరియు సహకరించలేని రోగులు వంటి వారిలో వినికిడి స్థాయిని అంచనా వేయటానికి చాలా ఉపయోగకరం. అదనంగా, ఇది మాలింగరింగ్ (నకిలీ వినికిడి లోపం) గుర్తించటంలో, మెడికో-లీగల్ మరియు వికలాంగుల అంచనా సందర్భాలలో వినికిడి పరిమితులను ఖచ్చితంగా నిర్ధారించటంలో సహాయపడుతుంది.

**బేరా పరీక్ష యొక్క ఉపయోగాలు:**

నవజాత శిశువులు మరియు శిశువులలో వినికిడి లోపాన్ని త్వరగా గుర్తించడం. పిల్లలు, మానసిక వెనుకబాటు ఉన్నవారు లేదా సహకరించలేని రోగులలో వినికిడి అంచనా.మాలింగరింగ్ లేదా నకిలీ వినికిడి లోపం గుర్తించటం.రెట్రోకోక్లియర్ వ్యాధులు మరియు శ్రవణ మార్గ నాడీ సంబంధ వ్యాధుల నిర్ధారణలో సహాయం.వికలాంగుల ధృవీకరణ మరియు పునరావాస ప్రణాళికలో కీలక పాత్ర. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్య కుమారి,ఈఎన్టీ విభాగాధిపతి డాక్టర్ పి. విజయ దీప్తి,సీఎస్ఆరేంఓ డాక్టర్ మెహర్ కుమార్, ఇతర ఈఎన్టీ విభాగ వైద్యులు మరియు పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా డాక్టర్ లావణ్య కుమారి మాట్లాడుతూ "బేరా యూనిట్ ఏర్పాటు వల్ల రోగులకు అత్యాధునిక శ్రవణ నిర్ధారణ పరీక్షలు అందుబాటులోకి వస్తాయి. దీని ద్వారా వైద్యసేవలు మరింత సమర్థవంతంగా అందించగలుగుతున్నాము" అన్నారు.ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించిన ఈఎన్టీ విభాగ సిబ్బందికి ఆమె అభినందనలు తెలిపారు.

# నిరుపేదలకు సంక్షేమం అందించడమే ప్రభుత్వం లక్ష్యం

## రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు



**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** నిరుపేదలకు లబ్ధి చేకూర్చి,వారికి సంక్షేమాన్ని అందించే ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని,పేదలకు ఏ కష్టం వచ్చినా తానున్నానంటూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్ని విధాలుగా ఆదుకోవడం జరుగుతుందని రాజ్యసభా సభ్యులు సానా సతీష్ బాబు పేర్కొన్నారు. సామర్లకోట మండలం కొప్పవరం గ్రామంలోని రాజ్యసభ సభ్యులు కార్యాలయంలో వైద్య ఖర్చుల నిమిత్తం కాకినాడ నియోజకవర్గంకు సంబంధించిన పలువురు లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను రాజ్యసభా సభ్యులు సానా సతీష్ బాబు అందజేశారు. ఇద్దరు లబ్ధిదారులకు మంజూరైన సుమారు 3 లక్షల రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎంపీ అందజేశారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యులు సాన సతీష్ బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో అనేక ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలో కూటమి ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందని, ఎన్డీఏ ప్రభుత్వ సహకారంతో అన్ని రంగాల్లో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. అధికారంలోకి వచ్చిన నాటి నుండి పేద ప్రజలకు మేలు చేసే విధంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని, మన ముఖ్యమంత్రి చంద్రన్న అడిగిన వెంటనే అపన్న హస్తం అందేలా చర్యలు తీసుకుంటున్నారని, వైద్య ఖర్చులు భారమై ఆర్థిక స్తోమత లేని అనేకమంది పేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతగానో భరోసానిస్తుందని తెలిపారు. కూటమి ప్రభుత్వ నేతృత్వంలో రాష్ట్రంలోకి దేశ, విదేశీ పెట్టుబడులు వస్తున్నాయని, లక్షలాదిమందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు రాష్ట్ర అభివృద్ధి జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు తోట నవీన్, నులుకుర్తి వెంకటేశ్వరరావు, న్యూటన్ ఆనంద్, కాకరపల్లి చలపతిరావు, కార్యాలయ ఇంచార్జ్ మేకా లక్ష్మణమూర్తి, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మెడికల్ కాలేజీలకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ : మాజీ ఎంపీ భరత్



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మెడికల్ కాలేజీలను ప్రయివేటు పరం చేయడాన్ని వ్యతిరేకిస్తూ వైస్సార్ సిపి ఇచ్చిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్ ని వైఎస్ఆర్సిపి రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ బుధవారం ఆవిష్కరించారు. మార్గాని ఎస్టేట్స్ లోని వైసిపి కార్యాలయంలో పార్టీ శ్రేణులతో కల్సి ఆయన బ్రోచర్ ఆవిష్కరిస్తూ, మెడికల్ కాలేజీలు ప్రజల ఆస్తి అని , అందుకే ప్రజలే కాపాడుకోవాలని అన్నారు. జగన్మోహన్ రెడ్డి ప్రజల తరపున పోరాడుతున్నారని అయితే ప్రజలు కూడా సంఘీభావం తెలుపుతూ సంతకాలు చేయాలని భరత్ కోరారు. మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణ ఆపాలని నినదించారు.

# 19న ప్రత్తిపాడు 'జనసేన పార్టీ' ఆత్మీయ సమావేశం



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం జనసేన పార్టీ ఆత్మీయ సమావేశాన్ని శంఖవరం మండలం అన్నవరం గ్రామంలోని హరి హర రిసార్ట్సులో 19 వ తారీఖున సాయంత్రం 4 గంటలకు నిర్వహించ నున్నట్లు జనసేన పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, ప్రత్తిపాడు నియోజకవర్గం జనసేన పార్టీ సమన్వయకర్త మేడిశెట్టి సూర్యకిరణ్ (బాబి) బుధవారం వెల్లడించారు. నియోజకవర్గంలోని గ్రామాల్లోని పార్టీ కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలు, జనసేన పార్టీ కార్యకర్తల మనోగతాలు, అభిప్రాయాలను తెలుసు కోవడం, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి ఆసక్తి ఉన్న వారి వివరాలను నమోదు చేసి, పార్టీ అధిష్ఠానానికి నివేదించడం, కార్యకర్తలకు న్యాయం చేయడం ఈ ఆత్మీయ సమావేశ ప్రధాన అజెండాగా నియోజకవర్గం పార్టీ నిర్ణయించినట్లు బాబి పేర్కొన్నారు. నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు, వీర మహిళలు ముఖ్యంగా జన సైనికులు, ప్రతీ ఒక్కరూ ఖచ్చితంగా పాల్గొని ప్రత్తిపాడు నియోజకవర్గం జనసేన పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమావేశం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సామాజిక మాధ్యమాల వేదికగా జనసేన పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, ప్రత్తిపాడు నియోజకవర్గం జనసేన పార్టీ సమన్వయకర్త మేడిశెట్టి సూర్యకిరణ్ (బాబి) సాదరంగా ఆహ్వానించారు.

**మీడియాకు ప్రవేశం లేదు...**

ప్రత్తిపాడు నియోజకవర్గంలో నిర్వహించే జనసేన పార్టీ విస్తృతస్థాయి, ఆత్మీయ సమావేశాలకు మీడియాను ఎప్పుడూ అనుమతించరు. పార్టీ అంతర్గత సమావేశంగా భావిస్తూ మీడియాను ఆహ్వానించడం లేదు. కనీసం సమావేశం అనంతరం సమావేశ విశేషాలను, ఛాయా చిత్రాలను ప్రకటనగానైనా మీడియాకు విడుదల చేయరు. అంతే కాదు కనీసం పాత్రికేయుల సమావేశంలో నిర్వహించైనా వివరాలను వెల్లడించరు. ఐతే వారి సామాజిక మాధ్యమాల్లో మాత్రం ఎవరికి తోచిన రీతిలో వారు... వారి దృష్టి కోణంలో తోచిన విధంగా ప్రచారం చేసుకుంటూ ఉన్నారు. నియోజకవర్గం పార్టీ ఐనా ప్రత్యేకించి సమావేశంలోని ప్రజలకు విధిగా చెప్పాల్సిన ప్రధాన విషయాలనైనా పార్టీ ఏకాభిప్రాయ ప్రకటనగానైనా సామాజిక మాధ్యమాల్లో ప్రకటించదు. పరిస్థితి ఇది కదా అని మీడియా పాత్రికేయులకు ఎవరైనా కాస్త సాహసించి సమావేశంలోనికి వెళితే ఎలాగూ వచ్చేసారు కదాని ఆహ్వానించరు. అలా అని వెళ్ళమని అననూ అనరు. కానీ అంతా గప్ చిప్ అయిపోతారు. ఛాయా చిత్రాలను మాత్రమే తీసుకుని పాత్రికేయులు చిత్తగించాల్సిందే. దీంతో సమావేశానికి వెళ్ళడానికి అర్హతలేని జనసేన సాధారణ ప్రజలకు మాత్రం సమావేశ విశేషాలు అస్పష్టంగా మాత్రమే తెలుస్తాయి. మూడు పార్టీల పొత్తులో జనసేనది అంతా అంతర్గత క్రమశిక్షణతో కూడిన బాధ్యతాయుతమైన గుప్తమైన శైలి.

# విజయదుర్గ ఆలయానికి ఎమ్మెల్యే శంకుస్థాపన



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరంలోని కృష్ణాలయం వీధిలోని పూర్వపు విజయ దుర్గ ఆలయంకి బదులుగా కొత్త ఆలయ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ బుధవారం ఉదయం శంకుస్థాపన చేశారు. ఉదయం 11. 7 గంటల సుముహూర్తానికి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేసారు. టెంకాయను కొట్టి పూజల్లో పాల్గొన్నారు. దీనికి ముందు పూర్వపు ఆలయ వ్యవస్థాపకుడు కారుకొండ శ్రీను, గంగా భవాని దంపతుల సారథ్యంలో పూజ్యం నాగేశ్వరరావుశర్మ ఆధ్వర్యంలో విఘ్నేశ్వర పూజ, హెరీమం, పూర్ణాహుతి పూజా కార్య క్రమాలను నిర్వహించారు. శంకుస్థాపనకు విచ్చేసిన ఎమ్మెల్యే సత్యప్రభకు మహిళలు పూల వర్షం కురిపించి ఘన స్వాగతం పలికారు. ఆలయానికి 6 సెంట్లు ప్రభుత్వ స్థలాన్ని కేటాయించడానికి రెవిన్యూ శాఖకు సిఫారసు చేసిన ఎమ్మెల్యేకు, ఎమ్మెల్యే దృష్టికి స్థలం కేటాయించాలన్న ప్రతిపాదన తీసుకుని వెళ్లిన పూర్వపు ఉభయ గోదావరి జిల్లాల తెలుగు దేశం పార్టీ పూర్వపు ప్రచార కార్యదర్శి పర్వత సురేష్ ను దుర్గమ్మ భక్తులు, కారుకొండ శ్రీను, గంగా భవాని దంపతులు ఘనంగా సన్మానించారు. అనంతరం విజయ దశమిని పురస్కరించుకుని మధ్యాహ్నం కారుకొండ శ్రీను ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. అన్నదానంలో పాల్గొన్న భక్తులకు ఆహార పదార్థాలను ఎమ్మెల్యే సత్యప్రభ స్వయంగా వడ్డించారు. ఆలయ వ్యవస్థాపకకుడు కారుకొండ శ్రీను, గంగా భవాని దంపతుల స్వగృహంలోని పై అంతస్తులో 20 ఏళ్ళ క్రితం విజయ దుర్గ అమ్మ వారిని నెలకొల్పారు. నాటి నుంచి అమ్మవారు నిత్య పూజలను అందుకుంటూ ఉన్నారు. నివాస గృహం, అందునా ఇరుకుగా ఉండటంతో విశాలమైన వేరే స్థలంలో నూతన ఆలయ నిర్మాణానికి సంకల్పించారు. ఈ కార్యక్రమంలో శంఖవరం ఉప సర్పంచ్ చింతంనీడి కుమార్, బద్ది రామారావు, వెన్న శివ, ఈగల దేవుళ్ళు, అన్నవరం మాజీ సర్పంచ్ రాజాల చిట్టిబాబు, ఇసరపు వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రగతిపథంలో దూసుకుపోతున్న ఆంధ్రప్రదేశ్

## ప్రపంచంలోనే ప్రముఖ ఎఐ కేంద్రంగా విశాఖ : ప్రత్తిపాడకు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్.డి.ఎ. ప్రభుత్వం అధికారం చేపట్టాక రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతూ కొత్త ఉత్సాహాన్ని సంతరించుకుందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పేర్కొన్నారు. రాష్ట్రాన్ని సాంకేతిక, పారిశ్రామిక, ఆర్థిక, సామాజిక రంగాల్లో ముందుకు తీసుకెళ్లే దిశగా యువతకు ఉపాధి అవకాశాలను కల్పించడం, పెట్టుబడులను ఆకర్షించడం, పరిశ్రమలను స్థాపించడం వంటి లక్ష్యాలతో దూర దృష్టితో నిరంతరం ముఖ్యమంత్రి నారా చందబాబు, ఐటీ శాఖామంత్రి నారా లోకేష్ కృషి చేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ ఉన్నారు. ఈ ఇరువురి కృషి ఫలితంగా అనేక అంతర్జాతీయ స్థాయి సంస్థలు రాష్ట్రానికి గా రాబోతూ ఉన్నాయని ఎమ్మెల్యే సత్యప్రభ వెల్లడించారు. ఈ మేరకు ఆమె బుధవారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఆ విశేషాలు ఇవీ... విశాఖపట్నం కేంద్రంగా రూ. 1.31 లక్షల కోట్ల పెట్టుబడితో భారీ డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్టు ప్రపంచ ప్రఖ్యాత గూగుల్ సంస్థ ప్రకటించింది. అలాగే రూ. లక్ష కోట్లకు పైగా పెట్టుబడితో 1,000 మెగావాట్ల డేటా సెంటర్ ఏర్పాటుకు టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) ఆసక్తి వ్యక్తం చేసింది. ఈ మొత్తాన్ని దశలవారీగా పెట్టుబడి పెట్టేందుకు నిర్ణయించింది. ఆ సంస్థ విశాఖలో టీసీఎస్ డెవలప్మెంట్ సెంటర్ను వచ్చే నెలలో ప్రారంభించబోతోంది. రాబోయే రెండేళ్లలో ఈ రెండు ప్రపంచ దిగ్గజ సంస్థలు సుమారు రూ. 2.60 లక్షల కోట్ల పెట్టుబడులు విశాఖలో పెట్ట నుండటం గమనార్హం. డేటా సెంటర్ల ఏర్పాటు ద్వారా వచ్చే ప్రత్యక్ష ఉపాధి కంటే.. వాటి కేంద్రంగా ఏర్పాటు చేసే సంస్థల నుంచి అంతకు పదిరెట్లకు పైగా పరోక్ష ఉపాధి లభిస్తుందని నిపుణులు పేర్కొంటున్నారు. ఇవి కేవలం ఆంధ్రప్రదేశ్ కే గాక, యావత్ భారత దేశానికి కూడా గర్వకారణమైన విషయాలు. ఈ ప్రాజెక్ట్‌తో విశాఖపట్నం దక్షిణ ఆసియాలోనే అతిపెద్ద ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ హబ్‌గా రూపుదిద్దుకోనుంది. అమెరికా తర్వాత విశాఖ ప్రపంచంలోనే ప్రముఖ ఎఐ కేంద్రంగా ఎదగబోతోంది. ఈ డేటా సెంటర్ల ద్వారా లక్షలాది మంది యువతకు ప్రత్యక్ష్యంగా, పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలగ నున్నాయి. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ మరింత బల పడటానికి ఇది ఒక కీలక మైలురాయిగా నిలుస్తుందని ఎమ్మెల్యే వరుపుల చెప్పారు. హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి ఐటీ హబ్‌గా తీర్చిదిద్దిన నాయకుడు నారా చంద్రబాబు నాయుడుఆయన దూరదృష్టి, నాయకత్వం వల్లే తెలంగాణలో హైదరాబాద్ నేడు ఒక ప్రధాన ఆర్థిక, సాంకేతిక రంగాల కేంద్రంగా అభివృద్ధి చెందింది. అదే విధంగా ఆయన నాయకత్వంలో ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ కూడా ఒక నూతన సాంకేతిక విప్లవానికి ఆవాసంగా మారబోతోందని వరుపుల పేర్కొన్నారు. విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ప్రారంభం అనేది కేవలం ఒక ప్రాజెక్టు మాత్రమే కాదు.. అది రాష్ట్ర భవిష్యత్తును మార్చే చారిత్రాత్మక అడుగు. దీనివల్ల ప్రపంచ వ్యాప్తంగా ప్రముఖ కంపెనీలు కూడా ఆంధ్రప్రదేశ్ వైపు ఆకర్షితం అవుతాయనే విషయాన్ని ప్రజలు గమనించాలి. పెట్టుబడులు, సాంకేతికత, నైపుణ్యం రాష్ట్రంలో విస్తరించడంతో ఆంధ్రప్రదేశ్ కొత్త యుగాన్ని ఆరంభించ బోతోంది. రాష్ట్ర అభివృద్ధికి, యువత భవిష్యత్తుకు తమ నాయకత్వాన్ని అంకితం చేస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ఐటీశాఖా మంత్రి నారా లోకేష్ కు మా ప్రత్తిపాడు నియోజకవర్గ ప్రజల తరఫున హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నానని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పేర్కొన్నారు.



# అభివృద్ధి వికేంద్రీకరణ అనేది జగన్ ఆలోచన

- మీరు చేస్తే పుణ్యం .. ఎదుటివాళ్ళు చేస్తే పాపమా..
- చంద్రబాబు వ్యవహార శైలి అలానే ఉంది
- గొప్పలు చెప్పుకుని డప్పు కొట్టుకోవడం శోచనీయం
- ఐ.టి.కి శ్రీకారం చుట్టింది జనార్ధనరెడ్డి కదా..
- శంషాబాద్ ఎయిర్ పోర్టు శంకుస్థాపన చేసిందెవరు
- జగన్ హయాంలో అభివృద్ధిని ప్రచారం చేసుకోలేకపోయాం..
- అన్నీ ప్రైవేటు పరం చేయడమో,అమ్మేయడమో చేయడం అభివృద్ధా..
- వ్యవహారంపై సిబిఐతో విచారణ జరిపిస్తే వాస్తవాలు బయటకొస్తాయ్
- ప్రెస్ మీట్‌లో మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** గతంలో వైసిపి ఏది చేసినా విమర్శించడమే పనిగా పెట్టుకుని పనిచేసిన చంద్రబాబు,లోకేష్ ఇప్పుడు చేస్తున్నదేమిటని వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ ప్రశ్నించారు. మీరు చేస్తే పుణ్యం మేము చేస్తే పాపమా అని ఆయన నిలదీసారు. విజినరీకి ప్రిజనరీకి తేడా ఉందని లోకేష్ అనడాన్ని ఆయన ప్రస్తావిస్తూ,ప్రిజనరీ అనగానే రాజమండ్రి జైలు చంద్రబాబు గుర్తొస్తారని వ్యాఖ్యానించారు. స్థానిక మార్గాని ఎస్టేట్స్ లోని వైసిపి కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో భరత్ మాట్లాడారు. సైబర్ టవర్స్ ప్రారంభించి,ఐటికి శ్రీకారం చుట్టింది.నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి అని ఆయన అన్నారు.అంటే ఎన్టీఆర్ నుండి పార్టీ లాగక ముందు నాలుగేళ్ల క్రితం అంటే 1991లోనే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఐటీ వచ్చిందని ఆయన అన్నారు. ఢిల్లీ, చెన్నై, బెంగుళూరు, బొంబాయి వంటి మెట్రో పాలిటన్ సిటీస్ మాదిరిగా హైదరాబాద్ అభివృద్ధి చెందుతూ వచ్చిందని, ఇందులో చంద్రబాబు చేసిందేమిటని భరత్ ప్రశ్నించారు. కేవలం చంద్రబాబు హైటెక్ సిటీ అనే బిల్డింగ్ కట్టి, ఆయనకు సంబంధించిన వ్యక్తులకు భూములు కొనుగోలు చేసేలా చేశారని,దాంతో మురళీమోహన్, సుజనా చౌదరి ,ఇంకా వారి బినామీలు బాగుపడ్డారని భరత్ వ్యాఖ్యానించారు. ఇప్పుడు మాల్ పేరుతో విశాఖ, విజయవాడలో కోట్ల విలువైన భూమిని షాపింగ్ మాల్ కి ఇచ్చారని, రాష్ట్రాన్ని అమ్మేసే కార్యక్రమం చేస్తున్నారని మెడికల్ కాలేజీలను ను ప్రైవేటు పరం చేస్తున్నారని, మెడికల్ కాలేజెస్ లో కూడా వారి బినామీలే ఉంటారని భరత్ అన్నారు.ఏపీలో 76 శాతం ఉద్యోగాలు ఇచ్చే సత్తా మీ దగ్గర ఉందా.? అని ప్రశ్నించారు. శంషాబాద్ ఎయిర్పోర్ట్ కు కాంగ్రెస్ అధికారంలో ఉండగా 16 మార్చి 2005న సోనియా గాంధీ శంకుస్థాపన చేస్తే, ఎయిర్పోర్ట్ చంద్రబాబు విజన్ అని లోకేష్ ఎలా చెప్తారని భరత్ ప్రశ్నించారు.డాక్టర్ రాజశేఖర్ రెడ్డి హయంలో శంషాబాద్ ఎయిర్పోర్ట్ తయారు అయ్యిందని, అయినా మీరు సొంత డబ్బా ఎందుకు కొట్టుకుంటున్నారని భరత్ ప్రశ్నించారు. వినేవాడు ఉంటే చెప్పేవాడు చంద్రబాబు అన్న చందాన లోకేష్ వ్యవహారం ఉందన్నారు. అలాగే ఔటర్ రింగ్ రోడ్డుకి టిడిపికి సంబంధం లేదని, దివంగత రాజశేఖర హయాంలో ఔటర్ రింగ్ రోడ్డుకి శంకుస్థాపన అయిందని ఆయన అన్నారు. చంద్రబాబు కాలంలో ఏపీలోనూ ఎటువంటి అభివృద్ధి లేదని, 9 హార్బర్స్ కు. శ్రీకారం చుట్టింది. జగన్మోహన్ రెడ్డి అని భరత్ చెప్పారు. ఆక్వా రంగం..పోర్ట్ లు,ఫిషింగ్ హార్బర్‌ల ఆలోచన జగన్మోహన్ రెడ్డిదని అన్నారు. అభివృద్ధి వికేంద్రీకరణ అనేది జగన్మోహన్ రెడ్డి పాలసీఅని భరత్ స్పష్టంచేసారు. అభివృద్ధి వికేంద్రీకరణ, విశాఖలో పెట్టుబడు లుఉపయోగ గోదావరి జిల్లాలో ఆక్వా అభివృద్ధి, పోర్టుల అభివృద్ధి అన్నీ జగన్ ఆలోచనలేనని ఆయన స్పష్టంచేసారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో ఎంతో చేసినా ప్రచారం చేసుకోవడంలో వైఫల్యం చెందామన్నది వాస్తవమని ఆయన అన్నారు. జిందాల్ సంస్థను తరిమివేస్తే మహారాష్ట్రకి వెళ్లి 3 లక్షల కోట్లు పెట్టుబడులు పెడుతోందని ఆయన అన్నారు. గూగుల్ డేటా సెంటర్ ఏపీకి రావడాన్ని స్వాగతిస్తున్నామని భరత్ అన్నారు. అయితే ప్రధాని మోడీ చేసిన ట్వీట్ లో చంద్రబాబు పేరుగానీ మరొకరి పేరు గానీ లేదు కదా అని ఆయన అన్నారు. ఇక అప్పటి ఐటీ మంత్రి అమర్నాథను డేటా సెంటర్ అంటే తెలుసా అని లోకేష్ ప్రశ్నించడం హాస్యస్పదంగా ఉందని భరత్ అన్నారు. అసలు డేటా సెంటర్ అంటే ఏమిటి లోకేష్ కి తెలిస్తే, డేటా సెంటర్‌పై మాజీ ఐటి మంత్రి అమర్నాథ్ తో చర్చకు సిద్ధమా అని ఆయన సవాల్ విసిరారు. పిపిపి విధానంలో పబ్లిక్ ప్రాపర్టీ ఏదని భరత్ ప్రశ్నించారు. నాలుగు వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తే మెడికల్ కళాశాలలు ప్రైవేటుపరం కాకుండా ఉంటాయని, నాబార్డ్ ద్వారా ఇంకా పలు స్కీమ్స్ ద్వారా జగన్ ఇందుకు డబ్బులు కూడా రెడీ చేసారని, ఈ ప్రభుత్వం మహా అయితే రెండు వేలకోట్లు పెడితే సరిపోతుందని ఆయన అన్నారు. ఇది కూడా చేయకపోవడం శోచనీయమన్నారు. రిషికొండ నిర్మాణాన్ని విమర్శించి, ఇప్పుడు దాన్ని అమ్మేయడానికి నోటిఫికేషన్ ఇస్తున్నారని భరత్ వాపోయారు. మీరు చేస్తే పుణ్యం , మేము చేస్తే పాపం అనేలా వ్యవహారం ఉందని లేకుంటే అమ్మేయడానికి నోటిఫికేషన్ ఎలా ఇస్తున్నారని ఆయన ప్రశ్నించారు. నకిలీ మద్యం కేసులో ప్రధాన నిందితులు జయచంద్రారెడ్డి.. ఆయన వైఎస్ఆర్సిపి కోవర్ట్ అంటున్నారని అలాగైతే, ఎమ్మెల్యే టికెట్ ఇచ్చారో చంద్రబాబు సమాధానం చెప్పాలని భరత్ డిమాండ్ చేసారు. మీపై ఆరోపణలు వస్తే పక్కవారిపై బురద జల్లడం మీకు అలవాటు అన్నారు. చిన్నపాటి సోషల్ మీడియా కేసులకి దేశం దాటితే లుక్ అవుట్ నోటీసులు ఇచ్చి పాస్పోర్ట్ రద్దు చేస్తున్నపుడు, మరి జయచంద్రా రెడ్డి విషయంలో ఎందుకు చేయలేదని ఆయన నిలదీశారు. ఆయన ఫోన్ సంభాషణలు ఎవరితో చేశారో స్పష్టం చేయాలని డిమాండ్ చేసారు. ములకలచెరువు, ఇబ్రహీంపట్నం కా మాత్రమే కాదు పాలకొల్లు అమలాపురం, ఎక్కడ చూసినా నకిలీ మద్యం కేంద్రాలు బయట పడ్డాయని, 16 నెలలుగా కాలంగా రాష్ట్ర ప్రజలతో నకిలీ మద్యం తాగిస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తంచేసారు. ఇందుకు సంబంధించి క్లిప్పింగ్స్ చూపిస్తూ, ప్రతి నాలుగు బాటిల్స్ లో ఒకటి నకిలీ మద్యమేనని ఆయన అంచనావేశారు. ఈ మొత్తం వ్యవహారంపై సిబిఐతో విచారణ చేయించాలని, అప్పుడే అన్ని అంశాలు వెలుగులోకి వస్తాయని ఆయన అన్నారు. సిట్ వేయడం వల్ల ఇటువంటి ఉపయోగం ఉండదని, ఎందుకంటే టిడిపి నేతలపై సిట్ కేసు నమోదు చేస్తుందా అని భరత్ ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం కూడా కూడా మీరే భాగస్వాములు కదా... సిబిఐకి అప్ప గిస్తే, నిజాలు తెలుస్తాయి కదా అని ఆయన అన్నారు.

### విద్యా బాలమందిర్‌లో

## అబ్దుల్ కలామ్ జయంతి వేడుకలు



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం కొత్తపేట విద్యాబాల మందిర్ హై స్కూల్లో భారత మాజీ 11వ రాష్ట్రపతి అబ్దుల్ కలాం 94వ జన్మదినోత్సవం సందర్భంగా ఆయన చిత్రపటానికి పాఠశాల కరస్పాండెంట్ రామోజీ అనురాధ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ ఏపీజే అబ్దుల్ కలాం అని ప్రముఖంగా పిలవబడే డాక్టర్ అవుల్ ఫకీర్ జైనులబ్దీన్ అబ్దుల్ కలాం అక్టోబర్ 15, 1931న తమిళనాడులోని రామేశ్వరంలో జన్మించారు. ఆయన భారత దేశపు ప్రముఖ క్షిపణి శాస్త్రవేత్త మరియు 11వ భారత రాష్ట్రపతిగా సేవలందించి జూలై 27, 2017 న మరణించారని తెలిపారు. మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా గా పిలవబడే అబ్దుల్ కలాం విద్యార్థులకు స్ఫూర్తిదాయకునిగా నిలిచారని ఆయన విద్యారంగంలో ప్రశంసనీయమైన కృషి చేశారనికావున ఆ మహనీయుని గౌరవార్థం ప్రతి సంవత్సరం అక్టోబర్ 15వ తేదీ ప్రపంచ విద్యార్థుల దినోత్సవం గా జరుపుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నూక పెయి శివరత్నం, సుధాకర్, హుస్సేన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని ఆయనకు ఘన నివాళులర్పించారు.

## ఎంపిడిఓ ఆధ్వర్యంలో ముగ్గళ్ళలో ఉపాధి హామీ గ్రామసభ




**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పు గోదావరి జిల్లా సీతా నగరం నగరం మండలం ముగ్గళ్ళ గ్రామ పంచాయతీలో ఎంపీడీవో యం.భారతి ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 2026 27 సంవత్సరానికి గాను ఉపాధి శ్రామికులకు వంద రోజులు పని కల్పించుటకు గ్రామ సభ నిర్వహించడమైనది. ఈ గ్రామసభ లో ఉపాధి హామీ పథకం ద్వారా అనుమతింపబడిన పనుల యొక్క వివరాలు పూర్తిస్థాయిలో వివరించి పనులను గుర్తించడం జరిగింది. 26 కాల్వ పనులు, రెండు చెరువులు,రెండు ఫారం పాండ్లు, మూడు సోక్ పిట్లు, ఐదు కంపోస్ట్ పి, రెండు పుంత రోడ్ల నిర్మాణం మొదలగు పనులు గుర్తించడం జరిగింది. ఈ గ్రామసభలో మండల అధ్యక్షులు గుర్రాల జ్యోత్స్న, గ్రామ సర్పంచ్, సెక్రటరీ, కూటమి నాయకులు, ఉపాధి హామీ సిబ్బంది,ఇంజనీరింగ్ కన్సల్టెంట్ నాగేశ్వరరావు, టెక్నికల్ అసిస్టెంట్ రాజు, ఫీల్డ్ అసిస్టెంట్ ధర్మ, మరియు ఉపాధి శ్రామికులు పాల్గొన్నారు.

### మెడికల్ కాలేజీలు

## ప్రైవేటీకరణ వద్దు..

**ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయడం ఆపాలి**
**కుటిల రాజకీయాలు మానుకోవాలి, మెడికల్ కాలేజీలను పరిరక్షించాలి**
**వైద్యం, విద్యను పేద విద్యార్థులకు దూరంచేయవద్దు..**
**వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ నగర అధ్యక్షులు ఆరిఫుల్లా ఖాన్**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయడం ఆపాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ నగర అధ్యక్షులు ఆరిఫుల్లా ఖాన్ అన్నారు. బుధవారం జాంపేటలోని లబాబిన్ లైన్ మసీదు వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కరోనా సమయంలో సరైన సమయంలో వైద్యం అందక ఎంతోమంది ప్రాణాలు కోల్పోతే అప్పటి ముఖ్యమంత్రి జన నాయకుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి ఎంతో మంచి ఆలోచన చేసి రాష్ట్రానికి 17 మెడికల్ కాలేజీలు తీసుకువచ్చారని అన్నారు. ఈ మెడికల్ కాలేజీలను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టేందుకు కూటమి ప్రభుత్వ కుట్ర చేస్తుందని అన్నారు. కూటమి ప్రభుత్వ నిర్ణయం వల్లన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆశయాలకు తూట్లు పొడుస్తున్నారని విమర్శించారు. స్వతంత్రం వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో ఒక్క మెడికల్ కాలేజీ కూడా లేదని వివరించారు. మెడికల్ విద్య పేద, మధ్య తరగతి విద్యార్థులకు విద్య,వైద్యం అందుబాటులో ఉండాలని సదాశయంతో నాటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కేంద్రం నుంచి రాష్ట్రానికి 17 మెడికల్ కాలేజీలు మంజూరు చేయించారని వివరించారు. సుమారు 5 మెడికల్ కాలేజీలు ఇప్పటికే పూర్తయి 150 సీట్లు తో విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలు పూర్తి కాలేదంటూ దుష్ప్రచారం చేస్తుందని అన్నారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ముఖ్యమంత్రి చంద్రబాబు తన బినామీలకు పీపీపీ విధానం ద్వారా దరాతత్త చేసేందుకే కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు.ప్రభుత్వ మెడికల్ కాలేజీ లను కాపాడాలని ఉద్దేశంతో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కోటి సంతకాల సేకరణ కార్యక్రమం ప్రారంభించారని అన్నారు. ఈ ఉద్యమానికి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, మేధావులు సహకరించి కూటమి ప్రభుత్వం చేస్తున్న కుటిల రాజకీయాలు అడ్డుకొని మెడికల్ కాలేజీలను పరిరక్షించాలని ఆయన పిలుపునిచ్చారు.

## రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన చాలా అవసరం




**అనపర్తి, విశ్వం వాయిస్ న్యూస్ :** అక్టోబర్ మాసం ప్రపంచ రొమ్ము క్యాన్సర్ అవగాహన మాసోత్సవంలో బాగంగా బుధవారం కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (దిపియంపి అసోసియేషన్)అనపర్తి, బిక్కవోలు మండలాల ఆధ్వర్యంలో మండల అధ్యక్షులు వాసంశెట్టి నాగేశ్వరరావు అధ్యక్షతన వైద్య విజ్ఞాన అవగాహన సదస్సులో రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు రాజమండ్రి డెల్టా హాస్పిటల్‌కు చెందిన శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ రిమ్మలపూడి నితిన్,క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ సుమంత్ మండవ పాల్గొని పీఎంపీలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా డాక్టర్ నితిన్ మాట్లాడుతూ క్యాన్సర్ శస్త్రచికిత్స విధానాలలో అధునాతన చికిత్స అయిన రోబోటిక్ విధానంతో అతి తక్కువ రక్తస్రావంతో, అతి తక్కువ నొప్పితో చికిత్స అందించవచ్చని తెలిపారు,ప్రపంచవ్యాప్తంగా క్యాన్సర్ బాధితుల సంఖ్య పెరిగిపోతోందని క్యాన్సర్‌ను సకాలంలో గుర్తించడం, సరైన చికిత్స అందించడం చాలా ముఖ్యమని అన్నారు. క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ సుమంత్ మండవ మాట్లాడుతూ ప్రాణాంతకమైన ఈ క్యాన్సర్లపై అవగాహన చాలా అవసరమని, క్యాన్సర్‌కు కారణమయ్యే అనేక కారణాలలో పర్యావరణం, జీవనశైలి లో మార్పులు,ప్లాస్టిక్ వినియోగం సంబంధిత కారణాలతోనే 80 నుంచి 90 శాతం ఈ వ్యాధి బారిన పడుతున్నారని, ముందు ముందు ప్రతి ఇంట్లో ఒక క్యాన్సర్ కేస్ ఉండే పరిస్థితి రావచ్చని అన్నారు.రొమ్ము క్యాన్సర్ నివారణకు మహిళలు స్వీయ పరీక్ష ద్వారా వ్యాధిని కనుగొనవచ్చని అన్నారు.పల్లెల్లో ప్రథమచికిత్సలు అందించే పీఎంపీలు క్యాన్సర్‌పై ప్రజలను జాగృతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బళ్ళా శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి పి.దేవానందం, జిల్లా కోశాధికారి పి.చిన్ని, మండల కార్యదర్శి డి.సాయి రామారెడ్డి, కోశాధికారి నీలంశెట్టి శ్రీనివాస్, రాయవరం మండల అధ్యక్షులు ఎన్వీ రమణ, ఆసుపత్రి మేనేజర్ క్రాంతి కుమార్, ఎన్ఎస్ చలం, పీబీ సుబ్రహ్మణ్యం, పీటీఎల్ నారాయణ, కేఎస్ఎన్ మూర్తి, ఎన్ నరేంద్ర రెడ్డి లతో పాటు సభ్యులు పాల్గొన్నారు. అనంతరం వైద్యులను సభ్యులు ఘనంగా సత్కరించారు.

## అబ్దుల్ కలాంను యువత ఆదర్శంగా తీసుకోవాలి

**భారతరత్న అబ్దుల్ కలాంకు ఘన నివాళులు..**
**వైసిపి ముస్లిం సెల్ ఆధ్వర్యంలో ఘనంగా కలాం జయంతి వేడుకలు..**







**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మిస్సైల్ మెన్ ఆఫ్ ఇండియా ,భారతరత్న మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాంను యువత ఆదర్శంగా తీసుకోవాలని రాజమండ్రి మాజీ ఎంపీ మార్గానీ భరత్ రామ్ పేర్కొన్నారు. బుధవారం రాజమండ్రి మార్గాని ఎస్టేట్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ముస్లిం సెల్ అధ్యక్షుడు ఆరీఫుల్లా ఖాన్ ఆధ్వర్యంలో భారత మాజీ రాష్ట్రపతి ఎ.పి.జే అబ్దుల్ కలాం జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎంపీ మార్గానీ భరత్ రామ్ హాజరై అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశానికి డాక్టర్ అబ్దుల్ కలాం ఎనలేని సేవలు చేశారని అన్నారు. ప్రపంచ దేశాలలో మిస్సైల్ రంగంలో భారతదేశం ముందు ఉండడానికి గల కారణం ఏపీజే అబ్దుల్ కలాం అని కొనియాడారు. యువత ఆయనను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నివాళులు అర్పించిన వారిలో వైఎస్ఆర్సిపి నేత మార్గాని నాగేశ్వర రావు, మైనార్టీ సెల్ నాయకులు అమీర్ పాషా, నిజాం, షబ్బీర్, మదీనా భాషా, అక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

## స్టేట్ డైరెక్టర్స్‌కు ఏపీ ఎమ్మార్పీఎస్ ఘన సత్కారం..

**ఇరువురు సేవలు భావితరాలకు స్ఫూర్తిదాయకం : ఉందుర్తి సుబ్బారావు**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం నగరానికి చెందిన టిడిపి నేత, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ వేమగిరి వెంకటరావు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాటక అకాడమీ స్టేట్ డైరెక్టర్, జనసేన పార్టీ సీనియర్ నాయకులు మద్దాల యేసు పాదంను రాష్ట్ర ప్రభుత్వం వారిచే నామినేట్ చేయబడిన శుభ సందర్భంగా ఏపీ ఎమ్మార్పీఎస్ తూర్పు గోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం స్థానిక ప్రకాష్ నగర్ 4వ వీధిలో గల ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రాంతీయ కార్యాలయంలో ఏపీ ఎమ్మార్పీఎస్ మరియు మాదిగ ఉద్యోగుల సమావేశం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉందుర్తి సుబ్బారావు అధ్యక్షతన ఘన సత్కారం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సువర్ణరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు సువర్ణ రాజు మాట్లాడుతూ జాతి ఆణి ముత్యాలు అయినటువంటి వెంకటరావు,ఏసుపాదంలను కూటమి పార్టీ విజయాన్ని కృషి చేసినందుకు గాను వీరిరువురు సేవలను గుర్తించి రాష్ట్ర సిఎం నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మాదిగ సోదరులను ఈ పదవులకు ఎంపిక చేయడం పట్ల ఏపీ ఎమ్మార్పీఎస్ జిల్లా రాష్ట్ర కమిటీ తరఫున ధన్యవాదాలు తెలియ జేశారు. మాదిగ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉందుర్తి సుబ్బారావు మాట్లాడుతూ స్టేట్ డైరెక్టర్స్ గా ఎన్నికైన ఇరువురు సేవలు భావితరాలకు స్ఫూర్తిదాయమని వారు జన్మించిన జాతి కొరకు, వారు పనిచేస్తున్న పార్టీ ఎంతో నిబద్ధతతో పనిచేయడం వల్లే ప్రతిష్టాత్మకమైన రాష్ట్ర డైరెక్టర్లుగా ఎంపిక కావడం జరిగిందని మాదిగ ఉద్యోగుల సంఘం తరపున శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం సభలో ఉన్న వారంతా సాలువాలు, పుష్పమాలు బొకేలతో, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా అధ్యక్షుడు తలారి నాని మాదిగ, తూర్పు గోదావరి జిల్లా ఇంచార్జ్ బొచ్చు చినబాబు మాదిగ కోనసీమ జిల్లా ఇన్చార్జ్ కన్నిపాముల శ్రీనివాస్ మాదిగ, కోనసీమ జిల్లా యువజన విభాగం ఇంచార్జ్ దోమ్మలపాటి సత్య వర్ధన్, రామచంద్రపురం డివిజన్ మహిళా విభాగం అధ్యక్షురాలు విజయలక్ష్మి, కోరుమిల్లి కిషోర్, రాజమండ్రి నగరపాలక సంస్థ పూర్వపు డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కోరుమిల్లి విజయ శేఖర్,ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి చంద్రమల్ల మహేష్, ఏపీ ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఉందుర్తి బుల్లి వీరయ్య, పెనుమాకు ఏసు మాదిగ, అంగర గంగరాజు, కొమ్ము వెంకటరావు మాదిగ, విజయ్ కుమార్, దుల్ల వీర్రాజు, దోమలపాడు రాజశేఖర్, పౌరోజు పండు, దుల్ల వీర్రాజు, రాష్ట్ర నాయకులు స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

# ఆ రైళ్లు త్వరలో కొవ్వూరులో హాల్ట్

## - ఎంపీ పురందేశ్వరి కృషికి రైల్వే బోర్డు ఆమోదం



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మచిలీపట్టణం - విశాఖ పట్నం ఎక్స్ ప్రెస్ (నెం 17219/17220), విశాఖ పట్నం - కడప ఎక్స్ ప్రెస్ (18521/18522) రైళ్లు కొవ్వూరు స్టేషన్‌లో ఆగడానికి రైల్వే బోర్డు ఆమోదం తెల్పింది. ఈమేరకు ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి రాసిన లేఖకు రైల్వే అధికారుల నుంచి వర్తమానం అందింది. త్వరలోనే ఇది అమల్లోకి వస్తుందని వివరించారు. కొవ్వూరు అలాగే పరిసర ప్రాంత ప్రజల విజ్ఞప్తిని పురస్కరించుకుని ఈ రెండు రైళ్లు కొవ్వూరులో ఆపాలని ఎంపీపురందేశ్వరి చేసిన కృషి ఫలించింది.

## ట్రయల్ ఖైదీల కేసుల దర్యాప్తు, చార్జీషీట్ల అంశాలపై

# డిఎల్ఎస్ఏ సమావేశం



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరం జిల్లా కోర్టు ప్రాంగణంలోని జిల్లా జడ్జి ఛాంబరులో బుధవారం తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి మరియు జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్‌పర్సన్ గంధం సునీత ఆధ్వర్యంలో అండర్ ట్రయల్ రివ్యూ కమిటీ సమావేశం మరియు ఎగ్జిక్యూటివ్ బాడీ సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశంలో అండర్ ట్రయల్ ఖైదీలకు సంబంధించిన కేసుల దర్యాప్తు, చార్జీషీట్ల దాఖలు అంశాలపై పోలీసు అధికారులతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత సమీక్షా చర్చలు నిర్వహించారు. ఖైదీలకు బెయిల్, ష్యూరిటీలు సంబంధించి ఎదురవుతున్న సమస్యలపై చర్యలు తీసుకోవాలని సూచనలు ఇచ్చారు. సంబంధిత అధికారులకు తగిన సిఫార్సులు చేయడం జరిగింది. తదుపరి ఎగ్జిక్యూటివ్ బాడీ సమావేశంలో జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చేపడుతున్న కార్యక్రమాలు, బాధితుల పరిహార(విక్టిమ్ కంపెన్సేషన్)కేసులపై కూడా చర్చించడం జరిగింది. ఈ సమావేశంలో ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి ఎస్.కె. జానీ బాషా, ఇన్‌ఛార్జ్ జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి మరియు సీనియర్ సివిల్ జడ్జి బి.పద్మ, తూర్పు గోదావరి జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్)ఎం.బి.ఎన్. మురళీ కృష్ణ, కాకినాడ సీఐ ఆర్. రవికుమార్, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కొనసీమ జిల్లా అదనపు ఎస్పీ ఎ.వి.ఆర్.పీ.బి. ప్రసాద్, గవర్నమెంట్ ప్లీడర్, పబ్లిక్ ప్రాసిక్యూటర్, తూర్పు గోదావరి జిల్లా డీఆర్‌ఓ టి.సీతారామమూర్తి, రాజమహేంద్రవరం సూపరింటెండెంట్ ఆఫ్ జైల్స్ ఎస్.రాహుల్, స్పెషల్ మహిళా జైలు అధికారులు, జిల్లా సబ్ జైలు అధికారి, సంయుక్త తూర్పుగోదావరి జిల్లా రెవెన్యూ అధికారులు, న్యాయవాదులు, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# చంద్రబాబు ఇచ్చిన హామీలు గాలికి వదిలేసారు

## కడియం రచ్చబండలో కల్తీ మద్యంపై కోటి సంతకాల సేకరణ..
## హామీలు ఇచ్చి హామీలు గాలికి వదిలేసారు
## మాజీ మంత్రి, వైసిపి జిల్లా అధ్యక్షులు చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ








**కడియం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరం రూరల్ నియోజక వర్గం కడియం మండలం కడియం గ్రామంలో నోటికొచ్చిన హామీలు ఇచ్చి ప్రజలను వంచనకు గురిచేసిన కూటమి ప్రభుత్వ పాలకులను తూర్పుర పట్టాలని, ప్రజలకు జరిగిన మోసాన్ని వైసీపీ శ్రేణులు ఇంటింటికి వెళ్లి వివరించాలని మాజీమంత్రి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు చెల్లుబోయిన శ్రీనివాస్ వేణుగోపాలకృష్ణ పిలుపు ఇచ్చారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు ఆధ్వర్యంలో కడియం గ్రామంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన రచ్చబండ కార్యక్రమం, రాష్ట్ర ప్రభుత్వ కల్తీ మద్యంపై కోటి సంతకాల సేకరణ కార్యక్రమం మండల అధ్యక్షులు యాదల సతీష్ చంద్ర స్టాలిన్ అధ్యక్షుతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మాజీమంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, హాజరయ్యారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా డైవర్షన్ పాలిటిక్స్ చేస్తూ ప్రజలను ఇంకా మభ్యపెడుతూనే పాలన సాగిస్తోందని ముఖ్యఅతిథిగా హాజరైన చెల్లుబోయిన శ్రీనివాస్ వేణుగోపాలకృష్ణ అన్నారు. వైఎస్ఆర్సిపి కార్యకర్తలు అంతా పాలకుల దుర్నీతిని, అక్రమాలను ఇంటింటికి వెళ్లి ప్రజలకు తెలియజేయాలి అన్నారు. రాష్ట్రంలో కల్తీ మద్యం దందాను నిర్వహిస్తూ సమావేశంలో నాయకులు,కార్యకర్తలు పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన నూతన కమిషనర్



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమండ్రి నగరపాలక సంస్థ నూతన కమిషనర్ రాహుల్ మీనా బుధవారం జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరిని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందచేశారు. నూతన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆయనకు కలెక్టర్ కీర్తి చేకూరి శుభాకాంక్షలు తెలియజేశారు.

# పోలవరం సత్వరం పూర్తి చేయాలి..

## రాష్ట్రంలో ఐటి అభివృద్ధి, పరిస్థితులకు అనుగుణంగా అభివృద్ధి.. - బచావత్ ట్రిబ్యునల్ ప్రకారం కృష్ణా జలాలపై మన హక్కు కాపాడుకోవాలి
## బ్రజేష్ కుమార్ ట్రిబ్యునల్ పై కోర్టులో గెలిచేలా ఇద్దరు సీఎం లు కృషి చేయాలి.. - రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మరింత వేగంగా పనిచేయాలి
## మాజీ ముఖ్య మంత్రి, బిజెపి నేత నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** పోలవరం ప్రాజెక్టు నిర్మాణం యుద్ధ ప్రాతి పదికన పూర్తిచేయాలని మాజీ ముఖ్య మంత్రి, బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యులు నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. తాను ముఖ్య మంత్రిగా ఉండగా పోలవరం ప్రాజెక్ట్ అంచనా 16 వేల100 కోట్లు ఉంటే, ఇప్పుడు చాలా పెరిగిందని ఆయన గుర్తు చేశారు.రాజమండ్రి వచ్చిన కిరణ్ కుమార్ రెడ్డి స్థానిక క్వారీ ఏరియా లోని జిల్లా బిజెపి కార్యాలయంలో ఎమ్మెల్సీ సోము వీర్రాజుతో కలిసి బుధవారం ఉదయం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పోలవరం పూర్తయితే 7,20,000 వేల ఎకరాల ఆయకట్టుకి నీళ్లు అందుతాయని, 23లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ అవుతుందని అన్నారు.960 మెగావాట్ల జల విద్యుత్ ఉత్పత్తి అవుతుందని, నీటితో విద్యుత్ చవకగా వస్తుందని కిరణ్ కుమార్ రెడ్డి చెప్పారు. 13 లక్షల ఎకరాలకు రాయలసీమ, తెలంగాణకు నీళ్లు వచ్చే అవకాశం ఉన్న ముఖ్య మైన ప్రాజెక్ట్ పోలవరం అని ఆయన చెబుతూ,అందుకే త్వరగా పూర్తి చేయాలన్నారు.ఇక కృష్ణా జలాలపై 1976లో బచావత్ ట్రిబ్యునల్ అవార్డు ప్రకారం 811టి ఎం సిలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వాడుకోవడానికి అవకాశం ఉందని,అందుకే ప్రతి నీటి బొట్టును మనం వాడుకోవాలని కిరణ్ కుమార్ రెడ్డి అభిప్రాయపడ్డారు. అయితే ట్రిబ్యునల్ ఆర్డర్స్ పునఃపరిశీలన చెయ్యాలని తెలంగాణ అడుగుతోందని, దీనిపై మన ప్రభుత్వం కూడా స్పందించాలన్నారు. ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఫోన్ లో ఈ అంశం మాట్లాడినట్లు ఆయన తెలిపారు. నీరు ఉన్నప్పుడు పర్వాలేదని, నీళ్ళు లేకపోయినప్పుడే సమస్య ఉత్పన్నం అవుతుందని ఆయన అన్నారు. తెలంగాణ వాళ్ళు ఇచ్చిన స్టేట్ మెంట్ చూస్తే చాలా హాస్యాస్పదంగా ఉందని, అయితే దానిపై ఎందుకు రాష్ట్రంలో మంత్రులు ఎవరూ మాట్లాడడం లేదని ఆయన అన్నారు. బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ఇచ్చిన ఆర్డర్స్ ని వ్యతిరేకిస్తూ నేను ముఖ్య మంత్రి గా ఉండగా 2011లో అఖిల పక్షాన్ని ప్రధాన మంత్రి వద్దకు తీసుకెళ్ళానని కిరణ్ కుమార్ రెడ్డి స్పష్టం చేసారు.దానిపై సుప్రీంకోర్టుకి వెళ్లి స్టే కూడా తెచ్చామని ఆయన వివరిస్తూ, రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్య మంత్రులు కూడా కలసికట్టుగా ఆలోచన చేసి, ఈ అంశంపై కోర్టులో గెలవటం చాలా ముఖ్య మనే విషయాన్ని గుర్తించాలని ఆయన సూచించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వేగంగానే పనిచేస్తోందని, అయితే మరింత వేగంగా పనిచేయాలని ఆయన ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ప్రధాని మోడీ కూడా రాష్ట్ర అభివృద్ధికి సహకరిస్తున్నందున మరింత సహకారం అందించేలా ప్రయత్నం చేయాలని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో ఐటి అభివృద్ధి తోపాటు మన రాష్ట్ర పరిస్థితులకు అనుగుణంగా అభివృద్ధి చేయాలనీ సూచించారు. మన ప్రాంతంలో రొయ్యలు, చేపలు ఎక్కువగా ఉత్పత్తి అవుతాయని, దీనివలన 11వేల కోట్ల ఆదాయం వచ్చేదని, అమెరికాలో తీసుకున్న పన్నుల విధానం వలన ఏర్పడిన ఇబ్బందిని అధిగమించే చర్యలు చేపట్టడంపై దృష్టి పెట్టాలన్నారు. కల్సి ఉంటె కలదు సుఖమని అందుకే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గానే ఉండాలని తాము కోరుకున్నామని కిరణ్ కుమార్ రెడ్డి చెబుతూ, అప్పట్లో మహారాష్ట్ర మొదటి స్థానంలో ఉంటె ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రెండవస్థానంలో ఉండేదని, ఇప్పుడు ఆంధ్ర, తెలంగాణ ఏ స్థానంలో ఉన్నాయో తెలుసుకోవాలని ఆయన వ్యాఖ్యానించారు. తొలుత మాజీ రాష్ట్రపతి డా ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి కిరణ్ కుమార్ రెడ్డి, సోము వీర్రాజు పూలమాల వేసి నివాళులర్పించారు.

### సోము వీర్రాజు పుట్టినరోజు వేడుకలు

ఎమ్మెల్సీ సోము వీర్రాజు పుట్టినరోజు వేడుకలు కిరణ్ కుమార్ రెడ్డి సమక్షంలో ఘనంగా జరిగాయి. వీర్రాజు కేక్ కట్ చేయగా, కిరణ్ కుమార్ రెడ్డి ఆయనకు తినిపించారు అర్చకులు, పురోహితులు ఆశీర్వచనం చేసారు. పలువురు పూలమాలలతో, పుష్పగుచ్ఛాలతో, శాలువాలతో శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా బిజెపి అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, రాష్ట్ర కార్యదర్శి బొమ్ముల దత్తు,నాయకులు రేలంగి శ్రీదేవి,అడబాల రామకృష్ణ, యెనుముల రంగబాబు, నర్శిపల్లి హారిక, పరిమి రాధాకృష్ణ, ఎపిఆర్ చౌదరి, మోది సత్తిబాబు, వీర వీరాంజనేయులు, కురగంటి సతీష్, గుర్రాల వెంకట్రావు, కాకరాల పవన్, నిల్లా ప్రసాద్, డాక్టర్ అనురాధ, మద్దిపాటి రజిని, సూర్య కిరణ్,, రవిశంకర్ శెట్టిపల్లి శివ నాగరాజు, పొన్నాల లక్ష్మీ సంతోషి, బీజేవైఎం సాయి, బేతి రెడ్డి ఆదిత్య తగరం సురేష్, తంగెళ్ల శ్రీనివాస్, కుయ్యా వెంకటలక్ష్మి, డాక్టర్ ఉమాదేవి, మీనాక్షి రెడ్డి, అడపా ప్రసాద్, లాడి రుద్రయ్య, లలిత్ జైన్, కుమారి, ఎర్ర నాగదేవి పెద్ద ఎత్తున కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

## మెడికల్ కళాశాలలను పూర్తి చేయాలనే లక్ష్యంతో

# ప్రభుత్వం పిపిపి అమలు..

## జగన్ వలన మెడికల్ కాలేజీల నిర్మాణంఅతీగతీ లేకుండా పోయింది - అభివృద్ధిని చూసి వైసిపి ఓర్వలేకపోతోంది..
## - సూపర్ సిక్స్ సూపర్ హిట్ అయ్యింది.. : మాజీ మంత్రి, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రాన్ని ఐదేళ్ల పాటు సర్వనాశనం చేసి అన్ని విధాలుగా దివాళా తీయించిందని రాష్ట్రాన్ని గాడిన పెట్టడానికి కూటమి ప్రభుత్వం అహర్నిశలు కృషిచేస్తుంటే మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇంకా నీచ రాజకీయాలు చేస్తున్నారంటూ మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నాయకుడు, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ మండిపడ్డారు. ది రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం సాయంత్రం జరిగిన మీడియా సమావేశంలో పితాని మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ స్కీముల్లో భాగంగా మాత్రమే రాష్ట్రానికి 17 వైద్య కళాశాలలు వచ్చాయని, జగన్ నిర్వాకం వల్ల వాటి నిర్మాణం అతీగతీ లేకుండా పోయిందని విమర్శించారు. వైద్య కళాశాలలకు 2020లో 8 వేల 480 కోట్ల రూపాయల కేటాయించారని, గత నాలుగేళ్లలో వైసిపి ఖర్చు చేసింది ఒక వెయ్యి 550 కోట్లు మాత్రమేనని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఖజానా నుండి ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టలేదని ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయని ఇది వాస్తవమా.. అవాస్తమనేది అనేది చెప్పాలంటూ డిమాండ్ చేసారు. ఒక మెడికల్ కాలేజీ పూర్తి చేయాలంటే 470 కోట్ల నుండి 600 కోట్లు కావాలని, 396 కోట్ల రూపాయలతో పులివెందులలో మాత్రమే మెడికల్ కాలేజ్ పూర్తయిందని, మిగిలిన కళాశాలల నిర్మాణం ఎక్కడా 30 శాతం దాటలేదన్నారు. ఇప్పుడు త్వరిగతిన మెడికల్ కళాశాలలను పూర్తి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పిపిపి విధానం అమల్లోకి తెచ్చిందన్నారు. దీని వల్ల ప్రభుత్వ వైద్య కళాశాలల కన్నా ఈ పద్ధతిలో పేద విద్యార్థులకు అదనంగా 110 సీట్లు వస్తున్నాయని, ఫీజులు కూడా ఇప్పుడు ఉన్నట్టుగానే ఉంటాయన్నారు. ఈ వాస్తవాలను గ్రహించకుండా వైసిపి ఉద్యమాల పేరుతో ప్రజల్ని రెచ్చగొట్టడానికి కుట్ర పన్నుతోందని ఆగ్రహం వ్యక్తం చేసారు. గతంలో చంద్రబాబు శంకుస్థాపన చేసిన అమరావతి రాజధాని నిర్మాణాన్ని జగన్ ఏం చేసారో ప్రజలందరూ చూసారని ఎద్దేవా చేసారు. తాము ఆ విధంగా ద్వంద్వ విధానాలు అనుసరించబోమని, ప్రజలకు మేలు చేయడానికి పనిచేస్తామన్నారు. పులివెందుల తప్ప ఏ వైద్య కళాశాలకు కనీసం వంద కోట్ల రూపాయలు కూడా ఖర్చు చేయలేదు ఆ మహానుభావుడు జగన్ అని మళ్లీ తానేదో గొప్ప ఘనకార్యం చేసినట్లు ఇప్పుడు రాజకీయం చేస్తున్నాడని ధ్వజమెత్తారు. పిపిపి విధానంపై కూటమి ప్రభుత్వం చేసుకున్న అగ్రిమెంట్ కూడా జగన్ ఒక సారి చూడాలని సూచించారు. తొలి విడతలో నాలుగు మెడికల్ కళాశాలలు ప్రారంభమవుతాయని, ఆ తరువాత మిగిలిన వాటిని వెంటనే పూర్తిచేసేలా చర్యలు చేపడుతున్నామన్నారు. ఇప్పటికైనా జగన్ తన పద్ధతి మార్చుకుని ప్రతిపక్ష పార్టీగా అభివృద్ధి సహకరించాలని సూచించారు. విశాఖలో గుగూల్ డేటా సెంటర్ రాష్ట్రానికి రావడం గర్వకారణమని, దీనికి ప్రధాన కారణమైన ఐటి మంత్రి నారా లోకేష్‌కు అభినందనలు తెలిపారు. సూపర్ సిక్స్ సూపర్ హిట్ అయ్యిందని, ఇవ్వని హామీలను కూడా అన్ని వర్గాల ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని సిఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ అమలు చేయడానికి కృషి చేస్తున్నారని మాజీ మంత్రి పితాని పేర్కొన్నారు.

# 17న నయన డాక్టర్ శ్రీరామ్‌కి రోటరీ గోల్డ్ పురస్కారం



**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ సీనియర్ సభ్యులు నయన కంటి హాస్పిటల్ అధినేత డాక్టర్ రావుల శ్రీరాములు ఈనెల 17వ తేదీన సత్కరిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ఆప్తమాలజీ సొసైటీ అధ్యక్షులుగా ఎన్నికైన డాక్టర్ శ్రీరామ్ కంటి వైద్య చికిత్స విషయంలో తెలుగు రాష్ట్రాల లో ప్రత్యేక గుర్తింపు పొందారు. డాక్టర్ శ్రీరామ్ ఆధ్వర్యంలో కంటి శుక్ల, కార్నియా గ్లాకోమా , పీడియాట్రిక్ ఆప్తమాలజీ తో వివిధ రకాల కంటి సంరక్షణ సేవలను అందిస్తున్నారు. అత్యాధునిక పరికరాలతో పాటు లేజర్ సేవలను కూడా అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రముఖ కంటి వైద్య నిపుణులు అయినప్పటికీ సౌమ్యంగా అందరితో కలసి మెలసి ఉండే వ్యక్తిగా కీర్తించబడుతున్నారు. ఇటీవల పలు సంఘాల సభ్యుల తొపాటు పాత్రికేయ సంఘాలకు కూడా తమ సేవలను డాక్టర్ శ్రీరామ్ అందించి ప్రశంసలు పొందారు. సామాజిక సేవా కార్యక్రమానికి అధిక ప్రాధాన్యత ఇవ్వడమే కాక ప్రత్యేక ట్రస్ట్ ను ఏర్పాటు చేసి కంటి వైద్య చికిత్సను ఉచితంగా అందిస్తూ సామాజిక బాధ్యతను నెరవేరుస్తున్నారు. కాకినాడలో 28 సంవత్సరాల క్రితం నాయనకంటి ఆసుపత్రి ఏర్పాటు చేశారు. రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ తో పాటు ఇతర స్వచ్ఛంద సేవా సంస్థల సహకారంతో ప్రభుత్వ పాఠశాలలతో పాటు స్లమ్స్ లో కూడా ఐ క్యాంపులు నిర్వహిస్తూ ఉన్నారు. వేలాది కాటరాక్ట్ ఆపరేషన్లను విజయవంతంగా నిర్వహించడమే కాక రాష్ట్రంలోనే తొలిసారిగా అత్యాధునిక వైద్య పరికరాలను అందుబాటులోకి తీసుకురావడమే కాక నయన ఆసుపత్రిలో ఏర్పాటు చేసి ప్రజలకు ఉత్తమ కంటి వైద్య సేవలను అందిస్తున్నారు. వీరి సామాజిక సేవా కార్యక్రమాలను జిల్లా యంత్రాంగం గుర్తించి ఇటీవల స్వాతంత్ర దినోత్సవం నాడు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా ఉత్తమ సేవా అవార్డుతో సత్కరించారు. కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజీలో వైద్య విద్యను అభ్యసించిన డాక్టర్ శ్రీరామ్ ఆంధ్ర యూనివర్సిటీ తోపాటు యూఎస్ఏ లో కూడా కంటి వైద్య చికిత్స అత్యాధునిక అంశాలపై ఉన్నత విద్యను అభ్యసించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పలు పేరొందిన ప్రభుత్వ మరియు ప్రైవేట్ హాస్పిటల్స్ నందు తొలుత కంటి వైద్యులుగా సేవలందించారు. అంకితభావంతో వైద్య వృత్తిని చేపట్టి ప్రజలలో మంచి గుర్తింపు మరియు ఆప్తమాలజీ రంగంలో చేసిన సేవలకు గా ను ప్రభుత్వము నుండి డాక్టర్ శ్రీరామ్ అనేక అనేక అవార్డులను స్వీకరించారు. డాక్టర్ శ్రీరామ్ తనయుడు డాక్టర్ మెహర్ రావుల కుమార్తె మరియు డాక్టర్ హారిక రావుల కంటి వైద్య రంగంలో గత దశాబ్ద కాలంగా విశేష సేవ అందిస్తూ తండ్రికి తగ్గ వారసులమని కంటి వైద్య రంగచరిత్రలో నిరూపించుకున్నారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఐ బ్యాంకు లోను కీలక బాధ్యతలను నిర్వహిస్తూ అందరి ప్రశంసలు డాక్టర్ శ్రీరామ్ పొందారు. 17 వ తారీకు సాయంత్రం ఏడు గంటలకు కాకినాడ రోటరీ క్లబ్ లో క్లబ్ అధ్యక్షులు డాక్టర్ గోపీనాథ్ అధ్యక్షతన సత్కార కార్యక్రమం జరుగుతుంది.

### దోసకాయలపల్లి బాధితులకు

# లక్ష పదివేల రూపాయలు ఆర్థిక సహాయం : కంబాల



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** మండలంలోని దోసకాయలపల్లిలో అగ్నిప్రమాదంలో ఇల్లు, 40 మేకలతో సర్వం కోల్పోయిన జుత్తుక సుబ్రహ్మణ్యం, గరికపాటి సత్యనారాయణ కుటుంబాలను విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ నాయకులు కంబాల శ్రీనివాసరావు పరామర్శించారు. బుధవారం సంఘటనస్థలాన్ని పరిశీలించి ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. బాధితులు సర్వం కోల్పోయామని, తమను ఆదుకోవాలని కంబాలను వేడుకున్నారు. అనంతరం కంబాల అధైర్య పడవద్దని తన వంతు సహాయ సహకార అందిస్తానని తక్షణమే బాధితులైన జుత్తుక సుబ్రహ్మణ్యం కుటుంబానికి 70వేల రూపాయలు, గరికపాటి సత్యనారాయణ కుటుంబానికి 40వేలు రూపాయలు మొత్తం లక్ష పదివేలు రూపాయలు చెక్కును బాధితులకు కంబాల అందజేశారు.ఇరు కుటుంబ సభ్యులకు చేరొక గ్యాస్ స్టవ్, నెలకు సరిపడే కిరాణా,కూరగాయలు, నిత్యవసర సరుకులు,చీరలు, బట్టలు అందజేస్తానన్నారు. ప్రభుత్వ పరంగా రావాల్సిన రాయితీలు అందేలా కృషి చేస్తామన్నారు.రాజానగరం నియోజకవర్గంలో ఎవరికి ఏ కష్టం వచ్చినా, ఎల్లవేళలా కంబాల అండగా ఉండి ఆదుకుంటాడని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాజానగరం బీజేపీ మండల అధ్యక్షులు ఆళ్ల శివరామకృష్ణ, బీజేపీ నాయకులు బత్తుల నానాజీ, పెద్దడా వెంకన్న దొర, దేశాల నరేష్, పసల గణేష్, నాగా రమేష్, జాజుల నరసింహమూర్తి, చింతల కన్నారావు, పలకంశెట్టి శ్రీను, దోసపాటి సుబ్బారావు, సురేష్, మళ్ల అధిశేషు, కాకర దుర్గారావు, అంబటి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

# మెడికల్ సీట్ సాధించిన సంతోష్‌కు ఘన సన్మానం

### ప్రతీ విద్యార్థి ఉన్నత శిఖరాలను అందుకోవాలని సూచించిన కరస్పాండెంట్ వేణు



**చింతూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలానికి చెందిన గుండెపోగు సంతోష్‌కి తెలంగాణా రాష్ట్రంలో కరీంనగర్ మెడికల్ కాలేజీలో ఫ్రీ ఏంబిబిస్ సీట్ సాధించడం జరిగింది. బుధవారం శ్రీ భాస్కర విద్యానికేతన్ స్కూల్ ఆధ్వర్యంలో సంతోష్‌కి సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమంలో శ్రీ భాస్కర స్కూల్ కరస్పండెంట్ వేణు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ సంతోష్ మన పాఠశాలలో విద్యను అభ్యసించి ఇప్పుడు గౌరవ ప్రధమైన వైద్య విద్యను అభ్యసించడానికి మెడికల్ సీట్ సాధించాడని,సంతోష్ ని ప్రతీ విద్యార్థి ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా వారి తల్లితండ్రులను మరియు సంతోష్‌ని సన్మానం చెయ్యటం జరిగినది. అదేవిధంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులైన వి.రాంబాబు మాట్లాడుతూ పిల్లలకు భవిష్యత్తులో ఏ విధంగా చదివితే వారి యొక్క లక్ష్యాలను చేరుకోవచ్చు అనే విషయాలను గురించి దిశా నిర్దేశం చేస్తూ విద్య యొక్క ఔన్నత్యాన్ని తెలియజేస్తూ పిల్లలకు అమూల్యమైన సందేశం ఇవ్వటం జరిగినది.ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# డాక్టర్ ఎ.పి.జె.అబ్దుల్ కలాం 95వ జయంతి ఘన నివాళి



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మాజీ రాష్ట్రపతి, మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా డా.ఎ.పి.జె.అబ్దుల్ కలాం 95వ జయంతి వేడుకల్లో ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్, యూత్ రెడ్‌క్రాస్ వాలంటీర్లు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా ఆదిత్య డైరెక్టర్ ఎస్పిగంగి రెడ్డి, ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ జి వి ఎస్ నాగేశ్వరరావు, పోలుకొండ.సాయి, ఎ.శిరీష, డా.బి.హెచ్.వి. రమాదేవి,టీమ్ లీడర్లు శ్రావణి, దివ్య మరియు 60 మంది ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.ఈ కార్యక్రమాన్ని నందం గనిరాజు సెంటర్‌లో ఈ విగ్రహ వ్యవస్థాపకుడు యాంకర్ ఛోటు నిర్వహించారు.

# జువాలాజి గెస్ట్ అధ్యాపక పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానం

**చింతూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** అల్లూరి సీతారామరాజు జిల్లా నెల్లిపాక ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు జువాలాజి సబ్జెక్ట్ ను భోదించుటకు గెస్ట్ ప్రాతిపదికన సంబంధిత జువాలాజి సబ్జెక్ట్ నందు పోస్టు గ్రాడ్యుయేషన్ చేసి ఉండాలని, 50% శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి ఉండాలని,ఆసక్తి గల అభ్యర్ధులు ఈ నెల 18వ తేదీ లోపల దరఖాస్తులు ప్రభుత్వ జూనియర్ కళాశాల,నెల్లిపాక నందు సంబందించిన సర్టిఫికెట్స్ రెండు సెట్స్ అందజేయాలని కళాశాల ప్రిన్సిపాల్ నాగుల్ మీరా ఒక ప్రకటనలో తెలిపారు.పూర్తి వివరాలకు 7382318374 లను సంప్రదించాలని కోరారు.

# వృక్ష సంపద అక్రమ తరలింపు...

### స్థానిక నాయకుల అండదండలతో 72 మొక్కలు దొంగల ముఠా చేతికి.. : వైసీపీ రూరల్ కన్వీనర్ అడబాల బాబ్జి



**మండపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** ద్వారపూడి ప్రాంతంలోని వేములపల్లిలో ప్రభుత్వానికి చెందిన చెరువు గట్టుపై ఉన్న మర్రి రావి జాతికి పచ్చని 72 మొక్కలు అక్రమంగా తవ్వి తరలించారని మండపేట రూరల్ వైసిపి కన్వీనర్ అడబాల సూర్యనారాయణ(బాబ్జి) ఆరోపించారు. ఈ మొక్కలు బంగారమ్మ కాలనీ వెనుక వైపు బృందావనం కాలనీ లేఔట్‌లోని 36 ప్లాట్లకు సంబంధించినవిగా పేర్కొన్నారు. సుమారు 15 సంవత్సరాలుగా ఉన్న ఈ మొక్కలను యజమానులకు తెలియకుండా దుండగుల ముఠా అపహరించిం దన్నారు. స్థానికంగా ఉన్న కూటమి నాయకుడి సహకారంతో ఈ అక్రమం జరిగినట్లు ఆరోపించారు. స్థానిక మహిళ వెలవల భూరమ్మ ఈ ఘటనపై ప్రశ్నించగా, దొంగల ముఠా తాము హెూల్‌సేల్‌గా కొన్నామని ఇరుగుపొరుగు వారితో చెప్పి అక్రమంగా తరలించుకుపోయినట్లు ఆరోపించారు. కడియం మండలంలోని నర్సరీలకు ఔషధ గుణాలు కలిగిన మర్రి వృక్షాలను లక్షల్లో అమ్ముతూ, ప్రభుత్వ, ప్రైవేటు స్థలాల్లోని వృక్ష సంపదను విదేశాలకు తరలిస్తున్నారని కూటమి నేతలపై ఆరోపణలు చేసారు. పర్యావరణ రక్షణ పేరుతో ఈ సంపదను దోచుకుంటున్నారని, కూటమి నేతలు ఇందులో పాలుపంచుకుంటున్నారని విమర్శించారు.ఈ అక్రమాన్ని గుర్తించి విచారణ చేయాలని మండపేట రూరల్ వైసిపి కన్వీనర్ అడబాల బాబ్జి కోరారు. జిల్లా కలెక్టర్ హార్టికల్చర్ డిపార్ట్‌మెంట్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.వాల్టా యాక్ట్ (వాటర్, ల్యాండ్ అండ్ ట్రీస్ యాక్ట్) అనుమతి లేకుండా మొక్కలు నరికితే జరిమానా జైలు శిక్ష విధించాలన్నారు. ప్రైవేట్ భూముల్లో కూడా ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ అనుమతి తప్పనిసరి గా పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో పోలీసు, ఫారెస్ట్ హార్టికల్చర్ డిపార్ట్‌మెంట్‌లు ఉమ్మడి దర్యాప్తు చేపట్టాలన్నారు. దుండగుల ముఠాను గుర్తించి అరెస్టు చేయాలన్నారు. తరలించిన మొక్కలను స్వాధీనం చేసుకోవాలనీ డిమాండ్ చేశారు. కడియం వంటి నర్సరీ ప్రాంతాల్లో రెగ్యులర్ పెట్రోలింగ్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ భూముల్లోని వృక్షాల తరలింపును నిరోధించడానికి జీపీఎస్ ట్రాకింగ్ డ్రోన్ సర్వేలు ఉపయోగించాలన్నారు.అక్రమంగా నరికిన మొక్కల విలువకు 10 రెట్లు జరిమానా విధించాలన్నారు. దోషులు కొత్త మొక్కలు నాటాలన్నారు. పర్యావరణ పునరుద్ధరణకు బాధ్యత వహించాలన్నారు. స్థానికులకు వృక్ష సంపద రక్షణపై అవగాహన కల్పించాలన్నారు. హార్టికల్చర్ డిపార్ట్‌మెంట్ నర్సరీల లైసెన్స్‌లను కఠినంగా పరిశీలించాల న్నారు. విదేశీ ఎగుమతులపై నిఘా పెంచాలన్నారు.

# యోగివేమన విగ్రహాన్ని ఆవిష్కరించిన చిర్ల జగ్గిరెడ్డి



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలానికి చెందిన గోపాలపురం గ్రామంలో నూతనంగా ఏర్పాటుచేసిన ప్రముఖ తత్త్వవేత్త, ప్రజా కవి శ్రీ యోగి వేమన విగ్రహాన్ని ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి యోగివేమన విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఆయనతోపాటు యోగి వేమన విగ్రహ దాత క్రియేటివ్ గ్రూప్ అధినేత కొవ్వూరి నరేష్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగి వేమన సామాజిక సందేశాలు, ఆచరణలో విలువలు ఈనాటి యువతకు మార్గదర్శకంగా నిలుస్తాయన్నారు. సమాజంలో సమానత్వం, నైతికత మరియు మానవతా విలువలను ప్రతిఒక్కరూ తన జీవితంలో అవలంబించాలి అని పేర్కొన్నారు.యోగి వేమన విగ్రహం గ్రామానికి స్ఫూర్తిదాయక ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. అనంతరం కమిటీ పెద్దలు యువత అందరూ కలిసి జగ్గిరెడ్డి ని మరియు నరేష్ రెడ్డిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు, స్థానిక ప్రజాప్రతినిధులు,యువత, మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# అవినీతికి పాల్పడుతూ ఏసీబీకి అడ్డంగా దొరికిన తహసిల్దార్

- ధనార్జునే ధ్యేయంగా అధికారి విధి నిర్వహణలు
- సర్వే కోసం దరఖాస్తు చేసుకున్న కొండలరావు
- లక్ష రూపాయలు లంచం డిమాండ్ చేసిన ఎమ్మార్వో
- ముందస్తుగా 50,000 ఇవ్వాలని షరతు
- ఏసీబీ అధికారులను ఆశ్రయించిన బాధితుడు
- కార్యాలయంలో 50, వేలు కంప్యూటర్ ఆపరేటర్ తీసుకుంటూ పట్టుబడిన వైనం
- అదనంగా మరో ఐదు లక్షల 88 వేల 500 రూపాయలు స్వాధీనం
- తాసిల్దార్ అశోక్, కంప్యూటర్ ఆపరేటర్ రాము ను అరెస్ట్ చేసిరిమాండ్‌కి తరలింపు





**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ తాసిల్దార్ కార్యాలయంలో రాజమండ్రి ఏసీబీ అధికారుల తనిఖీల్లో ఏ సి బి వాళ్లకు చిక్కిన రెవెన్యూ అవినీతి తిమింగలం అనతి కాలంలోనే ఎమ్మార్వో గా పదోన్నతి పొంది ధనార్జినే ధ్యేయంగా విధులు నిర్వహిస్తున్న అమలాపురం తాలూకా తాసిల్దార్ అశోక్ ప్రసాద్ పై ఎస్ సి బి అధికారులకు ఫిర్యాదు చేసి అధికారుల వలలో చిక్కేలా చేసిన గంధం దుర్గ కొండలరావు తండ్రి సత్యనారాయణ వివరాలు వెల్లడించిన డిఎస్‌పి ఎం.కిషోర్ రాజమండ్రి రాజవోలుకు చెందిన గంధం దుర్గా కొండ్రలావు తండ్రి సత్యనారాయణ అను వారు అమలాపురం జనిపెల్లి గ్రామంలో కొనుగోలు చేసిన 16 సెంట్లు భూమిని విక్రయించేందుకు సర్వే చేయాలని సర్వే కోసం అమలాపురం తాలూకా తాసిల్దార్ అశోక్ ప్రసాద్ కు దరఖాస్తు చేసుకున్నారు దొరికిందే అదునుగా భావించిన తాసిల్దార్ ఆ భూమిని సర్వే చేసేందుకు రూ లక్ష రూపాయలు గంధం దుర్గా కొండలరావు ను డిమాండ్ చేశారు అంతేకాకుండా ముందస్తుగా 50వేల రూపాయలు ఇవ్వాలని షరతులు విధించారు తాసిల్దార్ అశోక్ తీరుకు విసిగి న బాధితుడు రాజమండ్రిలోని ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు బాధితుడు గంధం దుర్గా కొండ్రలావు ఫిర్యాదును స్వీకరించిన అధికారులు తాసిల్దార్ అశోక్ ప్రసాద్ డిమాండ్ ప్రకారం 50,000 ముందస్తుగా ఇవ్వడానికి ఏర్పాట్లు చేసి అమలాపురం తాసిల్దార్ కార్యాలయానికి బుధవారం నాడు పంపించారు కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్ రాము 50 వేల రూపాయలు లంచం తీసుకుంటూ ఏసిపి అధికారులు పన్నిన వలలో చిక్కుకుని 50 వేల రూపాయలతో అడ్డంగా తాసిల్దార్ అశోక్ ప్రసాద్ కంప్యూటర్ ఆపరేటర్ రాము బుక్కయ్యారు రాజమండ్రి ఏసీబీ డిఎస్పి ఎం కిషోర్ ఆధ్వర్యంలో తాసిల్దార్ కార్యాలయంలో తనిఖీలు నిర్వహించగా అదనంగా మరో ఐదు లక్షల 88 వేల 500 రూపాయలు స్వాధీనం చేసుకున్నారు లంచం తీసుకుంటూ పట్టుబడిన తాసిల్దార్ అశోక్ ప్రసాద్ తో పాటు కంప్యూటర్ ఆపరేటర్ రాము ను అరెస్టు చేసి రిమాండ్ తరలిస్తున్నట్లు ఏసిపి డిఎస్పి వెల్లడించారు. ఈ తనిఖీల్లో రాజమండ్రి డిఎస్పి ఎం.కిషోర్ కుమార్, సీఐలు ఎన్‌వి.భాస్కరరావు వై.సతీష్‌లు పాల్గొన్నారు.

# విస్ఫోటనం జరిగి వారం.. బాధితులకు ఏది పరిహారం.?

### యాజమాన్యం, ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే పదిమంది కార్మికుల మృతి - శనివారం లోపు పరిహారం ప్రకటించక పోతే, బాధిత కుటుంబాలతో కలిసి ఉద్యమం బాట

### పీడీఎస్‌యూ, ఏఐకెఎంఎస్, ఎంఆర్‌పిఎస్, ఎస్‌సీ, బీసీ, మైనార్టీ ప్రజా సంఘాల హెచ్చరిక



**రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, మండల కేంద్రమైన రాయవరం గ్రామ శివారులో శ్రీ గణపతి ఫైర్ వర్క్స్ బాణాసంచా తయారీ కర్మాగార కేంద్రంలో సంభవించిన ఘోర అగ్నిప్రమాదంలో 10 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోవడం తీవ్ర విచారకమని, ఘటన జరిగి వారం రోజులు గడిచినా నష్టం పరిహారం పై ప్రకటన లేని ప్రభుత్వ వైఖరి పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ పీ.డీ.ఎస్.యూ, ఏ.ఐ.కె.ఎం.ఎస్., ఎం.ఆర్.పి.ఎస్., ఎస్.సీ, బీ.సీ, మైనార్టీ ప్రజా సంఘాలన్నీ కలిసి రాయవరం మండల తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి, బాధిత కుటుంబాలకు తక్షణ సహాయం అందించాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. ఈ సందర్భంగా పీ.డీ.ఎస్.యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి. సిద్ధూ, ఎం.ఆర్.పీ.ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు ధూళి జయరాజు, రైతు కూలీ సంఘం నాయకులు వెంటపల్లి భీమశంకరం, ప్రజా సంఘాల నాయకులు తమ ఆవేదనను వెలిబుచ్చుతూ, అగ్ని ప్రమాద ఘటనలో మరణించిన మృతుల్లో ఆరుగురు మహిళలు, నలుగురు పురుషులు ఉండగా వీరంతా ఎస్.సీ, బీ.సీ, ఓ.సీ సామాజిక వర్గాలకు చెందిన పేద కుటుంబాల వారేనని, ఈ ప్రమాదంలో సోమేశ్వరం గ్రామానికి చెందిన పాకా అరుణ (35), వాసం శెట్టి విజయలక్ష్మి (45), అనపర్తి–సావరం గ్రామానికి చెందిన కుడిపూడి జ్యోతి (38), పెంకే శేషా రత్నం (35), అనపర్తి గ్రామానికి చెందిన చిట్టూరి శ్యామల (35) చిట్టూరి యామిని (30), వేండ్ర గ్రామానికి చెందిన లింగం వెంకట కృష్ణ (22), కొమరిపాలెం గ్రామానికి చెందిన పొట్నూరి వెంకట రమణ(55)లు మరణించగా, వీరు పరిశ్రమ యజమాని వెలుగుబంట్ల సత్యనారాయణ (65) నిర్లక్ష్యం వల్లనే మరణించారని ఆరోపిస్తూ, దీపావళి పండుగ సమీపంలో అధిక ఉత్పత్తి కోసం భద్రతా ప్రమాణాలు విస్మరించడం వల్లే ఈ దుర్ఘటన జరిగి ఆయన కూడా మరణించారన్నారు. రెవెన్యూ, కార్మిక, పరిశ్రమల, అగ్నిమాపక శాఖలు నిరంతర పర్యవేక్షణలో విఫలమయ్యాయని నిందించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా యజమానులు, అధికారులపై కఠినచర్యలు తీసుకోవాలని నినదించారు. కాగా ఘటన జరిగిన గంటల వ్యవధిలోనే రాష్ట్ర హెూంశాఖ మంత్రి వంగలపూడి అనిత ఘటన స్థలాన్ని సందర్శించినప్పటికీ, వారం రోజులు గడిచినా ప్రభుత్వం ఇప్పటివరకు నష్టపరిహారం ప్రకటించకపోవడం తీవ్ర ఆవేదన కలిగించే అంశం అని తెలిపారు. శనివారం లోపు బాధిత కుటుంబాలకు నష్టపరిహారం ప్రకటించాలని లేని పక్షంలో బాధిత కుటుంబ సభ్యులతో కలిసి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరిస్తూ, పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని రాయవరం మండల తహశీల్దార్ బి.వి భాస్కర రావు కు ప్రజా సంఘాలు నాయకులు అందించారు. ఈ కార్యక్రమంలో ఐ.ఎఫ్.టీ.యూ నాయకులు చింతా రాజా రెడ్డి, మండపేట ముస్లిం (జెఏసీ) నాయకులు ఎమ్.డీ కరీం, ఎం.డీ షఫీ, బీ.సీ సెల్ (జెఏసీ) నాయకులు ఎం.గణపతి రావు, రాయవరం గ్రామ సర్పంచ్ చంద్రమళ్ళ రామకృష్ణ, లంక రాజేష్, సీపీఐ నాయకులు చిర్రా జోజీ బాబు, పీ.డీ.ఎస్.యూ నాయకులు కె.నవీన్, లంక పుత్రయ్య తదితరులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వర విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు

### భక్తుల సహకారాలతో భారీ అన్న సమారాధన



**కోరుకొండ, విశ్వం వాయస్ న్యూస్ :** మండలంలోని బూరుగుపూడి గ్రామంలో శ్రీ వల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ట మహెూత్సవాలు వేద పండితులు బ్రహ్మశ్రీ కాళ్లకూరి దుర్గాప్రసాద్ శర్మ, మానేపల్లి సుబ్బారావు శర్మ వేదమంత్రోచరణలతో అశేష భక్తుల నామసవరణలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. బుధవారం పంచ దిన ఆధ్యాత్మిక మహెూత్సవంలో భాగంగా నాగబంధ, ధ్వజ శిఖర, యంత్ర ప్రతిష్ట వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాల అనంతరం శ్రీ వల్లి దేవసేన సమీత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర విగ్రహ ప్రతిష్ట మహెూత్సవలను యావన మందులు భక్తులు కనులారా తిలకించి, స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వైఎస్ఆర్సిపి రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు రాజానగరం మాజీ శాసనసభ్యులు జక్కంపూడి రాజా, విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షులు బిజెపి నాయకులు కంబాల శ్రీనివాసరావు శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర విగ్రహ ప్రతిష్ట మహెూత్సవం కనులారా తిలకించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కంటే వినయ్ తేజ సువర్ణ సుప్రియ దంపతులు, నందే సూరిబాబు గంగాభవాని దంపతులు ప్రతిష్ట మహెూత్సవంలో పాల్గొన్నారు. అనంతరం భక్తుల నహాయ సహకారాలతో భారీ అన్న సమారాధన నిర్వహించారు. సుదీర్ఘ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున విచ్చేసి స్వామివారిని దర్శించుకుని, అన్న సమారాధనలో పాల్గొన్నారు.

# కోనసీమ తిరుపతి సూర్య, చంద్రప్రభ వాహనాలపై శ్రీవారి విహారం



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వర స్వామి వారి 13వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరవ రోజైన బుధవారం స్వామివారు సూర్య, చంద్రప్రభ వాహనాలపై ఊరేగి భక్తులకు కనువిందు చేశారు. ఉదయం సుప్రభాత సేవతో మొదలైన కార్యక్రమాలు నవనీత హారతి, విష్వక్సేనపూజ, పుణ్యాహవచనము, పారమాత్మిక ఉపనిషత్ పూర్వక అష్టోత్తర శతకలశాభిషేకం, ప్రధాన హెూమములు, దిగ్దేవతా బలిహరణ, నీరాజన మంత్రపుష్పములు, తీర్థ ప్రసాద వితరణ జరిపారు.శ్రీ కృష్ణ అలంకరణలో సూర్యప్రభ వాహనంపై స్వామివారు మాడ వీధుల్లో ఊరేగారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం స్వస్తి వచనము, ప్రధాన హెూమములు, నవగ్రహ హెూమములు, శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర మూల మంత్ర పూర్వక శ్రీ వేంకటేశ్వర హెూమము,దిగ్దేవతా బలిహరణ, నీరాజన మంత్రపుష్పములు, తీర్థ ప్రసాద వితరణ జరిపారు. అనంతరం మోహినీఅలంకరణలో చంద్రప్రభ వాహనంపై స్వామివారు పుర వీధుల్లో ఊరేగారు. ఉదయం నుంచి జరిగిన కార్యక్రమాల్లో ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్యచక్రధర్ రావు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## మీ ప్రాంతాల్లో మీరే మోదీ

న్యూఢిల్లీ:

బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లకు చేరువయ్యేందుకు అనుసరించాల్సిన వ్యూహంపై ఆ రాష్ట్ర బీజేపీ బూత్ వర్కర్లకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దిశానిర్దేశం చేశారు. ప్రజలను నేరుగా కలుసుకుని ప్రభుత్వ సంక్షేమ పథకాలను తెలియజేయాలని సూచించారు. 'మేరా బూత్ సబ్సే మజబూత్' ప్రోగ్రాంలో భాగంగా 'నమో యాప్' ద్వారా ప్రధానమంత్రి పార్టీ కార్యకర్తలతో బుధవారం నాడు సంభాషించారు.

'ప్రతి కార్యకర్త తమ తమ ఏరియాల్లో మోదీనే. నా తరఫున ప్రభుత్వ పథకాలపై ప్రజలకు గ్యారెంటీ ఇవ్వండి' అని మోదీ సూచించారు. ప్రభుత్వ పథకాలు, పౌరులకు మధ్య వారధిగా కార్యకర్తలు నిలవాలన్నారు. ప్రభుత్వ పథకాలతో ప్రజలకు ఏవిధమైన లబ్ధి చేకూరుతోందో ఇంటింటికీ వెళ్లి వారికి వివరించాలని కోరారు. ఐక్య ఎన్డీయే ఈ ఎన్నికల్లో విజయాన్ని సాధించి, రాష్ట్రంలో సుపరిపాలన కొనసాగేలా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు.

'జీవికా యోజన' పథకంలో లబ్ధిదారుగా ఉన్న పూర్ణియాకు చెందిన బీజేపీ కార్యకర్త మేఘా దేవితో మోదీ మాట్లాడుతూ, మహిళా లబ్ధిదారులను కలుసుకుని ప్రభుత్వ పథకాలతో వారికి ఏ విధంగా మేలు జరుగుతుందో వివరించాలని సూచించారు. దీపావళి పండుగ వస్తున్నందున ఇంటింటికీ వెళ్లి జీఎస్టీ తగ్గింపుతో మహిళలకు ఏవిధంగా లబ్ధి చేకూరుతోందో వివరించాలని, అందుకు సంబంధించిన డేటాను ఫోన్లలో రెడీ చేసుకుని ఆయా కుటుంబాలకు షేర్ చేయాలని సూచించారు. స్థానిక మహిళా గ్రూపులను కలుసుకుని వారి నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలని, వాటిని రికార్డు చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయాలని పేర్కొన్నారు. ఈసారి బిహార్‌లో రెండుసార్లు దీపావళి రానుందని, మొదటిది అక్టోబర్ 20న అయితే రెండవది నవంబర్ 14న ఎన్డీయే సాధించబోయే విజయోత్సవమని అన్నారు. ఉమెన్ ఎంప్లాయిమెంట్ స్కీమ్ ద్వారా బిహార్‌లోని 1.2 కోట్ల మంది మహిళలకు లబ్ధి చేకూర్చామని చెప్పారు. కేంద్రం, నితీష్ కుమార్ ప్రభుత్వ హయాంలో అమలవుతున్న పథకాల లబ్ధిదారుల జాబితాను తయారు చేసుకోవాలని, సంక్షేమ పథకాల సక్సెస్ స్టోరీలతో కూడిన వీడియోలను తమతమ ఏరియాల్లోని కుటుంబాలకు షేర్ చేయాలని దిశానిర్దేశం చేశారు. ఓటింగ్‌ను పండుగలా జరుపుకోవాలని, కమ్యూనిటీ స్ఫూర్తిని పటిష్టం చేసేందుకు బూత్ టీమ్‌లు లంచ్ షేర్ చేసుకోవాలని అన్నారు. ఆర్జేడీ హయాంలోని ఆటవిక రాజ్యంలో ఎన్నో అకృత్యాలు జరిగాయని, అప్పటి తప్పిదాల పాలన, ప్రస్తుత అభివృద్ధి పాలనకు మధ్య తేడాను యువతకు తెలియజేసే ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. 'బూత్ పటిష్టంగా ఉంటే విజయం మరింత పటిష్టంగా ఉంటుంది' అంటూ కార్యకర్తలను మోదీ ఉత్సాహపరిచారు.

## నాసిరకం మందులతో ముప్పు

విషపూరిత దగ్గు మందు సేవించి మధ్యప్రదేశ్, రాజస్తాన్‌లలో పిల్లల మరణాలు సంభవించిన ఘటనతో నాణ్యత లేని మందుల గురించి దేశవ్యాప్తంగా చర్చ తెరపైకి వచ్చింది. ప్రభుత్వం ఈ ఏడాది జనవరి %–% ఆగస్టు మధ్య నిర్వహించిన నాన్%–%స్టాండర్డ్ క్వాలిటీ డ్రగ్స్ (ఎన్ఎస్‌క్యూడీ) పరీక్షల్లో 1,184 మందులు నాణ్యత లేనివిగా తేలింది. వీటిలో ట్యాబ్లెట్స్ 51%, ఇంజెక్షన్లు 18%, సిరప్స్ 11% ఉన్నాయి. నియంత్రణ సంస్థలు నిర్దేశించినట్టుగా నాణ్య త, భద్రత, సామర్థ్య ప్రమాణాలు లేని ఔషధాలను ఎన్ఎస్‌క్యూడీగా పరిగణిస్తారు. 2019తో పోలిస్తే ఎన్ఎస్‌క్యూడీ పరీక్షల్లో నాసిరకమైనవని తేలిన ఔషధాల సంఖ్య దాదాపు మూడింతలు కావడం ఆందోళన కలిగించే అంశం. మనదేశంలో తయారైన దగ్గు సిరప్స్ 2023లో గాంబియాలో డజన్ల కొద్దీ పిల్లల మరణాలకు కారణమై వివాదానికి దారితీసింది.

కేంద్ర ప్రభుత్వం ఈ ఆగస్టులో లోక్‌సభలో వెల్లడించిన వివరాల ప్రకారం.. గత 5 ఏళ్లలో నాణ్యత లేని ఔషధాల సంఖ్య పెరుగుతోంది. 2024%–%25లో మొత్తం 1.16 లక్షలకుపైగా ఔషధాల శాంపిళ్లు పరీక్షించగా.. 3,104 నాణ్యత లేనివిగా తేలాయి. నకిలీ / కల్తీగా గుర్తించినవి 245. కల్తీ మందులపై పెడుతున్న కేసులు కూడా ఏటా పెరుగుతున్నాయి. నకిలీ మందులను అరికట్టడానికి.. కేంద్ర ప్రభుత్వం బార్ కోడ్ / క్యూఆర్ కోడ్ విధానాన్ని కూడా ప్రవేశపెట్టింది. ఔషధాల లేబుళ్లు లేదా వీలున్న చోట బార్ కోడ్ ద్వారా.. ఆ ఔషధానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియజేయాలి.

**పశ్చిమ బెంగాల్‌లో ఎక్కువ**

కేంద్ర ఔషధ ప్రమాణాల నియంత్రణ సంస్థ (సీడీఎస్‌సీఓ) నివేదిక ప్రకారం.. గత మూడేళ్లలో నాణ్యత లేని మందులకు సంబంధించి కేసులు అత్యధికంగా నమోదవుతున్న రాష్ట్రం పశ్చిమబెంగాల్. అత్యధిక కేసులు (శాతాల్లో) నమోదైన రాష్ట్రాలు..

## మళ్లీ భగ్గుమన్న పాక్-అఫ్ఘాన్ సరిహద్దు



న్యూఢిల్లీ

అఫ్ఘానిస్థాన్‌లోని తాలిబన్ ప్రభుత్వానికి, పాకిస్థాన్ మధ్య మళ్లీ ఉద్రిక్తతలు పెరిగాయి. సరిహద్దుల్లో ఇరుదేశాల బలగాల మధ్య బుధవారం భీకర ఘర్షణలు చోటుచేసుకున్నాయి. తెల్లవారుజామున జరిగిన కాల్పుల పోరులో డజన్ల సంఖ్యలో మరణాలు చోటుచేసుకోగా పలువురు గాయపడ్డారు. తాలిబన్ సైనిక స్థావరాలపై దాడి చేసేందుకు పాక్ సైన్యం ఉపయోగించిన యుద్ధ ట్యాంకును స్వాధీనం చేసుకున్న అఫ్ఘాన్ సైన్యం పాక్ సైనిక ఔట్‌పోస్టుపై దాడి చేసినట్లు వార్తలు వచ్చాయి. పాకిస్థాన్‌లోని చమన్ జిల్లా, అఫ్ఘాన్‌లోని బోల్డక్ జిల్లాలో ఉభయ దేశాలకు చెందిన సైనిక దళాలు పరస్పరం దాడులకు తెగపడ్డాయి. మంగళవారం అర్ధరాత్రి నుంచి జరుగుతున్న కాల్పులలో 58 మంది పాక్ సైనికులు మరణించినట్లు అఫ్గాన్ వెల్లడించగా పాక్ మాత్రం 200 మందికిపైగా అఫ్ఘాన్ సైనికులు మరణించారని, తమ సైనికులు 23 మంది మరణించారని తెలిపింది. అఫ్ఘాన్‌లోని కాందహార్ ప్రావిన్సు, పాక్‌లోని బలోచిస్థాన్ ప్రాంతం మధ్య ఉన్న కీలక సరిహద్దు జిల్లా స్పిన్ బోల్డక్‌లో పాక్ సైన్యం జరిపిన దాడులలో 12 మంది మరణించగా 100 మందికిపైగా గాయపడ్డారని అఫ్ఘాన్‌కు చెందిన తాలిబన్ తెలిపింది. కాగా, కాబుల్‌లోని తెహ్రీక్–ఎ–తాలిబన్ పాకిస్థాన్(టీటీపీ) శిబిరాలపై పాక్ గత వారం దాడులు చేయడంతో రెండు దేశాల మధ్య ఘర్షణలు మొదలయ్యాయి. తాలిబన్ విదేశాంగ మంత్రి భారత్‌ను తొలిసారి సందర్శించి భారత్‌తో దౌత్య సంబంధాలను పునరుద్ధరించుకున్న తరుణంలో అఫ్ఘాన్‌పై పాక్ దాడులు జరపడం గమనార్హం

**ఘర్షణలకు తాత్కాలికంగా తెర**

అఫ్ఘాన్, పాకిస్థాన్ మధ్య ఘర్షణలకు తాత్కాలికంగా తెరపడింది. 48 గంటల పాటు కాల్పుల విరమణ పాటించాలని రెండు దేశాలు నిర్ణయించాయి. తాజా ఘర్షణలతో రెండు దేశాల సరిహద్దుల వద్ద ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకోవడంతో పరిస్థితిని చక్కదిద్దేందుకు పాక్ చర్చల ప్రక్రియ కోసం ప్రయత్నాలు ప్రారంభించింది. ఇందుకు తాత్కాలికంగా 48 గంటల కాల్పుల విరమణ ఒప్పందాన్ని చేసుకున్నట్లు పాకిస్థాన్ విదేశాంగ శాఖ ప్రకటించింది. ఒకనాటి మిత్రులైన పాక్, అఫ్ఘాన్ మధ్య ఘర్షణలు తీవ్రరూపం దాల్చడం, చర్చల కోసం పాక్ మంత్రులు తమ దేశంలోకి ప్రవేశించడానికి అఫ్ఘాన్ అనుమతించకపోవడంతో మధ్యవర్తిత్వం వహించాలని పాక్ ప్రభుత్వం ఖతార్, సౌదీ అరేబియాకు అంతకుముందు విజ్ఞప్తి చేసింది.

# భారత్‌పై పనిచేయని టారిఫ్

న్యూఢిల్లీ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్ మీద 50 శాతం టారిఫ్ అమలు చేస్తున్నారు. అయితే ఆయన విధించిన టారిఫ్‌లు భారతదేశ జీడీపీ వృద్ధిపై ఎలాంటి ప్రభావం చూపడం లేదు. అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి భారతదేశ స్థూల దేశీయ ఉత్పత్తి వృద్ధి రేటు అంచనాను 6.6 శాతానికి పెంచింది. ఇంతకుముందు ఇది 6.4 శాతం ఉంటుందని అంచనా వేశారు. మొదటి త్రైమాసికంలో బలమైన ఆర్థిక వృద్ధితో ఈ అంచనా పెరిగింది, దాంతో అమెరికా విధిస్తున్న టారిఫ్‌లను ఎదుర్కొని భారత్ మరింత ముందుకు వెళుతుందని స్పష్టమైంది.అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ తన తాజా ప్రపంచ ఆర్థిక నివేదికలో 2026–27 సంవత్సరానికి వృద్ధి రేటు అంచనాను 0.2 శాతం తగ్గించి 6.2 శాతానికి పరిమితం చేసింది. 'జూలై ప్రపంచ ఆర్థిక నవీకరణ నివేదికతో పోలిస్తే, 2025 వృద్ధి రేటు అంచనా పెరిగింది' అని తన నివేదికలో ఐఎంఎఫ్ పేర్కొంది.నివేదిక ప్రకారం 'మొదటి త్రైమాసికంలో బలమైన వృద్ధి చూపింది. ఆగస్టు నుంచి భారతదేశం నుంచి దిగుమతులపై అమెరికా సుంకాలు పెంచింది. మొదట 25 శాతం టారిఫ్ విధించారు ట్రంప్. ఆపై రష్యా నుంచి ముడి చమురు కొనుగోలు ఆపలేదన్న కారణంగా మరో 25 శాతం టారిఫ్ విధించారు. దీనితో పాటు 2026 ఆర్థిక వృద్ధి రేటు కాస్త తగ్గుతుందని' అంచనా వేసింది.ఏప్రిల్–జూన్ మధ్య భారతదేశ ఆర్థిక వృద్ధి రేటు 7.8 శాతంగా ఉంది. ఇది ఐదు త్రైమాసికాల్లో అత్యధికం. ఈ నెల ప్రారంభంలో ప్రపంచ బ్యాంకు సైతం ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి భారతదేశ ఉఆఖ వృద్ధి రేటును 6.3 శాతం నుంచి 6.5 శాతానికి పెరుగుతుందని అంచనా



వేసింది. భారత్ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా కొనసాగుతుందని కూడా పేర్కొంది. జూలైలో భారతదేశ ఆర్థిక వృద్ధి అంచనాను సవరించింది. 2025, 2026 రెండింటికీ 6.4 శాతానికి పెంచింది. అదే సమయంలో ఏప్రిల్ 2025 ప్రపంచ ఆర్థిక విధానంలో ఆర్థిక వృద్ధి రేటు 2025కి 6.2 శాతం, 2026కి 6.3 శాతం ఉంటుందని అంచనా వేసింది. ద్రవ్య నిధి సంస్థ ప్రపంచ వృద్ధి రేటు 2024లో 3.3 శాతం నుండి 2025లో 3.2 శాతానికి తగ్గుతుందని.. 2026లో 3.1 శాతానికి తగ్గుతుందని అంచనా వేసింది. జూలై ప్రపంచ ఆర్థిక దృక్పథ నివేదికలో వ్యక్తం చేసిన అంచనా కంటే ఎక్కువ.మొత్తంమీద అక్టోబర్ 2024 ప్రపంచ ఆర్థిక దృక్పథంలో విధాన మార్పులకు ముందు చేసిన అంచనా కంటే ఇది 0.2 శాతం తక్కువ. ద్రవ్య నిధి సంస్థ అభివృద్ధి చెందుతున్న మార్కెట్లు, అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల వృద్ధి రేటు 2024లో 4.3 శాతం ఉండగా, 2025లో 4.2 శాతానికి, 2026లో నాలుగు శాతానికి దిగొస్తుంది అంచనా వేసింది

**భారత్ సాయం అవసరం**

ప్రపంచంలోనే అరుదైన ఖనిజాల విషయంలో చైనా పోకడను అమెరికా తప్పుబట్టింది. చైనాలో దొరికే ఈ అరుదైన ఖనిజాలపై అక్కడి ప్రభుత్వం కట్టడిచేస్తోందని, తద్వారా ప్రపంచ దేశాలపై ఆధిపత్యం చెలాయించేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించింది. ఈ ధోరణిని అమెరికా సహించబోదని ఆ దేశ ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ స్పష్టం చేశారు. ఈ విషయంలో చైనాను ఎదుర్కోవాలంటే తమకు భారత్ సాహాయం కావాల్సిందేనని ఆయన పేర్కొన్నారు. రష్యా నుంచి చమురు దిగుమతుల వ్యవహారంలో భారత్ పై అమెరికా భారీగా పన్నులు విధించిన విషయం తెలిసిందే. అయితే, చైనా విషయంలో మాత్రం భారత్ తమకు సాహాయం చేయాలని అమెరికా కోరడం గమనార్హం.అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ ఇటీవల ఫాక్స్ న్యూస్ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. ప్రపంచంలో మరెక్కడా లభించని అరుదైన ఖనిజాల ఎగుమతిపై చైనా ఇటీవల నియంత్రణ విధించిందని చెప్పారు. విదేశీ కంపెనీలు వాటిని దిగుమతి చేసుకోవాలంటే చైనా ప్రభుత్వ అనుమతి తీసుకోవాలనే షరతు విధించిం దన్నారు. ఇది ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ప్రత్యక్ష సవాలేనని బీజింగ్‌పై ఆయన విమర్శలు గుప్పించారు. ఇది చైనాకు, ప్రపంచ దేశాలకు మధ్య నెలకొన్న పోటీ అని ప్రపంచ పం పిణీ వ్యవస్థలపై చైనా గురిపెట్టిందని ఆయన మండిపడ్డారు. బీజింగ్ దూకుడును అమెరికా అడ్డుకుంటుందన్నారు. ఇందు కోసం భారత్, ఐరోపా దేశాల మద్దతు కావాలని వెల్లడిం చారు. అమెరికా ప్రపంచ శాంతిని కోరుకుంటుంటే.. చైనా ఆర్థిక యుద్ధం చేస్తోందని స్కాట్ బెసెంట్ దుయ్యబట్టారు.

# వ్యూహకర్త వ్యూహం.. సొంతింట్లో క్లిక్ అవుతుందా?

అనేక పార్టీలకు ఎన్నికల వ్యూహకర్తగా వ్యవహరించిన ప్రశాంత్ కిశోర్ దేశ రాజకీయాల్లో తనదైన ముద్ర వేశారు. సర్వేలు, సూచనలు, తనదైన వ్యూహాలతో పలు పార్టీల విజయాల్లో కీలకంగా వ్యవహరించారు. ఇటీవల ప్రత్యక్ష రాజకీయాల్లోకి దిగిన ఆయన.. రాజకీయ పార్టీ ఏర్పాటు చేసి స్వరాష్ట్రం బిహార్‌లో పోటీకి సిద్ధమయ్యారు. పార్టీ విజయం కోసం వ్యక్తిగత పోటీకి దూరమయ్యారు. ఎన్నికల విషయంలో మునుపటి అనుభవం, పుట్టిన నేలపై అభిమానంతో ముందుకెళ్తున్నారు. ఈ ఎన్నికల్లో పీకే గేమ్ ఛేంజర్ అవుతారా? లేదా? అనే విషయం ఆసక్తిగా మారింది.

**ఆ పార్టీలదే హవా..!**

దశాబ్దాలుగా బిహార్‌లో కొన్ని పార్టీల హవానే కొనసాగుతోం ది. లాలూ కుటుంబం దాదాపు పదమూడేళ్లు పాలించగా.. నీతీశ్ కుమార్ 18 ఏళ్లుగా అధికారంలో ఉన్నారు. ఇప్పటికీ అభివృద్ధి విషయంలో బిహార్ వెనుకంజలో ఉందనే నివేదికలు ఉన్నాయి. నిరుద్యోగం, వలసలు, అభివృద్ధికి సంబంధించి పార్టీలవి రొటీన్ ప్రకటనలే. ఇటువంటి సమయంలో సరికొత్త రాజకీయ పంథాతో బిహారీల్లో ఆశలు చిగురించే ప్రయత్నం చేస్తున్నారు పీకే. కులం, కుటుంబ రాజకీయాల నుంచి రాష్ట్రానికి విముక్తి కలిగించాల్సిన అవసరం ఉందని పిలుపు నిస్తున్నారు. ఊరూరా



పాదయాత్రలు చేస్తూ.. నిరుద్యోగం, సుపరిపాలన, సామాజిక న్యాయం, యువత, మహిళా సాధికా రత వంటి అంశాలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నా రు. ఇటీవల తన వ్యూహాలకు మరింత పదునుపెట్టిన ఆయన.. డిప్యూటీ సీఎం సహా అగ్రనేతల అవినీతిపైనా తీవ్ర ఆరోపణలు చేసి రాజకీయాలను మరింత వేడెక్కించారు.

**పాదయాత్రతో మొదలుపెట్టి..**

ఎన్నికల వ్యూహకర్త సేవలకు స్వస్తి పలికినట్లు ప్రకటించిన పీకే.. రెండు, మూడేళ్ల క్రితం నుంచే బిహార్‌పై శ్రద్ధ పెట్టారు. 2022లో పశ్చిమ చంపారన్ జిల్లాలో పాదయాత్ర చేపట్టి.. వందల కి.మీ తిరిగి క్షేత్రస్థాయి పరిస్థితులను కళ్లారా చూసే ప్రయత్నం చేశారు. అత్యంత పేద, బలహీన రాష్ట్రంగా ఉన్న బిహార్ రూపురేఖలను మార్చాలని నిశ్చయించుకున్నానని అప్పట్లో చెప్పారు. ఏడాది క్రితం.. (అక్టోబర్ 2, 2024) జన్‌సురాజ్ పార్టీని స్థాపించారు. సామాజిక వేత్తలు, మేధావులు, మాజీ ఉన్నతాధికారులను ఏకం చేసే ప్రయత్నం చేశారు. అధికార, విపక్షాల కంటే ముందుగానే అభ్యర్థుల జాబితా ప్రకటించారు. వెనుకబడిన తరగతులు, ముస్లిం, షెడ్యూల్ కులాల వారికి ప్రాధాన్యం కల్పించారు. ఎటువంటి రాజకీయ నేపథ్యం, ఎలాంటి నేర చరిత్రలేని కొత్త ముఖాలనూ పరిచయం చేశారు. స్థానిక పార్టీలు సామాజిక వర్గాల చుట్టూనే ఓటుబ్యాంకు రాజకీయాలు చేస్తుంటాయి. యాదవ్ (14శాతం), కుష్వాహ్ (4.2 శాతం), బ్రాహ్మణులు (3.6శాతం), కుర్మీ, భూమిహార్లు ప్రధాన కులాలుగా ఉన్నాయి. రాష్ట్ర రాజకీయాలు కొందరి చేతుల్లోనే బందీగా ఉన్నాయని ఆరోపిస్తున్న పీకే.. వంశపారపర్య రాజకీయాలు, మాఫియా, పార్టీలు మారే అవినీతిపరులు, నేరస్థులు రాష్ట్రానికి శాపంగా మారారని చెబుతున్నారు.

# ఉత్తరాదిలో పెరుగుతున్న పారిశ్రామిక ప్రముఖులు

ముంబై

భారత దేశంలో 2025 సంవత్సరానికి సంపన్నుల జాబితా విడుదలైంది. ఏటా ఫోర్బ్స్ సంస్థ ఈ జాబితాను ప్రకటిస్తుంది.గత కొన్నేళ్లుగా ఈ జాబితాలో ఇద్దరు టాప్ 2లో ఉంటున్నారు. ఇక టాప్ 10లో ఉత్తర భారతీయుల ఆధిపత్యం కొనసాగుతోంది. ముకేశ్ అంబానీ, గౌతమ్ అదానీ వంటి ఉత్తరాది పారిశ్రామిక ప్రముఖులు అగ్రస్థానాల్లో ఉన్నారు. ఇంధన,న్ఫ్రాస్ట్రక్చర్, స్టీల్, టెలికామ్ వంటి రంగాల్లో ఈ వ్యాపారులు దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర వహిస్తున్నారు. ఈ ముగ్గురు వ్యాపారులు కలిపి లక్షల కోట్లు విలువ చేసే సంపదను నిర్వహిస్తున్నారు. బిలియనీర్ జాబితాలో మూడో స్థానంలో సావిత్రి జిందాల్, నాలుగో స్థానంలో సునీల్ మిట్టల్, ఐదో స్థానంలో శివ్ నాదార్ వంటి ప్రముఖులు ఉన్నారు.సంపన్నుల జాబితాలో దక్షిణ భారత వ్యాపారులు ఒకరిద్దరే ఉంటున్నారు. టాప్ 20 స్థానాల్లో ఒక్క దక్షిణ భారతీయుడు కూడా లేడు. దీనికి కారణాలు పరిశ్రమలు పరిమితి, పెట్టుబడి వాతావరణం, వ్యవహార సరళి భిన్నత్వం. ముఖ్యంగా పెద్ద పారిశ్రామిక, ఇంధన రంగాలు ఉత్తరాది ప్రాంతాల్లో ఎక్కువగా ఉన్నాయి. దక్షిణాది బ్రాండ్‌లు ఐటీ, మెడికల్, వినోద రంగాల్లో విజయవంతమవుతున్నప్పటికీ, విస్తృత ఆర్థిక శక్తి నిలిచేందుకు పెద్ద పారిశ్రామిక పెట్టుబడులు తక్కువగా ఉండటం వలన ఈ పరిస్థితి నెలకొంది.అయితే ఐటీ హబ్స్, స్టార్టప్‌లు, హెల్త్‌కేర్ వంటి రంగాల్లో దక్షిణాది వ్యాపారులు పెద్ద పురోభాగాన్ని తీసుకున్నారు. కొత్త ఆవిష్కరణలు, డిజిటల్ సేవలు, సాంకేతిక రంగాల్లో



వేగంగా ప్రగతిని సాధిస్తున్నారు. ఈ రంగాల్లో పెరుగుదలతో సమీప భవిష్యత్తులో వారి ప్రాధాన్యత మరింత పెరుగుతుందని అంచనా వేస్తున్నారు.ఉత్తర భారత దేశం ఒక వైపు అగ్రి?ఇండస్ట్రీ, ఎనర్జీ,న్ఫ్రాస్ట్రక్చర్ రంగాల్లో గొప్ప నిపుణత కలిగి ఉంది. కొన్ని రాష్ట్రాలు (ఉత్తర ప్రదేశ్, మహారాష్ట్ర, హిమాచల్) భారీ పారిశ్రామిక కేంద్రాలు. రిలయన్స్, అద్దానీ గ్రూప్ వంటి దిగ్గజ సంస్థల కేంద్రాలు ఈ ప్రాంతంలో ఉండటం ఈ ప్రాంత ఆర్థిక శక్తిని ప్రతిబింబిస్తుంది. టెలికామ్యునికేషన్, బటాయిల్, స్టీల్, మైనింగ్ రంగాలు ఉత్తరాదిలో బలంగా ఉన్నాయి.పశ్చిమ భారత ప్రాంతాలు (గుజరాత్, మహారాష్ట్ర) వినియోగ వస్త్రాలు, రసాయనాలు, ఆటోమోటివ్, పవర్ ఉత్పత్తి రంగాల్లో ఆశ్చర్యకరమైన అభివద్ధి సాధించాయి. గుజరాత్ వాణిజ్య కేంద్రం, మహారాష్ట్ర ముంబై ఫైనాన్షియల్ హబ్‌గా ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ప్రముఖ స్థానం దక్కించుకున్నాయి.ఇస్టర్డ్ ప్రాంతం (పశ్చిమ బెంగాల్, ఒడిశా, భువనేశ్వర్) ఇంధన, సహజ వనరుల సేకరణ, తైవతి ప్రాసెసింగ్ రంగాల్లో విశేష ప్రగతి సాధించి, భారతదేశ ఆర్థిక విస్తృతిని విస్తరించడంలో సహకరిస్తుంది. ఇక్కడ పారిశ్రామిక సంస్థల పునఃసంస్కరణలు, ఆధునిక దిగుమతులు ప్రాప్తి చెందుతున్నాయి.భారత ఆర్థిక రంగం వివిధ రాష్ట్రాల్లో విభిన్న రంగాలు అధిపతులుగా నిలుస్తూ, దేశ అభివృద్ధికి దోహదపడుతోంది. ఉత్తరాది పరిశ్రమలు, పశ్చిమాది వాణిజ్యం, దక్షిణాది సాంకేతికత, ఇటీవలి స్టార్టప్ సంస్కృతులు భారత ఆర్థిక వృద్ధికి భాగస్వామ్యమవుతున్నాయి. 2025లో భారతదేశపు ధనవంతుల సంపద మొత్తం 1 ట్రిలియన్ డాలర్ల చుట్టూ ఉండగా, గత సంవత్సరం తో పోలిస్తే 9% తక్కువగా నమోదైంది. ఈ తగ్గుదల స్టాక్ మార్కెట్ చిరకాల ఒత్తిళ్లు కారణంగా కలిగింది. ఐటీ, ఇంధన, వాణిజ్య రంగాల్లో రూపాయిలో మిశ్రమ ప్రభావాలు కనిపిస్తున్నాయి.

బిజినెస్ వాయిస్

## రూపాయి చారిత్రాత్మక పతనం



అంతర్జాతీయ ద్రవ్య మార్కె ట్‌లో రూపాయి విలువ ఆల్‌టైం కనిష్ట స్థాయికి పడి పోయింది. రూపాయి చరిత్ర లోనే ఎప్పుడూ లేని స్థాయిలో ఇంట్రాడేలో 88. 81కు పతన మయ్యింది. భారత్ పై అమెరికా వేసిన భారీ టారి ఫ్‌లతో దేశీయ ఎగుమతులపై ప్రతికూల ప్రభావం నెలకొనడంతో రూపా యిపై ఒత్తిడి నెలకొందని నిపుణులు పేర్కొన్నారు. మరోవైపు డాలర్ల కొనుగోళ్లకు దిగుమతిదారులు మొగ్గు చూపడం, రూపాయి పతనాన్ని కట్టడి చేయడంలో మోడీ సర్కార్ విఫలం కావడం, స్టాక్ మార్కెట్లలో ఒత్తిడి, ఎఫ్‌ఐఐలు తరలిపోవడం తదితర పరిణా మాలు దేశీయ కరెన్సీని రికార్డ్ కనిష్టానికి నెట్టాయి. ఈ నేపథ్యంలోనే మంగళవారం డాలర్‌తో రూపాయి మారకం విలువ మరో 12 పైసలు పతనమై 88.80కి దిగజారింది. ఫారెక్స్ మార్కెట్‌లో ఉదయం 88.73 వద్ద ప్రారంభమైన రూపాయి విలువ ఓ దశలో 88.81 అత్యల్ప స్థాయికి పడిపోయింది. ఇంత క్రితం సెప్టెంబర్ 30న 88.80 కనిష్ట స్థాయిని తాకింది. ఆ తర్వాత ఈ స్థాయిలో పడిపో వడం ఇదే తొలిసారి. రూపాయి విలువ పతనం అంతర్జాతీయ మార్కెట్‌లో దిగుమ తులను భారం చేయనున్నాయి. మరోవైపు విదేశీ చెల్లింపుల భారం పెరిగిపోనుంది.



## మళ్లీ పెరిగిన బంగారం, వెండి ధరలు..

మన ఇంట్లో ఏ చిన్న శుభకార్యం జరిగినా బంగారం కొనుగోలు చేస్తుంటాము. ఇక అందులోనూ మన దేశంలో గోల్డ్‌కి మరింత పాపులారిటీ ఎక్కువ. ఇక ఈ మధ్య కాలంలో బంగారం ధరల్లో హెచ్చు తగ్గులు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఒకరోజు రేట్లు తగ్గి కాస్త ఊరటనిస్తుంటే మరోరోజు పెరిగి అమ్మో అనిపిస్తున్నాయి. అయితే గత ఇరవై రోజులుగా పెరుగుతూ వస్తున్న గోల్డ్ రేట్స్ నేడు కూడా భారీగా పెరిగి బిగ్ షాకిచ్చాయి. ఇక ప్రధాన నగరాలైన హైదరాబాద్, విజయవాడలో నిన్న రూ.1,17,650 ఉన్న 22 క్యారెట్ల బంగారం ధరపై నేడు రూ.500 పెరిగి రూ.1,18,150గా ఉంది. అలాగే నిన్న రూ.1,28,350 ఉన్న 24 క్యారెట్ల బంగారం ధరపై నేడు రూ.540 పెరిగి రూ.1,28,

# నిరాశపర్చిన టెక్ మహీంద్రా..
# క్యూ2లో తగ్గిన లాభం




ప్రముఖ ఐటీ సేవల సంస్థల్లో ఒకటైన టెక్ మహీంద్రా నిరాశపరిచింది. ఈ ఆర్థిక సంవత్సరం 2025-26 రెండో త్రైమాసికం (జూలై- సెప్టెంబర్)లో అంచనాలను అందుకో లేక పోయింది. మంగళవారం స్టాక్ మార్కెట్లు ముగిసిన తర్వాత ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. ఇయర్ ఆన్ ఇయర్ ప్రాతిపదికన రెండో త్రైమాసికంలో టెక్ మహీంద్రా నికర లాభం రూ.1194 కోట్లుగా నమోదు చేసింది. అయితే, గత ఏడాది ఇదే త్రైమాసికంలో వచ్చిన కంపెనీ నికర లాభం రూ.1250 కోట్లతో పోలిస్తే 4.4 శాతం మేర పడిపోయింది. ప్రాఫిట్ ఆఫ్టర్ ట్యాక్సును కంపెనీ ఓనర్లకు ఆపాదించింది. ఇక జూలై- సెప్టెంబర్ త్రైమాసికంలో కంపెనీ ఆపరేషన్స్ రెవెన్యూ రూ.13,995 కోట్లుగా నమోదు చేసింది. గత ఆర్థిక సంవత్సరం (2024-25)లోని రెండో త్రైమాసికంలో కంపెనీ ఆదాయం రూ.13,313 కోట్లతో పోలిస్తే ఈ సారి ఆదాయం 5.1 శాతం మేర పెరిగినట్లు తెలిపింది. ఆర్థిక ఫలితాల క్రమంలోనే తమ షేర్ హెూల్డర్లకు శుభవార్త అందించింది. ఈ ఆర్థిక సంవత్సరం 2025-26కు గానూ మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. ఒక్కో షేరుకు రూ.15 చొప్పున డివిడెండ్ చెల్లిస్తామని వెల్లడించింది. ఇందుకు సంబంధించిన రికార్డ్ తేదీని అక్టోబర్ 21, 2025గా నిర్ణయించినట్లు తెలిపింది. ఆలోపు షేర్లు కొనుగోలు చేసి ఉన్న వారికి డివిడెండ్ పొందేందుకు అర్హత లభిస్తుంది. ఇక త్రైమాసికాల ప్రాదిపదికన చూసుకుంటే టెక్ మహీంద్రా నికర లాభం ఈ ఏడాది తొలి త్రైమాసికం (ఏప్రిల్- జూన్)లోని రూ.1141 కోట్లతో పోలిస్తే 4.7 శాతం పెరిగింది. ఇక కంపెనీ ఆదాయం 4.8 శాతం పెరిగింది. ఇక కంపెనీ ఎర్నింగ్స్ బిఫోర్ ఇంట్రెస్ట్ అండ్ ట్యాక్సెస్ రూ.1699 కోట్ల వద్ద ఉంది. ఇక క్వార్టర్ టూ క్వార్టర్ చూస్తే 15 శాతం, ఇయర్ ఆన్ ఇయర్ చూస్తే 32.7 శాతం మేర పెరిగింది.

# మరోసారి భారీగా లేఆఫ్‌లకు సిద్ధమైన అమెజాన్!




ప్రముఖ ఇ-కామర్స్ సంస్థ అమెజాన్ మరోసారి పెద్దఎత్తున ఉద్యోగులపై వేటు వేసేందుకు సిద్ధమైంది. తాజా రౌండ్‌లో హెచ్‌ఆర్ (మానవ వనరుల విభాగం)లో 15 శాతం సిబ్బందిని తగ్గించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ఆ సంస్థ పేర్కొంది. ఈ విషయాన్ని ఫార్చ్యూన్ పత్రిక తన కథనంలో వెల్లడించింది. ఆ కథనం ప్రకారం.. అమెజాన్ తాజా లేఆఫ్‌లు దాని హెచ్‌ఆర్ యూనిట్‌లో అత్యధికంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ కోతలు మరిన్ని విభాగాల్లోని ఉద్యోగులపై కూడా ప్రభావం చూపనుంది. ఈ లేఆఫ్‌లు ఎప్పటినుంచి ఉంటాయి, దీని ప్రభావం ఎంతమందిపై ఉంటుంది అనేదానిపై స్పష్టత రావాల్సి ఉంది. కంపెనీ పునర్వ్యవస్థీక రణలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అమెజాన్ ప్రతినిధి కెల్లీ నాంటెల్ తాజా కోతలపై స్పందించేం దుకు నిరాకరించారు. కృత్రిమమేధను అందిపుచ్చుకోవడంతో పాటు క్లౌడ్ కార్యకలాపాలకు అమెజాన్ బిలియన్ల కుమ్మరిస్తుంది. ఈ ఏడాది మూలధన పెట్టుబడుల్లో భాగంగా 100 బిలియన్ డాలర్లకు పైగా ఖర్చు చేయాలని నిర్ణయించుకుంది. దానిలో ఎక్కువ భాగం తరువాతి తరం డేటా సెంటర్‌లను నిర్మించేందుకు కేటాయిం చింది. అమెజాన్ సీఈవో యాండీ జెస్సీ బాధ్యతలు స్వీకరించినప్పటినుంచి లేఆఫ్‌ల పర్వం కొనసాగుతూనే ఉంది. కంపెనీ పునరుద్ధరణ చర్యల్లో భాగంగా అనేకమందిని ఇంటికి పంపుతున్నారు. 2022-23లో ఏకంగా 27 వేల మంది ఉద్యోగులను ఈ సంస్థ తొలగించింది. ప్రస్తుతం ఉన్నది ఏఐ శకం అని జెస్సీ పలుమార్లు పేర్కొన్నారు. ప్రతి ఉద్యోగి దీన్ని అందిపుచ్చు కోవాలని పిలుపునిచ్చారు. ఏఐ సామర్థ్యాన్ని పెంచుకోవడం ద్వారా కొనుగోలుదారులకు మెరుగైన సేవలు అందించేందుకు సహాయపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ క్రమంలోనే ఏఐను విస్తృతం చేయడం ద్వారా.. ఉద్యోగులను కోల్పోవాల్సి ఉంటుందనే విషయాన్ని కూడా ఆయన ప్రస్తావించారు.

# రెండో స్థానంలోకి దూసుకువచ్చిన పాక్..
## టీమిండియా ఏ ప్లేస్‌లో ఉందంటే?

ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ 2025-27 సీజన్‌లో పాకిస్తాన్ శుభారంభం చేసింది. సొంతగడ్డపై సౌతాఫ్రికాతో తొలి టెస్టులో ఘన విజయం సాధించింది. స్పిన్‌కు అనుకూలించే పిచ్‌పై రాణించి.. పర్యాటక సఫారీ జట్టును 93 పరుగుల తేడాతో ఓడించింది. తద్వారా డబ్ల్యూటీసీ తాజా ఎడిషన్‌లో తొలి గెలుపు నమోదు చేసింది.

### రెండో స్థానానికి దూసుకువచ్చిన పాక్

ఈ క్రమంలో డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో పాకిస్తాన్ రెండో స్థానానికి దూసుకువచ్చింది. ఇప్పటికి ఆడిన ఒక్క మ్యాచ్‌లో గెలవడం ద్వారా.. వందకు వంద విజయ శాతం నమోదుతో ఊహించని రీతిలో టాప్-2లోకి చేరుకుంది. ఇక ఈ పట్టికలో ఆస్ట్రేలియా అగ్రస్థానంలో ఉంది.

### ఆసీస్ వందకు వంద శాతం

డబ్ల్యూటీసీ 2025-27లో ఆసీస్ జట్టు తొలుత వెస్టిండీస్‌తో తలపడింది. విండీస్ వేదికగా జరిగిన మూడు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో ఆతిథ్య జట్టును 3-0తో వైట్‌వాష్ చేసింది. ఇక మూడో స్థానంలో ఉన్న శ్రీలంక.. స్వదేశంలో బంగ్లాదేశ్‌తో జరిగిన రెండు టెస్టుల సిరీస్‌లో ఒకటి డ్రా చేసుకుని.. రెండో మ్యాచ్‌లో గెలుపొందింది. ఇక ఈ సీజన్‌లో ఇప్పటికే ఏడు మ్యాచ్‌లు పూర్తి చేసుకున్న టీమిండియా ప్రస్తుతం నాలుగో స్థానంలో కొనసాగుతోంది. తొలుత ఇంగ్లండ్ పర్యటన రూపంలో కఠిన సవాలు ఎదుర్కొన్న గిల్ సేన.. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో రెండు గెలిచి.. ఒకటి డ్రా చేసుకుంది. మరో రెండింటిలో ఇంగ్లండ్ చేతిలో ఓడిపోయింది.



తాజాగా స్వదేశంలో వెస్టిండీస్‌తో రెండు టెస్టులు ఆడిన టీమిండియా.. 2-0తో విండీస్‌ను వైట్‌వాష్ చేసింది. తద్వారా ఇప్పటి వరకు నాలుగు విజయాలు, రెండు ఓటములు, ఒక డ్రా ద్వారా 52 పాయింట్లతో నాలుగో స్థానంలో ఉంది. ఇక టీమిండియాపై రెండు టెస్టులు గెలిచిన ఇంగ్లండ్.. ఒకటి డ్రా చేసుకోవడం ద్వారా మొత్తంగా 26 పాయింట్లతో టాప్-5లో నిలిచింది.

### ఖాతా తెరవని విండీస్

కాగా ఈ సీజన్‌లో ఇప్పటికి ఐదు టెస్టులు ఆడిన వెస్టిండీస్ మాత్రం ఇంత వరకు గెలుపు ఖాతా తెరవలేదు. కనీసం ఒక్క మ్యాచ్‌నైనా డ్రా కూడా చేసుకోలేకపోయింది. దీంతో సున్నా పాయింట్లతో ఎనిమిదో స్థానంలో ఉంది. ఇక ఇప్పటి వరకు న్యూజిలాండ్ డబ్ల్యూటీసీ 2025-27 ప్రయాణం మొదలుపెట్టనే లేదు. ?

### పాయింట్లు ఇలా

కాగా డబ్ల్యూటీసీ నిబంధనల ప్రకారం.. టెస్టు గెలిచిన జట్టుకు పన్నెండు పాయింట్లు వస్తాయి. ఒకవేళ ఇరుజట్ల మధ్య మ్యాచ్ డ్రా అయితే.. నాలుగు పాయింట్లు.. టై అయితే ఆరు పాయింట్లు ఇస్తారు. ఇక 2017లో తొలిసారి డబ్ల్యూటీసీ ప్రవేశపెట్టగా 2019 నాటి ఫైనల్లో న్యూజిలాండ్ టీమిండియాను ఓడించి.. మొట్టమొదటి చాంపియన్‌గా అవతరించింది. ఇక 2019-23 ఫైనల్లో ఆస్ట్రేలియా టీమిండియాపై గెలుపొంది టైటిల్ సాధించగా.. 2023-25 ఫైనల్లో సౌతాఫ్రికా ఆస్ట్రేలియాను చిత్తు చేసి ఐసీసీ గద గెలుచుకుంది. ఇ?ప్పటికి రెండుసార్లు ఫైనల్ చేరినా రన్నరప్‌తోనే సరిపెట్టుకున్న టీమిండియా.. కొత్త కెప్టెన్ శుబ్‌మన్ గిల్ సారథ్యంలోనైనా పని పూర్తి చేయాలని పట్టుదలగా ఉంది.

### పాకిస్తాన్ వర్సెస్ సౌతాఫ్రికా తొలి టెస్టు

వేదిక: గడాఫీ స్టేడియం, లాహెూర్
టాస్: పాకిస్తాన్.. తొలుత బ్యాటింగ్
పాక్ తొలి ఇన్నింగ్స్ స్కోరు: 378
సౌతాఫ్రికా తొలి ఇన్నింగ్స్ స్కోరు: 269
పాక్ రెండో ఇన్నింగ్స్ స్కోరు: 167
సౌతాఫ్రికా రెండో ఇన్నింగ్స్ స్కోరు: 183
ఫలితం: సౌతాఫ్రికాపై 93 పరుగుల తేడాతో పాక్ గెలుపు.

## వెనక్కి వచ్చేసిన స్టార్ ఆల్‌రౌండర్..
## శివం దూబేకు ఏమైంది?



**ముంబై :** టీమిండియా ఆల్‌రౌండర్ శివం దూబే తీవ్ర వెన్నునొప్పితో బాధపడుతున్నట్లు తెలుస్తోంది. ఆస్ట్రేలియా టూరుకు రెండు వారాల ముందు అతనికి వెన్ను నొప్పి వచ్చినట్లు ఓ మీడియా కథనం ద్వారా తెలిసింది. అక్టోబర్ 29 నుంచి ఆస్ట్రేలియాతో జరిగే టీ20 సిరీస్‌కు భారత జట్టులో శివం దూబే ఉన్నాడు. వాస్తవానికి శివం దూబే ముంబై జట్టు తరపున రంజీలో ఆడాల్సి ఉన్నది. జమ్మూకశ్మీర్‌తో జరిగే రంజీ మ్యాచ్‌లో ఆడేందుకు కొన్ని రోజుల క్రితం దూబే జమ్మూకు వెళ్లాడు. కానీ అక్కడ ఉన్న కోల్డ్ వెదర్ వల్ల శివం దూబే ఇబ్బంది పడినట్లు తెలుస్తోంది. ప్రాక్టీస్ సమయంలో అతని వెన్ను పట్టేసినట్లు రిపోర్టు ద్వారా తెలుస్తోంది. గాయం తీవ్రం కాకముందే ముంబై జట్టు జాగ్రత్త పడింది. దీంతో అతను మంగళవారం తిరిగి ముంబై చేరుకున్నాడు. మెడికల్ టీమ్ ఇచ్చిన సలహా మేరకు దూబే రెస్టు తీసుకోనున్నాడు. ఆసీస్ టూరుకు ప్రకటించిన 16 మంది సభ్యుల టీ20 బృందంలో శివం దూబే ఉన్నాడు. అయితే ఆ భారీ టూరుకు ముందే దూబేకు గాయం కావడం కొంత ఆందోళనకరంగా కనిపిస్తున్నది. కానీ ఆ సిరీస్ ప్రారంభం కావడానికి ముందే దూబే మళ్లీ ఫిట్ అవుతాడని ఓ మీడియా తన కథనంలో తెలిపింది. ఈ వారం చివరలోగా శివం దూబే ఫిట్ అయ్యే అవకాశాలు ఉన్నట్లు ముంబై టీమ్ నిపుణులు చెబుతున్నారు.


క్రీడా వాయిస్

## చెలరేగిన షమీ..
## భారత సెలెక్టర్లకు దిమ్మతిరిగే కౌంటర్



ఆస్ట్రేలియా పర్యటనకు తనను ఎంపిక చేయని భారత సెలెక్టర్లకు వెటరన్ పేసర్, బెంగాల్ ఆటగాడు మహ్మద్ షమీ దిమ్మతిరిగే కౌంటరిచ్చాడు. ఇవాళ (అక్టోబర్ 15) ప్రారంభమైన రంజీ ట్రోఫీలో ఉత్తరాఖండ్‌పై 4 బంతుల్లో 3 వికెట్లు తీసి టీమిండియాకు అడేందుకు 100 శాతం అర్హుడినన్న సందేశం పంపాడు. షమీ తీసిన 3 వికెట్లలో రెండు క్లీన్ బౌల్డ్‌లు కాగా.. మరొకటి క్యాచ్ ఔట్. షమీతో పాటు ఇషాన్ పోరెల్ (15-3-40-3), సూరజ్ సింధు జైస్వాల్ (19-4-54-4) చెలరేగడంతో ఉత్తరాఖండ్ 72.5 ఓవర్లలో 213 పరుగులకే చాపచుట్టేసింది. ఉత్తరాఖండ్ ఇన్నింగ్స్‌లో భుపేన్ లాల్వాని (71) ఒక్కడే రాణించాడు. మిగతా ఆటగాళ్లలో కనీసం ఒక్కరూ 30 పరుగుల మార్కును తాకలేకపోయారు. ఇదిలా ఉంటే, గత కొంతకాలంగా షమీని భారత సెలెక్టర్లు ఉద్దేశపూర్వకంగా పక్కకు పెడుతున్నారన్న ప్రచారం జరుగుతుంది. 2023 వన్డే ప్రపంచకప్‌లో ఊహలకందని రీతిలో రాణించిన షమీ.. గాయం కారణంగా ఏడాదికాలం పాటు ఆటకు దూరంగా ఉన్నాడు. సుదీర్ఘ నిరీక్షణ అనంతరం ఈ ఏడాది స్వదేశంలో ఇంగ్లండ్‌తో జరిగిన పరిమిత ఓవర్ల సిరీస్‌తో రీఎంట్రీ ఇచ్చాడు. ఆతర్వాత ఛాంపియన్స్ ట్రోఫీలో కూడా ఆడిన షమీ.. ఏడు నెలలుగా జట్టుకు దూరంగా ఉన్నాడు. పూర్తి ఫిట్‌నెస్ సాధించి, దేశవాలీ క్రికెట్‌లో రాణిస్తున్నా సెలెక్టర్లు షమీని పట్టించుకోవడం లేదు. అతను చివరిగా 2023 జూన్‌లో టెస్ట్ మ్యాచ్ ఆడాడు. ఇటీవలి ఇంగ్లండ్ పర్యటనకు అతన్ని ఎంపిక చేస్తారని అంతా అనుకున్నారు. అయితే అలా జరగలేదు. తాజాగా ఆస్ట్రేలియా పర్యటనకైనా ఎంపిక చేస్తారని షమీ పూర్తి విశ్వాసంతో ఉన్నాడు. సెలెక్టర్లు ఈసారి కూడా పట్టించుకోలేదు. తాజాగా అతను ఆసీస్ పర్యటనకు ఎంపిక కాకపోవడంపై స్పందించాడు. ఫిట్‌నెస్ సాకుగా చూపిస్తూ నన్ను పక్కకు పెట్టారు. ఫిట్‌నెస్ లేకపోతే రంజీ ట్రోఫీలో ఎలా ఆడతానన్న అర్థం వచ్చేలా వ్యాఖ్యానించాడు. సెలెక్లరు?, కోచ్, కెప్టెన్ అనుకుంటేనే తాను జట్టులో ఉంటానని అన్నాడు. ఈ వాఖ్యలు చేసిన తర్వాత షమీ బంతితోనే సెలెక్టర్లను సమాధానం చెప్పాలని అనుకున్నాడు. అలాగే చేశాడు. ముమ్మందైనా సెలెక్టర్లు షమీని పరిగణలోకి తీసుకుంటారో లేదో చూడాలి.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...
భక్తి వాయిస్
బిజినెస్ వాయిస్
సినీ వాయిస్ CINEMA
క్రైం వాయిస్
హెల్త్ వాయిస్
కిసాన్ వాయిస్
విద్యా వాయిస్
సక్సెస్ వాయిస్
వనిత వాయిస్
కిడ్స్ వాయిస్
తీర్పు వాయిస్




## రెబల్ ఫ్యాన్స్ బీ రెడీ.. కాటేరమ్మ కొడుకు మళ్లీ వస్తున్నాడు

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ అభిమానులకు గుడ్ న్యూస్. రెబల్ స్టార్ ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా అక్టోబర్ 23న అభిమానులకు అదిరిపోయే ట్రీట్ రాబోతుంది. ప్రభాస్ నటించిన బ్లాక్ బస్టర్ చిత్రం 'సలార్: పార్ట్ 1 సీజ్‌ఫైర్' మళ్లీ రీ రిలీజ్ చేయబోతున్నారు మేకర్స్. దీనికి సంబంధించి హొంబలే ఫిలిమ్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ప్రశాంత్ నీల్ దర్శకత్వం వహించిన ఈ సినిమా 2023 డిసెంబర్ 22న ప్రేక్షకుల ముందుకు వచ్చి సూపర్ హిట్‌ను అందుకోవడమే కాకుండా బాక్సాఫీస్ వద్ద దాదాపు రూ.700 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది.

## 19న అసలు సీక్రెట్ బయటపడుతుంది

సక్సెస్, ఫ్లాప్స్‌లతో సంబంధం లేకుండా ప్రజెంట్ బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో ప్రేక్షకులను అలరిస్తున్న యంగ్ బ్యూటీ శ్రీలీల.. తాజాగా తన ఇన్‌స్టా వేదికగా ఇంట్రెస్టింగ్ పోస్ట్ పెట్టింది. ఓ స్టైలిష్ పోస్టర్ షేర్ చేస్తూ.. 'రెడీ.. స్టడీ.. ఫైర్.. ఏజెంట్ మిర్చిగా శ్రీలీల' అనే కోట్స్ పెట్టింది. ఇందులో బ్లాక్ కాస్ట్యూమ్, గాగుల్స్‌తో కనిపించిన శ్రీలీల లుక్ చూసి ఒక్కసారిగా షాక్ అవుతున్నారు ఫ్యాన్స్. అంతే కాకుండా.. ఈ పోస్ట్‌కు 'అక్టోబర్ 19న అసలు సీక్రెట్ బయటపడుతుంది' అనే క్యాప్షన్ జత చేయడంతో ఇది సినిమాకి సంబంధించిన పోస్టరా? లేక వెబ్ సిరీస్ ప్రమోషనా? అంటూ చర్చలు స్టార్ట్ చేశారు ప్రేక్షకులు. అయితే.. ఇండస్ట్రీ నుంచి అందుకున్న సమాచారం మేరకు ఇది ఓ హిందీ ప్రాజెక్ట్ అయ్యే అవకాశం ఉందట. ఈ ప్రాజెక్ట్‌తో శ్రీలీల పాన్ ఇండియా స్థాయిలో అడుగుపెట్టనున్నట్లు తెలుస్తుండగా.. ఇది ఆమె కెరీర్‌కు కీలక మలుపు కావచ్చని టాక్. ప్రజెంట్ ఈ పోస్ట్ వైరల్ అవుతుండగా.. శ్రీలీల లుక్‌కు ఫిదా అవుతున్నారు ఫ్యాన్స్. కాగా.. అసలు ఏజెంట్ మిర్చి రహస్యం ఏంటీ.. అక్టోబర్ 19న ఏం జరగబోతున్నది అనేది త్వరలో తెలియనుంది.



## కాంతారను కాపాడిన కోర్టు తీర్పు



బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టిస్తున్న కాంతార చాప్టర్ 1 ఏ లెజెండ్ ఇంకా థియేటర్ రన్ బలంగా కొనసాగిస్తూనే ఉంది. తెలుగులో నెమ్మదించినప్పటికీ మళ్లీ దీపావళికి పికప్ అవుతుందన్న నమ్మకం బయ్యర్లలో కనిపిస్తోంది. ఇదిలా ఉండగా ఈ సినిమా విడుదలకు ముందు కర్ణాటక ప్రభుత్వం తీసుకొచ్చిన ధరల నియంత్రణ జిఓ మీద హొంబాలే ఫిలిమ్స్ తో పాటు మల్టీప్లెక్స్ అసోసియేషన్ కోర్టుకు వెళ్లడం, వాళ్లకు అనుకూలంగా వాయిదా తీర్పు రావడం చేసిన మేలు అంతా ఇంతా కాదు. ఇప్పటిదాకా శాండల్ వుడ్ లో కాంతారా చాప్టర్ 1 వసూలు చేసిన గ్రాస్ సుమారు 160 కోట్లకు పైనే ఉంటుందని అక్కడి ట్రేడ్ రిపోర్ట్. ఒకవేళ జిఓ యధాతథంగా అమలైపోయి టికెట్ రేట్ 200, 236 రూపాయలు మించకపోయి ఉంటే ఇప్పుడొచ్చిన మొత్తంలో కనీసం 50 కోట్లకు పైగా చిల్లు పడేదని ఓపెన్ గా చెప్పేస్తున్నారు. అంటే ఒక పెద్ద ఏరియాకు పాడుకున్నంత సొమ్ము ఇది. ఈ రకంగా చూసుకుంటే న్యాయస్థానం జడ్జ్ మెంట్ వల్ల కాంతారా చాలా పెద్ద ప్రయోజనం పొందింది. ఎందుకంటే బెంగళూరు మల్టీప్లెక్సుల్లో స్క్రీన్లు, వసతులను బట్టి 500 నుంచి 2000 రూపాయల దాకా టికెట్ రేట్లు ఉన్నాయి. అవన్నీ తగ్గించుకోవాల్సి వచ్చేది. తీర్పుకు ముందు దాన్ని పాటించారు కూడా. ఆ కొంత టైంలోనే జనాలు తక్కువ ధరల్లో ఎంజాయ్ చేశారు. అయితే కోర్టు ఇచ్చింది తాత్కాలిక ఉపశమనం మాత్రమే. త్వరలో జరగబోయే వాయిదాలో సిద్దరామయ్య సర్కార్ తమవైపు వాదనలతో సిద్ధంగా ఉంది. ఒకవేళ అవి బలంగా ఉంటే జీవో మళ్లీ తిరగదోడే అవకాశాలు లేకపోలేదు.

## అలాంటి సీన్స్ చేయడానికి భయపడ్డాను



బాలీవుడ్ యంగ్ హీరోయిన్ సోనమ్ బజ్వా వరుస సినిమాలతో బ్లాక్ బస్టర్ హిట్స్‌ను తన ఖాతాలో వేసుకుంటుంది. ఇటీవల 'హౌస్‌ఫుల్-5' మూవీతో సూపర్ హిట్ అందుకుంది.ప్రస్తుతం 'ఏక్ దివానే కి దివానీయత్' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. హర్షవర్ధన్ హీరోగా నటిస్తున్న ఈ మూవీ అక్టోబర్ 21న విడుదల కానుంది. ఈ క్రమంలో.. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న సోనమ్ ఆసక్తికర కామెంట్స్ చేసింది. "పంజాబ్‌లో అందరూ ఒకే అంటారా అని ఆలోచించి.. నేను బాలీవుడ్‌లో కొన్ని ఆఫర్‌లను వదులుకున్నాను.మా ఇంట్లో వాళ్ళు కూడా చూస్తారు కదా అనే మనస్తత్వం నాకు ఉంది. ఆ సమయంలో కిస్సింగ్ సీన్స్ చేయడానికి నేను చాలా భయపడ్డాను. ప్రజలు దానికి ఎలా స్పందిస్తారు? నన్ను మార్చిన నా కుటుంబం ఎలా స్పందిస్తారు? ఇది కేవలం సినిమా కోసమే అని నా కుటుంబం అర్థం చేసుకుంటుందా? అనే ప్రశ్నలు నా మనసులో చాలా మెదిలాయి. చాలా రోజులు అలాంటి ఆలోచనలతోనే సతమతమయ్యాను. రెండు సంవత్సరాల క్రితం నేను చివరికి మా అమ్మానాన్నలతో దీని గురించి మాట్లాడాను. దానికి వారు 'అవును, అది సినిమా కోసమే అయితే పర్వాలేదు' అని అన్నారు. అది విన్న తర్వాత నేను చాలా షాక్ అయ్యాను. ఆ తర్వాత నేను ఆలోచిస్తూనే ఉన్నాను. నేను వారితో ఎందుకు ముందుగా మాట్లాడలేదా? అని ఫీల్ అయ్యాను. చాలా ఆలోచనలు పెట్టుకొని దాని గురించి ప్రస్తావించడానికి కూడా నేను సిగ్గుపడ్డాను. కానీ వారు మాత్రం ఇది సినిమా కోసం కాబట్టి మాకు ఎటువంటి సమస్య లేదు నటించమని చెప్పారు. అందుకే అప్పటినుంచి ఎలాంటి పాత్రలైనా చేయాలని డిసైడ్ అయ్యాను. విభిన్న పాత్రలో నటించాలని ఉంది" అని చెప్పుకొచ్చింది.

## సాయితేజ్ పాన్ ఇండియా సినిమా



మెగాహీరో సాయితేజ్ నుంచి గత రెండేళ్లుగా ఎలాంటి సినిమా రాలేదు. 2023లో 'విరూపాక్ష'తో సక్సెస్ అందుకున్నప్పటికీ.. పవన్‌తో కలిసి నటించిన 'బ్రో' ఫ్లాప్ అయింది. మళ్లీ ఇన్నాళ్లకు 'సంబరాల ఏటిగట్టు' అనే మూవీతో రాబోతున్నాడు. సాయితేజ్ పుట్టినరోజు సందర్భంగా ఇప్పుడు గ్లింప్స్ రిలీజ్ చేశారు. ఈ చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేయబోతున్నారు. గ్లింప్స్ బట్టి చూస్తే మాస్ యాక్షన్ మూవీ అని క్లారిటీ వచ్చింది. అయితే విజువల్స్ అన్నీ 'కేజీఎఫ్'లో నరాచీని గుర్తుచేసేలా కనిపించాయి. సాయితేజ్ బాడీ బిల్డింగ్ అంతా బాగానే ఉంది. గ్లింప్స్‌లోనూ కథ ఎలా ఉండబోతుందనే రివీల్ చేశారు. లెక్క ప్రకారం గత నెలలోనే సినిమా రిలీజ్ చేస్తామని చాన్నాళ్ల క్రితం ప్రకటించారు. కానీ షూటింగ్ ఇంకా జరుగుతూనే ఉంది. ఇప్పుడు కూడా గ్లింప్స్‌లో మూవీ రిలీజ్ డేట్ వేయలేదు. మరి ఈ ఏడాది తీసుకొస్తారా లేదంటే వచ్చే ఏడాది థియేటర్లలోకి మూవీ వస్తుందా అనేది చూడాలి?

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603, viswamvoice@gmail.com